701728

VISALAANDHRA, VIJAYAWADA-4. Phone 376
* * * Regd No. H- 203

విశాలాంధ్ర

సంపుటి 14 సంచిక 111] విజయవాడ • 5-7-1964 ఆదివారం [8 పేజీలు 13 న. పై.

కంచి
ధర్మవరం
బెంగుళూరు
బెనారస్
పట్టుచీరలకు
లక్ష్మి జనరల్ స్టోర్సు గవర్నరుపేట విజయవాడ-2

ధరలకంట్రోలు, తదితర సమస్యలపై చర్చలకు
కేంద్రమంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం హైద్రాబాద్ రాక
మంత్రులతో, వ్యవసాయశాఖ ఉద్యోగులతో, వ్యాపారస్తులతో
తాను చర్చించనున్నట్లు ఆహారమంత్రి వెల్లడి

హైద్రాబాద్, జూలై 4

ధరల కంట్రోలుకై ఆంధ్ర ప్రభుత్వం ఇటీవల ఒక పథకాన్ని కేంద్రానికి సమర్పించిందనీ, ఇతర అంశాలతోపాటు, ఆ పథకాన్ని కూడా రాష్ట్రమంత్రులతో తాను చర్చించ నున్నాననీ నేటి ఉదయం ఢిల్లీనుండి ఇక్కడకు వచ్చిన కేంద్ర ఆహారమంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం పత్రికలవారితో మాట్లాడుతూ అన్నారు

శ్రీ సుబ్రహ్మణ్యం ఇంకా ఇలా అన్నారు: "దక్షిణ మండలానికి సంబంధించిన ప్రత్యేక సమస్యలతోబాటు, ధరల కంట్రోలు, ఆహారోత్పత్తి పెంపుదల మొదలైన సమస్యలను కూడా మేము చర్చిస్తాము. రాష్ట్రమంత్రులతో, వ్యవసాయశాఖ ఉద్యోగులతో, వ్యాపారస్తులతో ఆహారం, ధరల విషయమై నేను చర్చలు చేయనున్నాను" అని అన్నారు.

మంత్రుల సంభాషణలు రేపు ఉదయంతో పూర్తి అవుతాయను కుంటున్నారు.

ప్రభుత్వం చేసినప్పటికీ గత రెండు, మూడు రోజులలో కొన్ని ప్రాంతాలలో ధరలు పెరిగిన విషయం విలేకరులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ఏ ప్రాంతంలో అలా జరిగిందో తనకు తెలియదని శ్రీ సుబ్రహ్మణ్యం అన్నారు.

మరొక ప్రశ్నకు సమాధానం చెబుతూ, తరువాత పెద్దధరలు సంపాదించవచ్చుననే ఆశతో కొంతమంది ప్రజలు ఆహారధాన్యాలను దాచి వేస్తున్నారన్నారు. ఆ విధంగా చేయకుండా చేయగలపరిస్థితిని మనం తీసుకువస్తే దాచిన ఆహారధాన్యాలు మార్కెట్టులోకి వస్తాయన్నారు.

దక్షిణమండలంలో బియ్యం స్వేచ్ఛా రవాణా జరుగుటం మూలకంగా ఆంధ్రప్రదేశ్ వంటి మిగులు రాష్ట్రంలో కొరత ఏర్పడుతుందనడానికి ఆధారం లేదన్నారు.

తరుగు రాష్ట్రమైన కేరళ రాష్ట్రానికి, ఆంధ్ర బియ్యం పెద ఎత్తున కొనగలశక్తి లేదన్నారు. మహారాష్ట్రకు బాగా కొనగల శక్తి ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం పెద్ద మొత్తాలలో కేంద్ర నిల్వలనుండి తరుగు ప్రాంతాలకు సరఫరా చేస్తోందన్నారు.

దక్షిణమండలంలో ధాన్యం ఉత్పత్తి లోగడ కంటే హెచ్చుగనే ఉందనీ, ఆ మండలం స్వయం పోషకం కాగలదనీ చెప్పారు.

మహారాష్ట్రలోనూ, దక్షిణ మండలంలోనూ గోధుమల అధికధరల విషయంపై వచ్చిన ప్రశ్నకు సమాధానం చెబుతూ దిగుమతి చేసుకొన్నగోధుమలను ఎంతైనా ఎక్కడికైనా ప్రభుత్వం సరఫరా చేయగలదు గనుక ఆ గోధుమలను చౌకధరకు సంపాదించడంలో కష్టమేమీ లేదన్నారు.

అయితే దేశవాళీ గోధుమల విషయంలో మాత్రం ఇబ్బంది ఉందనీ, మహారాష్ట్రంలో దేశవాళీ గోధుమల ధరలు మాత్రమే ఎక్కువగా ఉన్నాయనీ చెప్పారు

మంచి గోధుమలు యితర చోట్ల దొరకక ఇబ్బంది పడుతుండగా పంజాబ్‌లో పశువుల మేతకు బదులు గోధుమలను పశువులకు మేపుతున్నారని పత్రికలలో వచ్చిన వార్తల విషయం ప్రస్తావించి, ఆ వార్తలు వాస్తవం కావన్నారు.

4 వేల టన్నుల ఆహార ధాన్యాలు
మహారాష్ట్ర జిల్లాలకు
ఒక్క రోజునే సరఫరా

బొంబాయి జూలై 4

మహారాష్ట్రలోని వివిధ జిల్లాలకు రోడ్డు రైలు మార్గాలద్వారా నిన్న ఒక్క రోజునే నాలుగువేల రెండువందల టన్నుల ఆహార ధాన్యాలు సరఫరా చేశారు.

మహారాష్ట్ర ఆహార, సరఫరాశాఖా మంత్రి శ్రీ తలియార్‌ఖాన్ యీ విషయాన్ని నేటి రాత్రి యిక్కడ ప్రకటించారు.

ఇవిగాక పెద్ద వ్యాగన్ల ఆహారధాన్యాలు మద్రాసు నుండి బయలు దేరాయనీ, రైలు, రోడ్డు రవాణా ద్వారా నాలుగువేల టన్నులు మార్మ్‌గోవా రేవునుండి రాష్ట్రంలోని వివిధజిల్లాలకు రేపటి నుండి సరఫరా అవుతాయని కూడా శ్రీ తలియార్‌ఖాన్ తెలియ జేశారు.

ఒరిస్సా ముఖ్యమంత్రి మిత్రాపై ఆరోపణలు
కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డు ఆదేశం

న్యూఢిల్లీ, జూలై 4

తనపై వచ్చిన ఆరోపణలను విచారింపుతున్న న్యాయవాదుల కమిటీ అడిగే ప్రశ్నలకు త్వరత్వరగా సమాధానాలను పంపించవలసిందిగా ఒరిస్సా ముఖ్యమంత్రి శ్రీ బిరేన్ మిత్రాను కాంగ్రెసు పార్లమెంటరీ బోర్డు నేడు కోరింది

ప్రభుత్వంతో పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తున్న ఒక కంపెనీలో శ్రీ బిరేన్‌మిత్రా డైరక్టరుగా వున్నారు. ఆ విషయమై దర్యాప్తు సాగుతోంది.

ఆరోపణలను విచారించడానికి కాంగ్రెసు అధ్యక్షుడు ఒకన్యాయవాదుల కమిటీని నియమించారు. తమకు శ్రీ బిరేన్ మిత్రా నుండి జవాబులు రావటం [illegible] దని ఆ కమిటీ కాంగ్రెసు అధ్యక్షునికి ఫిర్యాదు చేసింది.

ఆ ఫిర్యాదును ఆధారం చేసుకొనే త్వరత్వరగా జవాబులను పంపవలసిందిగా యిప్పుడు పార్లమెంటరీబోర్డు ఆదేశించింది.

ఈవేళ జరిగిన కాంగ్రెసు పార్లమెంటరీ బోర్డు సమావేశానికి శ్రీ కామరాజ్, శ్రీమతి ఇందిరాగాంధీ, శ్రీ మురార్జీ దేశాయి, శ్రీ జగ్జీవన్‌రాం, శ్రీ ఎస్ కె పాటిల్, శ్రీ నందా హాజరయ్యారు.

బియ్యం దొంగనిల్వలు మార్కెట్టుకు తరలించే సమస్య:
శాసనసభలో ఆహారమంత్రి ప్రకటన

హైదరాబాదు, జూలై 4

బియ్యపు దొంగనిల్వలను మార్కెట్టులోనికి తరలించే విషయంలో తగు చర్యలను ప్రభుత్వం గైకొనగలదని ఆహార, వ్యవసాయ శాఖామాత్యులు శ్రీ ఎ బలరామిరెడ్డిగారు నేడు శాసనసభలో ప్రకటించారు.

శ్రీ వెల్లంకి విశ్వేశ్వరరావు ప్రశ్నకు సమాధానమిస్తూ మిల్లర్లు మధ్యదళారీలనుండిగాక, నేరుగా రైతులవద్దనుండే బియ్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించలేదని మంత్రిగారు చెప్పారు.

బ్యాంకు ఋణాలను పొంది భూస్వాములు బియ్యాన్ని నిల్వచేస్తున్నారని శ్రీ తెన్నేటి విశ్వనాధం, చెప్పారు, నిల్వలను ఎవరు దాచేశారనేది స్పష్టంగా తనకు తెలియదనీ, మొత్తం మీద ఈసంవత్సరం మార్కెట్టులోనికి బియ్యం తక్కువగా వస్తున్నదనీ మంత్రిగారు చెప్పారు

కేంద్ర ఆహారశాఖ మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం రాష్ట్ర ప్రభుత్వంతో చర్చల నిమిత్తం రేపు ఇక్కడకు రానున్నారని, నిల్వలను విడుదలచేసే సమస్యపై వారితో చర్చించి తగు చర్యను తీసుకోగలమని శ్రీ బలరామిరెడ్డిగారు ప్రకటించారు.

శ్రీ ఎ. సర్వేశ్వరరావు, శ్రీ వంకా సత్యనారాయణ, శ్రీ పి. శ్యామసుందరరావుగార్లకు సమాధానం చెప్తూ మార్కెటింగ్, వ్యవసాయశాఖా కార్యాలయాలను కలిపివేసే విషయమై ఆలోచిస్తున్నామనిమంత్రిగారుతెలిపారు.

పండ్ల తోటల అభివృద్ధి పథకం

8 లక్షల రూపాయలను పండ్ల తోటల అభివృద్ధి పథకానికై కేటాయించామనీ, ఆ పథకం క్రింద ఎకరాకు రూ. 300 చొప్పున దీర్ఘ కాల ఋణాలుగా మంజూరు చేయ బడతాయని శ్రీ పి. రాజగోపాలనాయుడు గారికి మంత్రిగారు చెప్పారు. కోడూరు వద్దకు పండ్లనునిలవ చేసే ఫ్యాక్టరీని నిర్మించదలచామని, అందుకై ఈ సంవత్సరం బడ్జెట్టులో రూ 8 లక్షల కేటాయించడమైనదని తెల్పారు. వ్యవసాయ డైరెక్టరు వివరాలను సేకరించిన తరువాత, విదేశీనిపుణుల సలహాలను పొంది ఈపథకానికి తుదిరూపం ఇవ్వబడుతుందన్నారు.

కేంద్ర ప్రభుత్వం తెగుళ్ళ నివారణ పథకాన్ని రూపొందించి 5 లక్షల రూపాయల విలువచేసే తెగుళ్ళ నివారణ ఔషధాలను సప్లయి చేసిందనీ కృష్ణాజిల్లాలో కొన్నిగ్రామాలలో ఈ పథకాన్ని అమలు జరిపారని, మిగతా జిల్లాలకుగూడా ఈ పథకాన్ని విస్తరింపజేసే విషయమై కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు సాగించగలదని వ్యవసాయ శాఖామంత్రిగారు చెప్పారు.

20 మంది దొంగ వర్తకుల అరెస్టు
గ్వాలియర్ పోలీసులచే

గ్వాలియర్, జూలై 4

భారతరక్షణ చట్టంక్రింద గ్వాలియర్ నగరంలోని 20 మంది అధికలాభార్జనపరులైన దొంగ వ్యాపారస్తులను పోలీసులు అరెస్టు చేశారు.

గత మూడు రోజులుగా దొంగ వర్తకులకు వ్యతిరేకంగా పోలీసులు కార్యక్రమం చేపట్టారు.

ఈ అరెస్టుఅయిన వారిలో 18 మందిని నిన్న అరెస్టుచేశారు.

అధిక లాభార్జన పరులైన దొంగ వర్తకులను, సాంఘిక వ్యతిరేక శక్తులపై పోలీసులు తీవ్రంగా చర్యలు తీసుకుంటున్నారని నగర పోలీసు సూపరెంటు పత్రికల వారితో చెప్పారు.

మొరిగే కుక్క కరుస్తుందట!
వ్యాపార వర్గాలకు
సుబ్రహ్మణ్యం హెచ్చరిక

న్యూఢిల్లీ, జులై 4

దేశ ప్రజలను నష్టపరిచే అక్రమ వ్యాపార పద్ధతులను సహించబోమని కేంద్ర ఆహార, వ్యవసాయ శాఖల మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం నిన్న మరోసారి హెచ్చరించారు

ప్రభుత్వంచేసే హెచ్చరికలను వ్యాపార వర్గాలు పెద్దగా లక్ష్యపెట్టడంలేదని ఒక విలేకరి వ్యాఖ్యానించగా ఆయన, 'కుక్కలు మొరుగుతాయని మాత్రమే అనుకోకండి. వాటికి కరవడం కూడా చేతవును' అని సమాధాన మిచ్చారు.

లండన్‌లో శ్రీమతి ఇందిర, టి. టి. కె. కార్యక్రమం

లండన్ జూలై 4

లండన్‌లో జరగబోయే కామన్వెల్తు ప్రధాన మంత్రుల సమావేశానికి హాజరయ్యే నిమిత్తం భారత అర్థికమంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి, బ్రాడ్‌కాస్టింగ్ శాఖ మంత్రి శ్రీమతి ఇందిరా గాంధి ఈ నెల 7 వ తేదీన యిక్కడికి చేరుతారు. వీరు వచ్చిన వెంటనే వీరికి తీరికలేనికార్యక్రమం లండన్‌లో ఎదురుచూస్తున్నది.

కామన్వెల్తు ప్రధాన మంత్రుల సమావేశం ఈ నెల 8 వ తేదీనుండి ప్రారంభమవుతుంది.

వీరిద్దరూ లండన్ విమానాశ్రయంలో దిగిన 90 నిమిషాలలోనే అక్కడ భారతీయ పాత్రికేయుల సమాఖ్య అతిధులుగా వుంటారు. లండన్ నగర మధ్యభాగంలోఉన్న రాయల్ హోటల్లో వీరికి భారతీయ పాత్రికేయుల సమాఖ్య విందు చేస్తుంది ఈ సమయంలోనే వారు కామన్వెల్తు ప్రధానమంత్రుల సమావేశం గురించి వార్తల సేకరణకు వచ్చిన ప్రపంచ ప్రముఖ పాత్రికేయులను ఎక్కువమందిని కలుసుకుంటారు.

అదేరోజు సాయంత్రం వీరికి భారత - పాకిస్తాన్-బర్మా అసోసియేషన్ టీపార్టీ యిస్తుంది.

మరుసటిరోజు భారతీయ నాటక బృందం ప్రదర్శించే 'భారతదేశ యాత్ర' అన్ననాటకాన్ని తిలకిస్తారు

9 వ తేదీన బ్రిటిష్ పరిశ్రమల ఫెడరేషన్ ఛైర్మన్ నార్మన్ కిప్పింగ్ తో శ్రీ కృష్ణమాచారి విందారగిస్తారు. అదేరాత్రి శ్రీమతి ఇందిరా, టి. టి. కె. బకింగ్‌హాం భవనంలో బ్రిటిష్ రాణి యిచ్చే విందుకు హాజరౌతారు.

పదవతేదీన లేబరుపార్టీ నాయకులుహెరాల్డ్ విల్సన్‌తో కృష్ణమాచారి విందారగిస్తారు. మరునాడు భారత ప్రతినిధు లిద్దరినీ రస్సెల్ కలుసుకొంటారు. అదేరోజు సాయంత్రం లండన్‌లోని భారతీయ హైకమిషనర్ చేసే విందులో వీ రుభయులూ ముఖ్య అతిధులుగా వుంటారు.

12 వ తేదీన శ్రీ కృష్ణమాచారి బ్రిటిష్ ప్రధానమంత్రి అతిధిగా వుంటారు.

13 వ తేదీన శ్రీమతి ఇందిరా గాంధి టాగూరు స్మారకోపన్యాసాలను ప్రారంభోత్సవం చేస్తారు. తరువాత బ్రిటిషు ప్రధాన మంత్రి కామన్వెల్తుదేశాల ప్రధాన మంత్రులకు, ప్రతినిధులకు ఇచ్చే విందులో పాల్గొంటారు.

14వ తేదీన కృష్ణమాచారి తిలక్ సంస్మరణ సభలో ప్రసంగిస్తా అదేరోజున కామన్వెల్తు ప్రధానమంత్రుల సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన ప్రతినిధులందరికీ బ్రిటిష్ రాణి విందు చేస్తారు.

* * *

హట్టిగనుల్లో ఉత్పత్తి అయ్యే 990 వన్నె బంగారం యీనెల మొదటి తేదీ నుండి 10 గ్రాములకు రు. 116 ల చొప్పున నిర్ణయించారు.

ప్రజాశక్తి నగర్‌లో తెల్లవారు జామున అగ్ని ప్రమాదం
మూడు యిళ్లు దగ్ధం

విజయవాడ జూలై 4

విజయవాడలోని ప్రజాశక్తినగర్‌లో నేటి తెల్లవారు ఝామున నాలుగు గంటల వేళ అగ్ని ప్రమాదం సంభవించింది. మూడు పూరిండ్లు, ఒక పశువులపాక దగ్ధమైపోయాయి

జనమంతా ప్రశాంతంగా నిద్రపోతున్న సమయంలో ఈ దుర్ఘటన జరగటంతో, ప్రజాశక్తినగర్ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలంతా ఉలిక్కిపడి లేచారు. ఆ మంటలు చూసి దిగ్భ్రాంతులయ్యారు. వర్షాకాలం వచ్చినా, ఈ అగ్నిప్రమాదాలకు అంతూ, అదుపూ లేకపోతే ఎలా అని ఆందోళన చెందుతున్నారు.

మొదట నిప్పు అంటుకొన్న పూరింటిలో నిద్రిస్తున్నవారు మంటల వేడికి మెలకువ రాగా, హఠాత్తుగా బయటపడి ప్రాణాలు దక్కించుకున్నారు.

అగ్నిమాపక దళ సేవనుకు ఫోను చేయ ప్రయత్నిస్తే, [illegible] ఎత్తేవారు లేరని [illegible] ప్రముఖులు ఒకరు వ్యక్తిగతంగా వారికి చెప్పారు. [illegible] అగ్నికి ఆహుతి కాకుండా కాపాడ గలిగి వుండేవని స్థానికులు అభిప్రాయపడు తున్నారు.

సత్యనారాయణపురం స్టేషన్ దగ్గర మరొక అగ్ని ప్రమాదం

సత్యనారాయణపురం స్టేషన్ ఎదురుగా (బాబాజీపేటలోని) ఒక పూరిల్లు ఈరోజు ఉదయం 11 గంటలవేళ అగ్ని ప్రమాదానికి గురియై కాలిపోయింది.

వెంటనే మంటలను ఆర్పివేశారు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

కావాలని ఎవరో నిప్పు పెట్టారని ఇంటావిడ చెబుతున్నది. (వి. వి)

సీతన్నపేట కేసు ఛార్జిషీటు దాఖలు
విజయవాడ అగ్నిప్రమాదాల సందర్భంలో

విజయవాడ, జూలై 4

విజయవాడలోని సీతన్నపేట గృహదహనాలకు శ్రీమతి కె గౌరమ్మ, శ్రీయుతులు యమ్. వి. దుర్గారావు, యన్. అప్పారావులు బాధ్యులని సి. ఐ. డి. ఇన్‌స్పెక్టర్ శ్రీ బి నారాయణప్ప నేడు స్థానిక 2 వ క్లాసు మేజిస్ట్రేటు కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు.

విచారణ 10 వ తేదీకి వాయిదా పడింది.

సీతన్నపేట ప్రాంతం కాంగ్రెసుకు బలమయిన కేంద్రమయినందున, గత ఎన్నికలలో తమ పార్టీకి అక్కడి ప్రజలు తామాశించిన విధంగా ఓటు వేయనందున, ప్రజలపై కక్షసాధించేందుకుగాను అతివాద కమ్యూనిస్టులయిన పై ముగ్గురు ఈ దుండగానికి పాల్పడ్డారని ఛార్జిషీటులో పేర్కొన్నారు. [illegible] ఫెజోన్ పేట ప్రాంతంలో జరిగిన గృహదహనాలవల్ల ఏర్పడ్డ భయ వాతావరణాన్ని తమ ప్రయోజనాలకు ముద్దాయిలు వినియోగించుకున్నారని ఛార్జిషీటులో పేర్కొన్నారు.

ఆ పేటలో వున్న మరుగుదొడ్డి ప్రక్కన గల [illegible] గౌరమ్మను దుర్గారావు, అప్పారావులు ప్రోత్సహించారని కూడా ఆ కేసులో వుంది.

కృష్ణలంక ఫెజోన్‌పేట కేసులు సెషన్స్ కోర్టుకు పంపడానికి నిర్ణయం

ఫెజోన్ పేట కృష్ణలంక గృహదహనాల కేసులను కృష్ణాజిల్లా సెషన్స్ కోర్టుకు పంపుతున్నట్లు మేజిస్ట్రేట్ నేడు ప్రకటించాడు.

* * *

సైప్రస్ కాపలాదళాల అధిపతిగా నియమకులయిన జనరల్ తిమ్మయ్య నేడు ఐరాస ప్రధాన కార్యదర్శిని కలుసుకున్నారు.

పౌరసత్వ చట్టానికి అమెరికాలో ప్రతిఘటన
కోర్టుల కెక్కాలని కొందరు రాష్ట్రగవర్నర్ల యోచన

న్యూయార్క్, జూలై 4

అమెరికాలో శ్వేతజాతీయులతోపాటు నీగ్రోలకు కూడా సమాన పౌరసత్వాలను మంజూరు చేస్తున్న కొత్త చట్టం నేటినుంచి అమలులోకి వచ్చింది.

అమెరికన్ కాంగ్రెసు ఉభయసభల ఆమోదం పొందిన కొత్తపౌరసత్వాల బిల్లుపై ప్రెసిడెంట్ జాన్సన్ గతరాత్రి సంతకం చేయడంతో అది శాసనమైంది. ఈ శాసనం ఆచరణలో ఎంతవరకు అమలులోకి వస్తుందో తేల్చుకోవడానికి నీగ్రోలు దేశమంతటా యీవేళ ఉదయం ప్రయోగాలు ప్రారంభించారు.

జార్జియాలోని అట్లాంటాలో ముగ్గురు, శ్వేత జాతీయులకు ప్రత్యేకించిన హోటళ్లలో ప్రవేశించగా, ఆ హోటల్ యజమాని రివాల్వరు తీసుకొని, ఆ నీగ్రోల వెంటబడ్డాడు. మరికొందరు శ్వేతజాతీయులు గొడ్డళ్ళు పుచ్చుకొని, నీగ్రోలను తరిమారు. తాను జైలుకి వెళ్ళడానికైనా సిద్ధమేగాని, తన హోటలులోకి నీగ్రోలను ప్రవేశింప నివ్వనని ఆ యజమాని అంతకుముందు ప్రకటించాడు.

కాన్సాస్ నగరంలో తెల్లవారికి చెందిన క్షౌరశాలలో పదమూడు సంవత్సరాల నీగ్రో బాలునికి నేటి ఉదయం క్షురకర్మ చేశారు.

వర్జీనియాలోని ఒక హోటల్‌ను దాని యజమాని నేడు మూసివేశాడు. "నేనుడబ్బును పోగొట్టుకొనడానికైనా సిద్ధమే కాని సూత్రాలను మాత్రం వదలుకోను" అని ఆ యజమాని ప్రకటించాడు.

శ్వేత జాతీయ దురహంకారులైన కొందరు రాష్ట్రగవర్నర్లు కొత్త శాసనం చెల్లనేరదటూం కోర్టులో దావాలు వేయడానికి సిద్ధపడుతున్నారు. ఇలా కోర్టులకు ఎక్కనున్న గవర్నర్లలో అలబామా, మిస్సిసిపీ రాష్ట్రాల గవర్నర్లు కలరు.

'ఏ' తరగతి నగరంగా హైద్రాబాద్
శాసనసభలో మంత్రి వివరణ

హైద్రాబాద్, జూలై 4

హైద్రాబాద్ నగరాన్ని 'ఏ' తరగతి నగరంగా చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించిందనీ, అయితే ఈ నగర జనాభా 15 లక్షలకు లోపుగా ఉండటంవలన ఆవిధంగా గుర్తించడానికి వీలుపడదనీ నేడు శాసనసభా ప్రశ్నోత్తరాల సమయంలో శ్రీ అత్తలూరి సర్వేశ్వరరావుగారి ప్రశ్నకు స్థానిక సంస్థల మంత్రి శ్రీ అలపాటి వెంకట్రామయ్య సమాధానం యిచ్చారు.

కేవలం జనాభాను మాత్రమేగాక, ధరలు, జీవనవ్యయం మున్నగువాటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని శ్రీ సర్వేశ్వరరావు కోరారు. కేంద్రానికి తామీ విషయాన్ని తెలియజేశామన్నారు.

* * *

సమాజంలో యేర్పడే సాంఘిక ఆర్థిక సంఘర్షణలను సర్దుబాటు చేయడమే న్యాయ శాస్త్ర ప్రయోజనమని శ్రీ గజేంద్ర గడ్కర్ చెప్పారు.

సోవియట్ సూచనకు బ్రిటన్ నిరాకరణ
లావోస్‌లో అమెరికా విమాన దాడులపై మౌనముద్ర

లండన్, జూలై 4

లావోస్‌లో అమెరికా సాగిస్తున్న విమాన దాడులను ఖండించాలని సూచిస్తూ సోవియట్ యూనియన్ చేసిన ప్రతిపాదనను బ్రిటన్ నిరాకరించినట్లు నేడిక్కడ బ్రిటిషు విదేశాంగ శాఖ కార్యాలయంలో విచారించగా తెలియ వచ్చింది.

జెనీవా మహాసభ సహాధ్యక్షులైన సోవియట్ యూనియన్, బ్రిటనులు రెండూ కలసి, అమెరికన్ విమానదాడులను ఖండిస్తూ ఒక సందేశంపై సంతకం చేయాలని సోవియట్ యూనియన్ తన ప్రతిపాదనలో సూచించింది.

పక్షపాత ప్రకటనలవల్ల లావోస్ సమస్యా పరిష్కారానికి దోహదం చేకూరదని బ్రిటన్ భావిస్తున్నదట. అందరికీ ఆమోదకరమైన ప్రాతిపదికపై నిర్మాణాత్మక సంప్రతింపులకు దారితీసే ఏర్పాట్లు చేయడంలో సోవియట్ సహకారాన్ని పొందడంకోసం బ్రిటన్ తన ప్రయత్నాన్ని కొనసాగించదలచుకొన్నట్లు బ్రిటిషు విదేశాంగ శాఖ ప్రతినిధి తెలిపారు

తూర్పు పాకిస్తాన్ కాందిశీకులరాక తగ్గుదల

న్యూఢిల్లీ, జులై 3

తూర్పు పాకిస్తాన్ నుండి వలస వచ్చే కాందిశీకుల సంఖ్య మేనెలతో పోల్చి చూస్తే గత నెలలో తగ్గింది. మే నెలలో సగటున రోజుకు మూడువేల ఎనిమిదివందలమంది వస్తే, జూన్ నెలలో రెండువేల ఎనిమిది వందల మంది మాత్రమే వచ్చారు

తాజాగా అందిన సమాచారాన్నిబట్టి తూర్పు పాకిస్తాన్‌నుండి భారత దేశానికి యింతవరకూ వచ్చిన కాందిశీకుల సంఖ్య అయిదు లక్షల పన్నెండువేల ఏడువందల ముప్పై ఎనిమిది.

తెలుగు రచయితలకు కేంద్ర బహుమతులు

న్యూఢిల్లీ జూలై 3

వృత్తిసంబంధమైన, సాంస్కృతిక సంబంధమైన సాహిత్యాన్ని వివిధ భాషలలో వ్రాసిన 27 మంది రచయితలకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ నేడు బహుమతులు ప్రకటించింది.

సామాజికాభివృద్ధి సహకార మంత్రిత్వ శాఖతో సంప్రదించిన తరువాతనే యీ పోటీ ఫలితాలను ప్రకటించారు.

తెలుగులో "భారతీయ చేతి వృత్తులు" గ్రంథం వ్రాసిన డాక్టర్ ఆర్. వి. రావు గారికి, "సాధారణ వ్యాధులు" అను గ్రంథం వ్రాసిన డాక్టర్ వై. సూర్యనారాయణరావుగారికి యీ బహుమతులు లభించాయి

అమెరికన్ ప్రజలకు కృశ్చేవ్ శుభాకాంక్షలు
స్వాతంత్ర్యదినోత్సవ సందర్భాన ప్రెసిడెంట్ జాన్సన్‌కు సందేశం

జాన్సన్‌సిటీ (టెక్సాస్), జూలై 4

అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంలో అమెరికన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ సోవియట్ ప్రధాని కృశ్చేవ్ అమెరికా ప్రెసిడెంట్ లిండన్ జాన్సన్‌కు ఒక సందేశం పంపించారు.

వైట్‌హౌస్ పత్రికా కార్యదర్శి జార్జిరీడీ ఈ విషయాన్ని నేడుకూడా ప్రకటించారు. అయితే కృశ్చేవ్ సందేశసారాన్ని మాత్రం ఆయన విడుదల చేయలేదు

శ్రీ వేములపల్లి శ్రీకృష్ణకు స్వల్ప అనారోగ్యం

హైద్రాబాద్, జూలై 4

రాష్ట్ర శాసనసభ ప్రతిపక్ష ఉప నాయకులు శ్రీ వేములపల్లి శ్రీకృష్ణకు అకస్మికంగా వెన్నులో పోటువచ్చిన ఫలితంగా నేడు శాసనసభలో పడిపోయారు కొద్దినిముషాలలోనే ఆయనను ఆస్పత్రికి చేర్చారు

నేడు శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ శాసనసభలో సరిగా కూర్చోవడంగాని నిలబడటం గాని చేయలేక పోయారు. ఆ పరిస్థితిని గమనించిన స్పీకరు శ్రీ సుబ్బారెడ్డి వైద్యసహాయంకావాలా అని శ్రీకృష్ణను అడిగారు.

రెండు నిముషాల వ్యవధిలోనే శ్రీ శ్రీకృష్ణ నేలపైకి ఒరిగిపోయారు. వెంటనే ప్రభుత్వ డాక్టరుకూ, అంబులెన్సుకూ కబురుచేసి శ్రీకృష్ణను ఆస్పత్రికి చేర్చారు.

ఈ దుర్ఘటన ఫలితంగా శాసనసభ సమావేశానికి [illegible] నిమిషాలపాటు అంతరాయం కలిగింది.

ఆస్పత్రిలో డాక్టర్లు శ్రీ శ్రీకృష్ణను పరీక్షించి, ఆయనకు ప్రమాద మేమీ లేదనీ, అయిదారు రోజులలో అవసరమైతే ఆపరేషన్ చేయవలసి రావచ్చునని అన్నారు. శ్రీ శ్రీకృష్ణకు లోగడనుండి వెన్నులోఅప్పుడప్పుడు ఇదేవిధంగా నొప్పి వస్తూ వున్నదని తెలుస్తున్నది.

గవర్నరు ఆర్డినెన్సుపై స్పీకరు రూలింగ్ వాయిదా
సోమవారంనాటికి

హైద్రాబాద్ జూలై 4

ఆంధ్రలో పంచాయతీ అధ్యక్ష [illegible], పంచాయతీ సమితులకు సంబంధించి గవర్నరు జారీచేసిన ఆర్డినెన్సు న్యాయమైనది కాదని, అది చెల్లనేరదనీ ప్రతిపక్ష సభ్యులు నిన్న శాసనసభ సమావేశంలో సవాలు చేశారు

పంచాయతీరాజ్‌మంత్రి శ్రీ లక్ష్మీనరసయ్య 1964 పంచాయతీ (సవరణ) బిల్లును ప్రతిపాదిస్తూవుండగా కమ్యూనిస్టు ప్రజాతంత్ర సంఘటన సభ్యులు శ్రీ వెల్లంకి విశ్వేశ్వరరావు అభ్యంతరం తెల్పుతూ పై విషయాన్ని లేవనెత్తారు

శ్రీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, ఈ ఆర్డినెన్సును గవర్నరు 28 వ తేదీన జారీ చేశారని అదే తేదీన చట్టాన్ని వాయిదా వేశారని ఇది సరియైన పద్ధతి గాదని విమర్శించారు. ఈ చట్టం ఒకవైపున శాసనసభలో ప్రవేశపెట్టి ఉండగా గవర్నరు ఆర్డినెన్సును జారీచేయ రాదన్నారు.

దీనిపై తీవ్రమైనవాదోపవాదాలు జరిగినతదనంతరం స్పీకరు తన రూలింగును నేటికి వాయిదావేశారు.

నేడు తిరిగి శాసనసభ సమావేశంలో తన రూలింగును సోమవారంనాటికి వాయిదా వేశారు.

సోవియట్ జలవిద్యుత్ కేంద్రంలో నార్వేకు భాగస్వామ్యం
ఉభయ ప్రధానుల ప్రకటన

ఆస్లో జూలై 4

ఆర్కిటిక్ ప్రాంతంలో సోవియట్ నిర్మిస్తున్న జలవిద్యుత్ కేంద్రంలో నార్వేకు భాగస్వామ్యం ఇవ్వడానికి సోవియట్ ప్రభుత్వం వాగ్దానం చేసినట్లు ఉభయ దేశాల ప్రధాన మంత్రుల సంతకాలతో నేడు వెలువడిన సంయుక్త ప్రకటన తెలుపుతూ ది.

ఈ ప్రకటనను నార్వే పార్లమెంటులో వెలువరించారు. మొదట అనుకొన్నదాని కన్నా ఒక గంట ఆలస్యంగా ఈ సంయుక్త ప్రకటన వెలువడింది.

ఉభయ దేశాలకూ భేదాభిప్రాయాలున్న అట్లాంటిక్ కూటమి, జర్మనీ సమస్య మొదలయినవాటి ప్రసక్తిని ఈ ప్రకటనలో లేదు.

నేటితో నార్వేలో కృశ్చేవ్ పర్యటన ముగిసింది.

భారీ వర్షాల సూచన

మద్రాస్ జూలై 4

కలకత్తాకు 175 కిలోమీటర్లు దక్షిణంగా, బంగాళాఖాతంలో వాయుగుండంఏర్పడి, పశ్చిమంగానూ, వాయువ్యంగానూ పయనిస్తున్నది. ఈ ప్రభావం వలన వచ్చే 48 గంటలలోనూ శ్రీకాకుళం, విశాఖ జిల్లాలలో భారీ వర్షము, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలలోనూ తదితర కోస్తా జిల్లాలలోనూ ఒకమాదిరి [illegible] భారీ వర్షం కురిసే సూచన ఉంది.

పొగాకు మహాసభ
(ది 9-7-64 ఉదయం 9 గంటలకు
గుంటూరు ఎ. సి. కాలేజిహాలులో)
ప్రారంభకులు గౌ. శ్రీ మనూభాయి షా
(కేంద్ర వాణిజ్యశాఖామాత్యులు)
అధ్యక్షులు గౌ. శ్రీ కొత్త రఘురామయ్య
(కేంద్ర సప్లయిశాఖామాత్యులు)
కేంద్ర డిప్యూటీ మంత్రులు శ్రీయుతులు S. V. రామస్వామి, షానవాజ్ ఖాన్, D. R. చవాన్, వివిధ శాఖలకు చెందిన ప్రధానోద్యోగులు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖామాత్యులు గౌ శ్రీ ఎ బలరామరెడ్డిగారు పాల్గొనగలరు.
నాటు, వర్జీనియా పొగాకు రైతులు విరివిగా పాల్గొని సభను జయప్రదం చేయ ప్రార్థన
ఇట్లు,
ఆహ్వాన సంఘం.

మన రాజకీయాలు

ధాన్యాల ధరలు తగ్గాయంటూ ఆహారమంత్రి ఆత్మసంతృప్తి

ముఖ్యమంత్రుల సమావేశం ధరల అదుపుకు ఎట్టి నిర్ణయాలు తీసుకోకుండానే ముగిసింది ప్రభుత్వ వాణిజ్య కార్పొరేషన్ నిర్మాణం సైతం, వివరాలు పరిశీలించే పేరుతో వాయిదా పడింది ధాన్యం రవాణాపై ఆంక్షలను రద్దు చేస్తూ చేసిన ప్రకటనలు వ్యాపార వర్గాలకు మాత్రమే సంతృప్తి కలిగించాయి.

ఈ వైఖరి దేశ ప్రజలకు తీవ్ర అసంతృప్తి కలిగించింది. కమ్యూనిస్టు పార్టీ, సంయుక్త సోషలిస్టుపార్టీ, తదితర ప్రజాతంత్ర శక్తులన్నీ ఆహార సమస్యపై ముఖ్యమంత్రులు ప్రదర్శించిన ఉదాసీన వైఖరిని తీవ్రంగా ఖండించాయి ఐనా కేంద్రమంత్రి సుబ్రహ్మణ్యం ఈ వాస్తవాలను వేటినీ గమనించక, ముఖ్యమంత్రుల సమావేశం పిమ్మట, వివిధరాష్ట్రాలలో ఆహార ధాన్యాల ధరలు తగ్గాయంటూ ప్రకటనలు చేస్తున్నారు. ఈ వైఖరిని ఆత్మ సంతృప్తి అనాలనో ఆత్మవంచన అనాలనో తెలియదు

దీర్ఘకాలంపథకాలలోభాగంగాప్రభుత్వవాణిజ్య కార్పొరేషన్ స్థాపన సన్నాహాలు సాగుతూనే ఉన్నాయని, ఈవిషయమై తాముకొన్ని నిర్దిష్ట ప్రతిపాదనలను మరికొన్ని వారాలలో కేంద్ర మంత్రి వర్గానికి సమర్పించ గలనని ఢిల్లీలో జరిపిన పత్రికా గోష్ఠిలోఆయనతెలియజేశారు.

నాల్గవప్రణాళికాంతానికి 2 వేలబియ్యం మిల్లులను ప్రభుత్వరంగంలో ఏర్పరుస్తామని, ఇందుహో గంటకు 3 టన్నుల ధాన్యాన్ని ఆడగల మిల్లులు ఒక వేయి, గంటకు 2 వేల టన్నులుఆడగలమిల్లులు మరొకవేయి ఉండగలవన్నికీ సుబ్రహ్మణ్యంతెలియజేశారు. ఇందుకవసరమైన యంత్రాలను కొనేందుకు ఇటలీకి, పశ్చిమ జర్మనీకి ఈ నెల 16న ప్రతినిధి వర్గాలు బయలుదేర నున్నాయి. ఈలోగా కొత్త బియ్యం మిల్లులకు ప్రభుత్వం లైసెన్సులివ్వదు. వెన్వెంటనే ప్రభుత్వరంగంలోగానిలేక, సహకార రంగంలోగాని ఆధునిబియ్యంమిల్లుల యూనిట్లనుస్థాపించటానికి ప్రభుత్వం నిర్ణయించింది

ఇవి శ్రీ సుబ్రహ్మణ్యం వివరించిన అంశాలు.

ఈ అంచనాలన్నీ సక్రమంగా నెరవేరుతాయని అనుకున్నా. ఇంకో ఆరేండ్లకుగాని ఈ పథకం పూర్తికాదు.

వచ్చే పంటకాలం నాటికి ధాన్య వ్యాపార కార్పొరేషన్ఏర్పడి పనిచేయనారంభిస్తుందనేది ఒక్కటే శ్రీ సుబ్రహ్మణ్యం పునరుద్ఘాటించిన అంశం.

ఆహారసమస్యా పరిష్కారంలో వైఫల్యం పొందటానికి కారణం ప్రభుత్వానికి పథకాలు లేకకాదు చేసిన ఏఒక్కపథకాన్ని సకాలంలో అమలుజరపక ఏండ్లతరబడిజాగు చేయటం వలననేసమస్యనుపరిష్కరించేవిషయంలోప్రభుత్వానికి సమర్థత, చిత్తశుద్ధి రెండూ కొరవడుతున్నాయనే అభిప్రాయం ప్రజలలో కలుగుతున్నది

ధరలు తగ్గినవా?

ముఖ్యమంత్రుల సమావేశం అనంతరం, వివిధ రాష్ట్రాలలో ఆహారధాన్యం ధరలు తగ్గాయని సుబ్రహ్మణ్యంగారు ప్రకటిస్తున్నారు.

తరుగు రాష్ట్రాలైన కేరళ, మద్రాసులలో కొద్దిరోజులపాటు ధరలు తగ్గినమాట నిజమే కాని అది తాత్కాలికం మాత్రమే. తరుగు రాష్ట్రాలలోసైతం తిరిగి పరిస్థితి తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వి. పి. నాయక్ బొంబాయిలో మాట్లాడుతూ కేంద్రం పంపిన ధాన్యం ఫలితంగా, రాష్ట్రంలో పరిస్థితి కొంచెం మెరుగైనప్పటికీ, రాష్ట్రం ఆహార వ్యయం సమృద్ధి సాధిస్తే తప్ప సమస్య పరిష్కారం కాదన్నారు.

జులై 2 న బొంబాయి ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు ఆధ్వర్యాన 2 వేలమంది ప్రజలు బొంబాయి ధాన్యవర్తకులవద్దకుప్రదర్శనగావెళ్ళి ధరలను వెంటనే తగ్గించవలసిందిగా డిమాండు చేశారు. ప్రభుత్వం టోకుధాన్యం వ్యాపారాన్ని నిర్వహించాలనే కోర్కెను వెలిబుచ్చారు.

వర్తకసంఘాధ్యక్షుడు, ప్రదర్శకులకు సమాధానమిస్తూ వర్తకులవద్ద ప్రస్తుతం 60 వేల బస్తాల ధాన్యంమాత్రమేఉన్నదని ఇది మూడు వారాలకు మాత్రమే సరిపోతుందని అన్నారు "ముఖ్యమంత్రుల సమావేశం తర్వాతకూడా మధ్యప్రదేశ్ నుండి తగినంత ధాన్యం మహారాష్ట్రకు రవాణా కావటంలేదు. పంజాబ్, మధ్యప్రదేశ్‌లలో వ్యవసాయదారులవద్ద లక్షల సంఖ్యలో ధాన్యం బస్తాలు నిల్వఉన్నట్లు మాకు సమాచారం అందింది. ప్రభుత్వం ద్వారానే అంతరాష్ట్రీయ రవాణా జరగాలనేనిషేధాన్నికూడా తొలగిస్తే ఈధాన్యం మహారాష్ట్రకు వస్తుంది ప్రభుత్వ జోక్యమే ఆహారకొరతకు కారణం' అని ఆయన అన్నారు.

పెద్ద భూస్వాములు, ధాన్యవర్తకులు తోడు దొంగలై ధాన్యాన్ని నిల్వచేస్తున్న విషయం జగద్విదితం కాని నేరస్తులము మేము కాదంటే మేము కాదని మిల్లర్లు, భూస్వాముల మీద భూస్వాములు, మిల్లర్లమీదనేరారోపణలు చేసుకోవటమూ మామూలే బొంబాయి వర్తక వర్గాధ్యక్షుని ప్రకటన అందుకు తార్కాణం

మధ్యప్రదేశ్‌నుండి మహారాష్ట్రకు రోజుకు వేయిటన్నుల బియ్యం రవాణా కావాలని అంచనా. ముఖ్యమంత్రుల సమావేశానికి ముందు ఈ మొత్తం రోజుకు 40 టన్నులకు పడిపోయింది. ముఖ్యమంత్రుల సమావేశం అనంతరం ఈమొత్తం 200 టన్నులకు పెరిగిందని శ్రీ సుబ్రహ్మణ్యం అటున్నారు.

మంత్రిగారి లెక్కలు సరైనవేనని అంగీకరించినా దాన్యం రవాణాలో అభివృద్ధి సంతృప్తి కరంపాత్రంకాదు రోజుకు వెయ్యి టన్నులబియ్యం రవాణా జరిగేగాని తీరని మహారాష్ట్రప్రజల అవసరాలు 200 టన్నులతో ఎలా తీరుతాయి? అవసరమైన మొత్తంలో అయిదోవంతు మాత్రమే సప్లయిఐతే ధరలు తగ్గుముఖం ఎలాపడుతాయి

ప. బెంగాల్ లో

పశ్చిమ బెంగాల్ మరొక తరుగురాష్ట్రం ముఖ్యమంత్రుల సమావేశంజరిగిన వెంటనే కలకత్తా తిరిగివచ్చిన ప బెంగాల్ ముఖ్యమంత్రి శ్రీ పి. సి. సేన్ ఒక ప్రకటనచేస్తూ, వచ్చే నాలుగునెలలవరకు అవసరమైన బియ్యంరాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యంలో ఉన్నా యన్నారు. ఆప్రకటనే గనుక నిజమైతే చౌకడిపోలలో ఏ ఒక్క సరుకూ, ప్రకటించిన ధరలకు దొరకక ప్రజలు ఎందుకు కటకట లాడవలసివచ్చిందో బోధపడదు.

ఢిల్లీ వెళ్ళి తిరిగివచ్చేలోగానే ఇంత ధాన్యం ప్రభుత్వ యాజమాన్యంలోకి ఎలా వచ్చింది? టోకు వ్యాపారస్తులు సక్రమంగా సరుకు సప్లయి చేయనందున తాము, వ్యాపారం మూసివేస్తున్నామని కలకత్తాలోని 3 వేల చిల్లర దుకాణా దారులు ప్రకటించి, ఒక రోజు సమ్మె చేసినప్పుడు, ప్రభుత్వం చేయగలిగిందేమీలేదు అవి అశక్తతను ముఖ్యమంత్రి ఎందుకు ప్రకటించవలసివచ్చిందీ

ముఖ్యమంత్రి ఈ ప్రకటన చేసిన రెండు రోజులకే కలకత్తా ముఖ్యవీధులగుండా ప్రజలు ఒక ప్రదర్శనం జరిపి, ప్రభుత్వ ఆహార విధానాన్ని తీవ్రంగా విమర్శించారు.

ఆ పిమ్మట జులై 2 వ తేదీన బెంగాల్ మంత్రివర్గం అత్యవసర సమావేశం జరిపి, వచ్చే జనవరి నుండి ఆహార ధాన్యాలలో ప్రభుత్వ వ్యాపారాన్ని ప్రారంభించాలని నిర్ణయించినట్లు అందుకు కొన్నిచర్యలు తీసుకొనదలచినట్లు ప్రకటన వెలువడ్డది, ఇందుకుగాను 60 కోట్ల ధనం అవసరమని, ఆ మొత్తాన్ని అప్పుగా ఇవ్వ వలసిందిగా, రిజర్వు బ్యాంకును కోరినట్లు కూడా తెలుస్తున్నది.

రాజస్థాన్ ప్రభుత్వం తనకు తానై టోకు ధాన్య వ్యాపారాన్ని నిర్వహించాలని లోగడ ప్రయత్నించింది కాని అప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆ పథకానికి ప్రోత్సాహమివ్వలేదు రాష్ట్రంలోని ధ్యానం వ్యాపారస్తులంతా సమ్మె చేశారు ఈ రెండు వత్తిళ్ళ కారణంగా, రాజస్థాన్ ప్రభుత్వం తన పథకాన్ని విరమించుకొన్నది. ఇతర రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వమూ సహకరిస్తేనేగాని, టోకు ధాన్యం వ్యాపారాన్ని నిర్వహించటమనే ప్రస్తావనే ఇక లేదని రాజస్థాన్ ముఖ్యమంత్రి సుఖాడియా అంటున్నారు.

ఈ బలహీనతను, అసమర్థతను అవకాశంగా తీసుకొని, రాజస్థాన్‌లో ధాన్య వ్యాపారస్తులు కృత్రిమంగాకరువు పరిస్థితులను సృష్టిస్తున్నారు.

గత ఏప్రిల్‌లో మణుగు గోధుమల ఖరీదు 14 లేక 16 రూపాయలుండాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సమయంలో ప్రొక్యూర్‌మెంటు ధరకంటె ఒకరూపాయి ఎక్కువపెట్టి మణుగు 17 రూ లకు ధాన్యం వర్తకులు గోధుమలు విస్తారంగాకొని నిల్వ చేశారు. అదే ధాన్యాన్ని వారు బస్తా 25 రూ.లకు నేడు మార్కెట్లో అమ్ముతున్నారు.

పెద్ద భూస్వాములు ధాన్యాన్ని అమ్మకుండా నిల్వచేస్తున్నారు. అలా చేయటానికి అవసరమైన ధన సహాయాన్ని మిల్లర్లు అందిస్తున్నారు ధాన్యం నిల్వలకుగాను బ్యాంకులిచ్చే అప్పులు గాకఏఖాతాకురాకుండా అదోలోకంలో సంచరించే లక్షలాది రూపాయల ధనంతో ఈ వ్యవహార మంతా సాగుతున్నది

రాజస్థాన్ మామూలుగాస్వయం సంపూర్ణమైన రాష్ట్రం, ఈఏడు పంటకూడా మామూలు కంటే పెద్దగా పడిపోయినట్లు రుజువులేదు. కాని మార్కెట్లలో సరుకు మాత్రం లేదు.

ఉత్పత్తి అయిన సరుకు మార్కెట్లోకి రాకుండా మిల్లర్లూ, పెద్ద భూస్వాములూ కుట్రపన్ని ఈ కృత్రిమ వంక్షోభాన్ని కల్పిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ లో

తరుగు రాష్ట్రాలైన రాజస్థాన్‌వంటిచోట్లనే కాదు, మిగులురాష్ట్రాలైన ఆంధ్రవంటిచోట్ల పరిస్థితి ఇలాగే ఉంది.

ముఖ్యమంత్రుల సమావేశం తర్వాత ఆంధ్రలో ధరలు పెరిగే ప్రమాదమున్నదని ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి మొదట్లోనే ఆందోళన వెలిబుచ్చారు ధాన్యం అంతా కేరళ, మద్రాసులకు రవాణాకు కేటాయించబడ్డది. ఏలూరు, బందరువంటి ముఖ్య జిల్లా కేంద్రాలలో సైతం ధరలు విపరీతంగా పెరిగి, ధాన్యానికి కటకట ఏర్పడ్డది

ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి శాసన సభలో గవర్నర్ ప్రసంగంపై చర్చకు సమాధానమిస్తూ ఇలా అన్నారు:

"ధరల పెరుగుదల ప్రతి ఒక్కరికి ఆందోళనకరంగా ఉన్నది గత సంవత్సరంకంటే ఈ ఏడు పంట ఉత్పత్తి హెచ్చుగా ఉన్నది ఐనా మార్కెట్లోకి వస్తున్న సరుకు మాత్రం తక్కువగా ఉంది ఇందుకు అనేక కారణాలుండవచ్చు. ధాన్యం నిల్వలపై బ్యాంకులు ఇచ్చే అప్పులు ఇందుకు ఒక కారణం కావచ్చు

ఆహారమంత్రి బలరామిరెడ్డిగారు శాసన సభలోఒక ప్రశ్నకుసమాధానంగా మార్కెట్లోకి తగినంతసరుకురావటంలేదనిఅంగీకరించారు

ధాన్యం నిల్వలను బయటికి తీయటానికి ప్రభుత్వం పూనుకుంటుందని, మిల్లర్లతోనూ, దళారీలతోనూ ప్రమేయం లేకుండా ప్రభుత్వమే సరాసరి ధాన్యాన్ని కొంటుందన్నారు.

ఈ ప్రకటనలన్నీ నిజంగా అమలు జరిగినా వచ్చేపంట తరుణంలో, డిసెంబరు, జనవరి నెలల్లోగాని, ప్రభుత్వంచేతికి ధాన్యంరాదు ఈలోగా సెప్టెంబరు, అక్టోబరు తరుగు మాసాలలోపట్టణాలలోనేగాకగ్రామాలలోసైతం కొరత పరిస్థితులు తీవ్రంగా ఏర్పడటం ఖాయం ఈ ప్రమాదాన్ని తట్టుకోటానికి ప్రభుత్వం ఏమి చేయదలచుకుందో తెలియదు.

శాసనమండలిలో గవర్నర్ ప్రసంగంపై జరిగిన చర్చకు సమాధానంగా ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి ధరలు పెరగకుండా ఏదో విధమైన కంట్రోలు విధించవలసి వుంటుందని అన్నారు ఉచితమైన చర్యలను గురించి ప్రభుత్వం ఆలోచిస్తూనే ఉంది అని అన్నారు

ప్రభుత్వానికి ఆలోచనలేదని ఎవరూ అనలేరు. కాని ఆలోచనఅంతులేకుండాసాగుతున్నదనీ, ఆచరణలోకి రాకుండా హరించుకుపోతున్నదనే ప్రధాన విమర్శ.

రాష్ట్ర అవసరాలకు సరిపడిన ధాన్యాన్ని కేటాయించి మిగులు ధాన్యాన్ని మాత్రమే పొరుగురాష్ట్రాలకు అందజేయాలనే జాగ్రత్తను సైతం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తీసుకోవటం లేదు

రైతులకు అధికోత్పత్తికి గాను అవసరమైన ప్రోత్సాహాన్ని కలిగించాలని కేంద్ర మంత్రి సుబ్రహ్మణ్యం అంటున్నారు సక్రమమైన భూ సంస్కరణలు అమలు జరిగి తన కష్టార్జితం తనకు లభిస్తున్నదనే విశ్వాసం రైతుకు కలగటం ఇందుకు అత్యవసరం

వివిధ రాష్ట్రాలలో అమలు జరిగిన బూటకపు భూసంస్కరణలద్వారా, అట్టి ఉత్సాహం, రైతాంగానికి కలగలేదు. దున్నేవాడికి భూమి లభించటమనే సూత్రమే అమలు జరగలేదు.

భూసంస్కరణలు వస్తున్నాయనే పేరుతో, అన్యాయంగా కౌలుదార్లను, భూస్వాములు, తమ భూములనుండి తొలగించి బినామీ కౌలుదారులను ఏర్పరచుకొని తమపెత్తనం సాగిస్తున్నారు

ఈ వాస్తవాన్ని ప్రజాప్రతినిధులు ఎంతోకాలంగా వెల్లడిచేస్తున్నారు ప్రణాళికా సంఘసభ్యుడైన శ్రీమన్నారాయణసైతం ఈ విషయాన్నిప్రణాళికాఉపసమావేశాల్లో ఇటీవల వెల్లడించారు

భూ సంస్కరణలపై ఏర్పడిన ఉపసంఘంలో మాట్లాడుతూ శ్రీమన్నారాయణ ఇలా అన్నారు

"తమకుతామై కౌలుదార్లు భూములనుండి వైదొలగుతున్నారని పైకి చెపుతూ, నిజానికి పెక్కు రాష్ట్రాలలో కౌలుదార్లను భూస్వాములు నిర్బంధంగా తొలగించి వేశారు కౌలు ఇంతకు మించి ఉండరాదు అనే నిబంధనలు అమలు జరగడమే లేదు '

భూసంస్కరణల అమలుకు ప్రతిరాష్ట్రంలోనూ ప్రత్యేకబోర్డులు ఏర్పడాలని ఈ ఉపసంఘం సూచించింది.

తమ భూములనుస్వంతంగాసాగుచేసుకోని, గైర్‌హాజర్ భూస్వాములు, తమ భూములను ఈ బోర్డుకు అమ్మటమో, కౌలుకివ్వటమో చేయాలని ప్రణాళికా ఉపసంఘం తీర్మానించింది. ఆ భూమిని న్యాయమైన రేటుకు, వ్యవసాయ కార్మికులకు, చిన్న రైతులకు కౌలుకిచ్చి ఈ బోర్డే సాగు చేయించాలనికూడా ఉపసంఘం సూచించింది. కొద్దిపాటి భూవసతి మాత్రం కలిగి, స్వంతంగా సాగు చేసుకోలేని వారి విషయంలో కొంత వెసులుబాటు చూపవచ్చునని కూడాఉపసంఘం అభిప్రాయపడ్డది.

ఈ సూచనలు నిస్సందేహంగా ఉపయోగకరమైనవే, కాగా ఈ సూచనలను వివిధ రాష్ట్ర ప్రభుత్వాలచే అమలు జరిపించినపుడే కదా వీని వలన ప్రయోజనం

చింతచచ్చినా పులుసుచావని బ్రిటిష్ సామ్రాజ్యవాదం కుట్రలు

జులై 8 న కామన్వెల్తు ప్రధానమంత్రుల సమావేశం జరుగనున్నది.

భారత ప్రధాని శాస్త్రి అనారోగ్య కారణంగా ఈ సమావేశానికి హాజరు కానందున, శ్రీ టి టి కృష్ణమాచారి, శ్రీమతి ఇందిరాగాంధిగారలు ఈ సమావేశానికి హాజరవుతున్నారు. మరొక కామన్వెల్తు దేశమైన జమైకా ప్రధాని అలెగ్జాండర్ బస్టమన్టేకూడా ఈ సభకు హాజరుకావడం లేదు.

అనారోగ్యంవలన పై దేశాల ప్రతినిధులు హాజరుకాకపోగా, రాజకీయ కారణాలతో మరిద్దరు నాయకులు హాజరుకావటంలేదు.

ఘనా అధ్యక్షుడు న్క్రుమా ఈ సభకు హాజరు కావటంలేదు 1962 లో జరిగిన కామన్వెల్తు ప్రధానుల సభకూ ఆయన వెళ్లలేదు.

న్క్రుమా ప్రభుత్వంపట్ల బ్రిటన్ వ్యతిరేకత ప్రదర్శిస్తున్నది. ఘనాలో న్క్రుమాకు వ్యతిరేకంగా జరిగిన కుట్రలలో, బ్రిటిష్‌వారి పరోక్ష ప్రోత్సాహం ఉన్నదనే అనుమానం ఉంది.

ఈ పరిస్థితిలో న్క్రుమా కామన్వెల్తు సభకు హాజరు కాకపోవటంలో ఆశ్చర్యంలేదు

సైప్రస్ అధ్యక్షుడు మకారియోస్, తానీ కామన్వెల్తు సభకు హాజరు కాలేనని ప్రకటింగాగా.

సైప్రస్ దీవిలో, టర్కిష్, గ్రీకు ప్రజలకు మధ్య అంతఃకలహాన్ని రెచ్చగొట్టి అసలు సైప్రస్ స్వాతంత్ర్యాన్నే హరించాలని బ్రిటన్ యత్నిస్తున్నది

ఎంతో దీర్ఘకాల పోరాటం తర్వాత, 1960 లో సైప్రెస్ దీవిస్వాతంత్ర్యంపొందింది కాని అప్పటినుండే, ఏదోరూపంలో స్వాతంత్ర్యాన్ని హరించటానికి బ్రిటన్ కుట్రలు పన్నుతూనేఉంది.

గ్రీస్ టర్కిష్ ప్రజలమధ్య కలహాలను రెచ్చగొట్టింది, ఆరునెలలుగా సాగుతున్న ఈకలహాలను అదుపులో పెట్టటానికి ప్రస్తుతం అక్కడ ఐరాస సేన ఒకటుంది సైప్రెస్ దీవిని తమ దేశంలో లీనంచేయవలసిందిగా, గ్రీస్ టర్కీలు సామ్రాజ్యవాదులపై వత్తిడి చేస్తున్నాయి ఈ రెండూ నాటో కూటమి సభ్యదేశాలే. సైప్రెస్‌ను కబళించాలని ఈ రెంటిమధ్య ఏర్పడిన వివాదాన్ని సర్దటానికి బ్రిటన్ అమెరికాలు విశ్వప్రయత్నం చెస్తున్నాయి

సామ్రాజ్యవాదుల నిజస్వరూపం గుర్తించిన అధ్యక్షుడు మకారియోస్ సైప్రస్, ఏసైనిక కూటమిలోనూ చేరక తటస్థరాజ్యంగా ఉంటుందని ప్రకటించారు మధ్యధరా సముద్రంలో కీలకస్థానంలోఉన్న సైప్రస్‌లోని తమ సైనిక స్థావరాలను ఖాళీచేయటం బ్రిటన్‌కు ఇష్టంలేదు కనుకఏదోసాకుతో సైప్రస్ స్వాతంత్ర్యాన్ని హరించాలని, పథకాలు వేస్తున్నారు.

ఈ మోసపు ధోరణికి నిరసనగానే మకారియోస్ కామన్వెల్తు దేశాల సభకు హాజరుకావడం మానివేశారు.

ప్రపంచ వ్యాపితంగా ప్రతి కామన్వెల్తు దేశంలోనూ బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఇట్టి దుష్టవిధానాన్నే అవలంబిస్తున్నారు

అమెరికా ఖండంలోని బ్రిటిష్ గయానాలో ఇండియన్లకు, నీగ్రోలకు మధ్య కలహాలు రెచ్చగొట్టి, అక్కడ మంత్రులను కొందరిని నిర్బంధించి, బ్రిటిష్‌గయానాకు లోగడ ఇచ్చిన రాజ్యాంగాన్ని సైతం రద్దుచేయాలని బ్రిటన్ ప్రయత్నిస్తున్నది. ప్రజావిశ్వాసం చూరగొన్న చెడ్డిజగన్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని ప్రయత్నిస్తున్నది.

రాబోవు కామన్వెల్తు సభలో ఈ విషయం చర్చకు, రాదని బ్రిటిష్ ప్రభుత్వం ముందుగానే ప్రకటించింది.

మలేషియాను, కొత్త రూపంలో సామ్రాజ్యవాద స్థావరంగా సృష్టించి, తన సైనిక బలగాన్ని ఇదివరకటికంటే బ్రిటన్ పెంచింది. ఇండొనీషియా,మలేషియాలమధ్యతీవ్రఘర్షణకు బ్రిటన్ బీజాలు వేసింది. ఇండొనీషియాతో ఏర్పడే ఘర్షణలో కామన్వెల్తు దేశాలన్నీ తనకు సైనిక సహాయం చేయాలని మలేషియా ప్రధాని టుంకు అబ్దుల్ రహమాన్ ప్రకటించాడు

బహుశా ఈ విషయాన్ని చర్చించటానికే, ఆయన లండన్ వెళ్ళుతూ ఢిల్లీలో ప్రధాని శాస్త్రితో చర్చలకై ఆగుతున్నారు.

దక్షిణాఫ్రికాలో వెర్వోర్డు ప్రభుత్వం అనుసరిస్తున్న అమానుషమైన జాతివిద్వేష విధానానికిబ్రిటన్‌ప్రత్యక్షప్రోత్సాహంఇస్తున్నది. దక్షిణాఫ్రికాపై ఆర్థిక ఆంక్షలు విధించాలని ఐరాససభలోని హెచ్చుదేశాలు తీర్మానించినా బ్రిటన్ మాత్రం, తమ సార్థప్రయోజనాలతో ఆ తీర్మానాన్ని అడ్డుకుంటున్నది.

దక్షిణాఫ్రికాలోవలెనే, ద. రొడీషియాలో కూడా మరొక జాతి విద్వేష ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది ఈ ప్రభుత్వం తరపున ప్రతినిధి ఎవరూ కామన్వెల్తు సభకు హాజరు కారాదని ఇతర దేశాలు అభ్యంతరంచెప్పాయి. అసలు కామన్వెల్తునుంచి తాను విడిపోయి, దక్షిణాఫ్రికా వలెనే రిపబ్లిక్ ప్రభుత్వంగా రూపొందగలనని దక్షిణ రొడీషియాప్రభుత్వం బెదిరిస్తున్నది. అలా జరిగితే, ఆఫ్రికా ఖండంలో, మరో ఫాసిస్టు ప్రభుత్వం, దక్షిణాఫ్రికా ప్రభుత్వానికి అండగా అవతరించడమే నన్నమాట.

ఏడెన్ లోనూ, దక్షిణ అరేబియా లోనూ బ్రిటిష్ సామ్రాజ్యవాదులు నేటికీ, దారుణమైన సైనికచర్యలు సాగిస్తున్నారు. బాంబుల వర్షం కురిపిస్తున్నారు.

ఇదీ నేటి కామన్వెల్తు స్వరూపం. చింత చచ్చినా పులుసు చావనట్లు బ్రిటిషు సామ్రాజ్యవాదం ఈనాటికీ ప్రతి కామన్వెల్తు దేశంలోనూ, ప్రత్యక్షచర్యలద్వారానో, లేక విభజించిపాలించే కూట రాజనీతిద్వారానో కలహాలను రెచ్చగొడుతూనే వుంది.

కాశ్మీర్ సమస్యపై భారత ప్రభుత్వ వైఖరిని మార్పించి పాకిస్తాన్‌కు అనుకూలంగా ఈ వివాదాన్ని పరిష్కరించాలని, అందుకు ఈ సమావేశాన్ని ఒక అవకాశంగా వినియోగించుకోవాలని బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ఆశ. పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ ఆ విషయమై ఎంతో 'ఆతృత'పడుతున్నాడు. ప్రధాని శాస్త్రిని లండన్‌లో కాకపోతే స్వయంగా ఢిల్లీలోనే కలుసుకోగలనంటూ ప్రకటనలు చేస్తున్నారు.

ఇట్టి కామన్వెల్తు సమావేశాలకు భారత దేశం హాజరుకావటమే నిరర్థకం ఒకవేళ హాజరైనా బ్రిటిష్ సామ్రాజ్యవాదుల దుర్మార్గాన్ని, నిరంకుశత్వాన్ని నిశితంగా ఖండించుటకే ఆ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

శ్రీమతి ఇందిరాగాంధి శ్రీ కృష్ణమాచారి గారలు, అట్టి వైఖరినే అవలంబిస్తారా?

బలరామమూర్తి



విజయవాడ అగ్నిబాధితుల సహాయార్థం ఒక లక్షరూపాయల చెక్కును ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డిగారికి అందజేస్తున్న ప్రఖ్యాత సినీనటుడు శ్రీ ఎన్. టి. రామారావుగారు.

దుందుడుకుతనం మూర్తీభవించిన చైనానాయకుల వినాశకరవిధానాలు

సిద్ధాంత వివాదంపై భారత కమ్యూనిస్టుపార్టీ జాతీయసమితి రూపొందించిన ముసాయిదా నివేదికలోని అంశాలు

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యతను కాపాడాలని హెచ్చరిక

న్యూఢిల్లీ, జులై 4

చైనా కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం పూర్తిఓటమితత్వంతోను, దుందుడుకుతనంతోను కూడిన సర్వవినాశకర పంథాను చేపట్టినదని భారత కమ్యూనిస్టుపార్టీ జాతీయ సమితి, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో తలెత్తిన సిద్ధాంత వివాదంపై, నేడిక్కడ జారీచేసిన ముసాయిదా నివేదికలో స్పష్టం చేసింది

ఈ ముసాయిదా నివేదిక 67 అరటా పేజీలు వుంది చైనా కమ్యూనిస్టుపార్టీ వైఖ' ఆ నివేదికలో అతి తీవ్రంగా ఖండించారు.

చైనా నాయకులు తమ పిడివాదాన్ని కప్పుకోవడానికి, తమ ట్రాట్‌స్కీ మై అవగాహన ధోరణిని, విధానాలను మభ్యపెట్టుకోవడానికి సోదరపార్టీలపై లేనిపోని దూషణలకు, నిందలకు, ఆరోపణలకు ఒడిగడుతున్నారని ఆ ముసాయిదా నివేదికలో తేటతెల్లం చేశారు.

ఈ మధ్య ఇక్కడ జరిగిన జాతీయ సమితి సమావేశంలో ఈ సమస్యపై జరిగిన చర్చలను ఆధారం చేసుకొని, కేంద్ర కార్యదర్శివర్గం ఈ ముసాయిదా నివేదికను తయారుచేసింది. ఈ నివేదికను పార్టీలో అన్నిస్థాయిలలోని శాఖలు చర్చిస్తాయి. ఈ సంవత్సరాంతంలోబొంబాయిలో జరిగేకమ్యూనిస్టు పార్టీ సప్తమ మహాసభలో ఈ నివేదికను చర్చకు ప్రతిపాదిస్తారు.

ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం చేపట్టిన విధానాలకు విరుద్ధంగా చైనా కమ్యూనిస్టు నాయకులు 1960 ఏప్రిల్‌లో 'లెనినిజం చిరస్థాయి అగుగాక" అనే కరపత్రం ప్రచురించటంతో, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో సిద్ధాంత వివాదం ప్రారంభమైంది. అప్పటినుంచి ప్రపంచ వ్యాప్తంగా సాగుతున్న సిద్ధాంత మహోద్యమంలో భారత కమ్యూనిస్టుపార్టీ వైఖరిని ఈ ముసాయిదా నివేదిక స్పష్టమైన రీతిలో వెల్లడిస్తున్నది.

భారత కమ్యూనిస్టుపార్టీనుంచి చీలిపోయి, పోటీపార్టీని నిర్మిస్తున్న నాయకు లెవ్వరూ ఈ ముసాయిదా నివేదికను రూపొందించడంలో పాల్గొనలేదు. అందుచేత ఈ నివేదికలోని అంశాలతో వారు ఏకీభవించటం అన్న సమస్య లేదు.

ముఖ్యమైన వివాదాంశాలు

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ఈనాడు తలెత్తిన సిద్ధాంత వివాదాంశాల సారాంశాన్ని ఈ ముసాయిదా నివేదికలో ఈ క్రిందివిధంగా క్రోడీకరించారు:

'కొత్త శకం ఆరంభంకావడంతో ఏర్పడిన అవకాశాలను, దృక్పథాలను పూర్తిగా సద్వినియోగం చేసుకొనడానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తూ, జనసామాన్యం సాధ్యమైనంత క్కువ బాధలు, వ్యధలు పొందేరీతిలో నవ జాతిని శాంతి, సోషలిజం, జాతీయ తంత్ర్యం, ప్రజాస్వామ్య లక్ష్యాలకు చేర్చా మాస్కో స్టేట్‌మెంట్. సోదర పార్టీలు అభిలషిస్తున్నాయి.

'ఈ దేశభక్త కర్తవ్య నిర్వహణలో కార్మికవర్గం సాధ్యమైనంత ఎక్కువమంది మిత్రులను చేకూర్చుకోవాలని అవి కోరుతున్నాయి, ప్రపంచ కమ్యూనిజం, ప్రజాస్వామ్యం, శాంతి, జాతీయ స్వాతంత్ర్యం మున్నగువాటికి సంబంధించినశక్తులన్నింటినీ-వాటిలో కొన్ని ఎంత చిన్నవైనప్పటికీ, ఊగిసలాట స్వభావంకలిగిన వైనప్పటికీ-వాటన్నిటిని మానవజాతి పవిత్రాశయసాధనకు ఒకేత్రాటిపై సమీకరించాలని కూడా అవి కోరుతున్నాయి.

రక్తపాతమేముక్తిదాయకమని చైనానాయకుల వాదన

"పోతే, దీనికి ప్రతిగా మానవజాతికిచైనా కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం చూపుతున్న మార్గమేమిటి? సర్వవినాశకరమైన ప్రపంచ యుద్ధం, పెట్టుబడిదారీ దేశాలలో అంతర్యుద్ధం, వలస, పరాధీన దేశాలలో సాయుధ పోరాటం తప్ప మానవజాతికి మరొక మార్గం లేదని చైనా కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం అంటున్నది.

ఆత్మహత్యాసదృశ్యమైన ఈలక్ష్యసాధనకై వారు ప్రపంచంలోని సోషలిస్టు, అభ్యుదయ శక్తుల ఐక్యతకు చిచ్చుపెట్టడానికి శతధా ప్రయత్నిస్తున్నారు. ఈ లక్ష్యాన్ని నెరవేర్చుకొడానికి వారు అవకాశవాద జాతీయ దురహంకార అధోగతులకు కూడా వెడుతున్నారు ''

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేస్తున్న చైనా నాయకత్వాన్ని ఈ నివేదికలో నిశితంగా ఖండిస్తూ ప్రపంచకమ్యూనిస్టు ఉద్యమ ఐక్యతను కాపాడవలసిన ఆవశ్యకతను వక్కాణించారు

'పీటి(విభేదాలు)విషయంలో మనంతీవ్రంగా ఆందోళన చెందుతున్నాం. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో మనం అంతర్భాగం కావడం వల్లను, దానితోపాటు పీటి మూలాన మనలో చీలికలు వస్తున్నందువల్లను మనం తీవ్రంగా ఆందోళన చెందుతున్నాం" అని ఈ నివేదికలో వివరించారు.

ఈ విభేదాలను పరిష్కరించుకోవడానికి సముచితమైన సన్నాహాలతో, సాధ్యమయినంత త్వరలో ప్రపంచ కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధుల సమావేశాన్ని జరపాలని జాతీయ సమితి ఇంతకుముందే తన అభిప్రాయాన్ని వెల్లడించింది.

భారత-చైనా సరిహద్దు సంఘర్షణ

"భారత దేశం; భారత-చైనా సరిహద్దు సంఘర్షణ" అన్న అధ్యాయంలో భారత దేశంలో పరిస్థితిని గురించి చైనా నాయకుల అంచనా, సరిహద్దు సమస్యపై వారు అవలంబించిన వైఖరి ఆమూలాగ్రం అపసవ్యమైనవని జాతీయ దురహంకార పూరితమైనవని జాతీయ సమితి తన ముసాయిదా నివేదికలో విమర్శించింది.

భారతదేశంతో తనకుగల విభేదాలను పురస్కరించుకొని, చైనా నాయకులు సాయుధ సంఘర్షణకు దిగటం ఎట్టి పరిస్థితులలోను సమర్థనీయం కాదని నిరూపిస్తూ, ఈ నివేదికలో లెనిన్ మాటలు అనేక వాటిని ఉల్లేఖించారు.

"లెనిన్ చెప్పిన ప్రకారం భారతదేశంతో 'శాంతియుత సంబంధాలను కాపాడుకోవడం, భారతదేశ 'విశ్వాసాన్ని చూరగొనడం పరమావధి కావాలి 'శత్రుత్వ వైఖరి" అవలంబించిన ఇరుగుపొరుగు దేశం విషయంలో కూడా అలాంటి విధానాన్నే అవలంబించాలని లెనిన్ ఆదేశించారు కాగా, శాంతియుత,మిత్ర దేశమైన ఇండియాతో చైనా వ్యవహరిస్తున్న సందర్భం ఇది చైనాతో ఇండియా మైత్రి లేకపోతే ఆఫ్రో-ఏషియన్ ఐకమత్యం, సౌహార్దం కుప్ప కూలిపోయే పరిస్థితి ఏర్పడుతుంది.

శాంతియుత పరిష్కారం అంటే అంతవెగటుఎందుకు?

ప్రాంతీయ సరిహద్దు సమస్యలను పరిష్కరించుకోవడంలో బలప్రయోగాన్ని విసర్జిస్తూ ప్రపంచంలోని అన్నిదేశాల అధిపతులు ప్రకటించాలని సూచిస్తూ సోవియట్ ప్రధాని కృశ్చేవ్ 1963 డిసెంబరు 31 వ తేదీన పంపిన సందేశాన్ని చైనా నాయకులు తిరస్కరించినందుకు ఈ నివేదికలో చైనా నాయకులను తీవ్రంగా గర్హించారు

గతంలో చైనా చక్రవర్తులు జయించిన ప్రాంతాలన్నింటిపైన తనకు హక్కుకలదంటూ పట్టుపట్టుతున్న చైనా నాయకుల ధోరణిని ఈ నివేదికలో ప్రస్తావించి ఇంకా ఇలా వివరించారు.

"కనీసం సోషలిస్టు దేశాలమధ్య నైనా సరిహద్దు ప్రాంతాల సమస్యను లేవనెత్తడం పూర్తిగా పొరపాటు, పూర్తిగా అనవసరం అన్న విషయం సుస్పష్టం. ఎందుకంటే, అన్ని దేశాలు సోషలిస్టు పాలనలోనికివచ్చే కావటం వల్ల ఆ సమస్యను భావితరాల నిర్ణయానికి నిశ్చింతగా వదలివేయవచ్చు మానవజాతిలో సౌభ్రాతృత్వ భావం గాఢంగా వేరూనిన పరిస్థితిలో పరిహద్దు సమస్య ప్రాధాన్యమే పోతుంది. అప్పుడు ఎలాంటి వైమనస్యం లేకుండా వివాదరహితంగా ఆ సమస్యను పరిష్కరించవచ్చు.

చైనా నాయకులు దీనికికూడా అంగీకరించటం లేదు, సోవియట్ యూనియన్‌లోని గణనీయమైన భూభాగాలు తమకు రావాలని వారు పట్టుబడు తున్నారు

'తాము సంప్రతింపులద్వారా బర్మా, నేపాల్ ఆఫ్ఘనిస్థాన్‌లతో సరిహద్దు ఒప్పందాలు కుదుర్చుకొన్నామంటూ చైనా నాయకులు గొప్పగా చెప్పుకొంటున్నారు ఆక్రమిత పాక్ కాశ్మీరు సరిహద్దుల విషయంలో వారు పాకిస్తాన్‌తో న్యాయ విరుద్ధమైన ఒప్పందం కుదుర్చు కొన్నారు తమ సమరసభావానికి ఇండియా మొండి వైఖరికే దీనినే వారు తార్కాణంగా చూపుతున్నారు.

"అమెరికా అదుపాజ్ఞలలో వున్నందువల్ల ఇండియా సరిహద్దు సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి నిరాకరిస్తున్నదని వారువక్కాణిస్తున్నారు అయినప్పుడుపాకిస్తాన్, నేపాల్‌లు అంతకంటె తక్కువ అమెరికా అదుపాజ్ఞలలో వుండివుండాలి వాటిపై అమెరికా అదుపాజ్ఞలు తక్కువ అని భావించడానికి ఆస్కారంలేదే? అయినప్పుడు ఆ దేశాలతో సరిహద్దు ఒప్పందాలు ఎలా సాధ్యమైనట్లు? అవ్వాకావాలి, బువ్వాకావాలి అంటే పొసగదు,

బర్మా, నేపాల్‌కు ఒక సూత్రం, ఇండియాకు మరొక సూత్రమునా?

"అంతేకాదు ఇచ్చి, పుచ్చుకొనే స్నేహభావంతో తాము వ్యవహరిస్తున్నట్లు చెబుతున్న చైనా నాయకుల వాదనలోని బండారం తెలుసుకొనడానికి మరొక ఉదాహరణ ఇది: మెక్‌మహన్ రేఖకు ఆధారమైన హిమాలయాలలోని అత్యున్నతపర్వతశ్రేణి అనే సూత్రాన్ని చైనా-నేపాల్ పరిహద్దుగా అంగీకరించారు అదే సూత్రాన్ని బర్మాతో సరిహద్దు సమస్యను పరిష్కరించుకొన్న సందర్భంలో చైనా నాయకులు పాటించారు. అయినప్పుడు, నేపాల్, బర్మా దేశాలకు మధ్యనున్న నేఫా విషయంలో అదే సూత్రం సామ్రాజ్య విస్తరణ వాంఛకు తార్కాణం ఎలా అవుతుంది?" అని యీ నివేదికలో సూటిగా ప్రశ్నించారు.

జాతీయ దురహంకారలక్ష్య సాధనకు విచిత్ర సిద్ధాంతం

చైనా కమ్యూనిస్టుపార్టీ చేపటిన విధానంలోని ప్రధాన వైరుధ్యాలను ఈ నివేదికలో వివరించారు. చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ జూన్ 14 వ తేదీ లేఖలో పొందుపర్చిన "మధ్యస్థ మండలి' సిద్ధాంతంలోని అంతర్యాన్ని యీ నివేదికలో బహిర్గతం చేశారు అటు అమెరికా ఇటు సోషలిస్టు దేశాలను మినహాయిస్తే ప్రపంచంలోని మిగతాదేశాలన్నీ 'మధ్యస్థమండలం" లోనివేనని ఆసిద్ధాంతంసూత్రీకరిస్తున్నది.

చైనా నాయకులు తమ సంకుచిత జాతీయ దురహంకార పూరిత లక్ష్యాలను, కోర్కెలను ఈడేర్చుకోవడానికి, పచ్చి అవకాశవాద దృష్టితో యే దేశంతోనైనా సరే తాను నేస్తం కట్టడానికి వీలుగా ఆ సిద్ధాంతాన్ని రూపొందించారని ఈ నివేదికలో వివరించారు

కాకపోతే, అనూహ్యమైన అనేక సమస్యలపై పాకిస్తాన్ - చైనాలు అత్యంత ఆశ్చర్యకరమైన విధంగా, 'అధికాధికంగా పరస్పరం ఒకదాని నొకటి ఎలా బలపర్చుకో గలుగుతున్నాయి? చివరకు ఈ పరస్పర సహాకారం దాదాపు కత్తూ పొత్తూ స్థితికి కూడా చేరింది.

విచిత్రమైన పొత్తు

"పాకిస్తాన్ ఆగ్నేయాసియా కూటమిలోని సభ్యదేశం అది పూర్తిగా మతైక రాజ్యం కాశ్మీరు న్యాయశాస్త్రరీత్యామ, ప్రజల తీర్పు ప్రకారంకూడా భారతదేశ అంతర్భాగం భారత దేశం ఆసియాలో కొత్తగా విముక్తి పొందిన వలస వ్యతిరేక, శాంతిప్రియ శిబిరానికి చెందినట్టిది.ఇందులోమొదటిఅంశం నిర్వివాదాంశం కాగా, రెండు మూడు అంశాలను సకల సోషలిస్టుదేశాలు, కమ్యూనిస్టుపార్టీలు గుర్తించాయి

ఐనప్పటికీ ఈ విషయాలకు సంబంధించిన సమస్యల యెడల చైనా నాయకుల అంచనా, వీరు అవలంబిస్తున్న విధానం ఎలాంటిది? ఇండియా అమెరికా చేతిలో కీలుబొమ్మ అన్నట్టు వారు చిత్రిస్తున్నారు భారత ప్రభుత్వం సాగిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక, ప్రజా వ్యతిరేక చర్యలను ఎలుగెత్తి చాటడంలో వారు ఏమాత్రం అవకాశాన్నికూడా జారవిడువడంలేదు మరొక వైపున పచ్చి నియంతృత్వం, ప్రజాస్వామ్య వ్యతిరేక స్వభావంగల పాకిస్తాన్ ప్రభుత్వం గురించి వారు పల్లెత్తుమాట ఎలకడం లేదు పాకిస్తాన్ రాజ్యం యొక్క విషపూరిత మత స్వభావం గురించిగాని పాకిస్తాన్ పాలకులు ఎత్రికలు మతదృక్పథాన్ని పురిగొల్పుతూ,హాత్యాకాండకు ప్రజలను ప్రోత్సహిస్తుండడాన్ని గురించిగాని వారు ప్రస్తావించడమేలేదు. పాకిస్తాన్ అక్రమంగా ఆక్రమించుకొన్న కాశ్మీరు భూభాగం విషయంలో, వారు సరిహద్దు ఒప్పందం కుదుర్చుకున్నారు స్వయంనిర్ణయాధికారసూత్రం పేరుతో,కాశ్మీరులోజనవాక్యసేకరణ జరపాలని వారు పాకిస్తాన్ కోర్కెను బలపరుచు తున్నారు. చివరకు ఇవన్నీ చాలవన్నట్టు ఆగ్నేయాసియా సైనికకూటమిలో పాకిస్తాన్ సభ్యత్వాన్ని ఆత్మరక్షణ చర్యగా చిత్రిస్తూ, (ఎవరి నుంచి రక్షణ?) సమర్థిస్తున్నారు

"ఇందుకు ప్రతిఫలంగా పాకిస్తాన్, భారత దేశం చైనాపై దురాక్రమణ జరిపినట్లు ప్రకటించింది ఇండియాతోసాయుధసంఘర్షణ వస్తే ఇరుగుపొరుగుఆసియన్ మహారాజ్యమైనచైనా పాకిస్తాన్‌కు అండగా వస్తుందని పాక్ మంత్రి భుట్టో పాక్ పార్లమెంటులో ప్రకటించాడు

దీని భావమేమిటి? ఇండియాపట్ల ఉమ్మడి శత్రు భావంకొద్దీ చైనా, పాకిస్తాన్‌లు సన్నిహిత మవుతున్నట్లు అనుకోవలసిందేగదా? ఇలాంటి విధానాన్ని సమర్థించే వాక్యం ఒక్కటైనా మాస్కోస్టేట్ మెంట్‌లో ఎక్కడైనా ఉన్నదా? ఒక శాంతి ప్రియ, వలస వ్యతిరేక దేశానికి ప్రతికూలంగా సామ్రాజ్య సైనిక కూటమిలోని ఒక దేశంతో ఏ సోషలిస్టు దేశమైనా చేతులు కలపవచ్చునా? అసలు అలాంటి ప్రశ్న వేయడమే అవివేకమవుతుంది."

1963 లో మాస్కోలో జరిగిన ప్రపంచ కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధుల సభలో చైనా నాయకులు తమ సొంత అభిప్రాయాలకే మొండిగా పట్టి ప్రాకులాడి, చివరకు తాము పూర్తిగా ఏకాకులై పోతున్నట్లు తేలిన తరువాతనే స్టేట్‌మెంట్‌పై సంతకం పెట్టడానికి అంగీకరించారని సోవియట్ కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీ తన జులై 14 వ తేదీ లేఖలో ఉదహరించిన అంశాన్ని ఈ నివేదికలో ప్రస్తావించారు.

నాగాభూమిలో త్వరలోశాంతి

'షిలూ ఆవో ఆశాభావం

కోహిమా, జులై 4

నాగాభూమిలో త్వరలోనే శాంతి యేర్పడ వచ్చునే ఆశాభావాన్ని, నిన్న ఇక్కడ జరిగిన శాంతి సంప్రతింపు బృందం గౌరవార్థం యేర్పాటయిన ఒక సభలో ఆప్రాంత ముఖ్యమంత్రి శ్రీ షిలూ ఆవో ప్రకటించారు.

నాగా ప్రాంతంలో పోరాట విరమణకోసం, ఆ బృందంవారు ప్రతిపాదించినపథకాలన్నింటినీ భారత ప్రభుత్వం యెంతో ఉదారంగా ఆమోదించిందని ఆయన అన్నారు.

భారత ప్రభుత్వానికీ, రహస్య తిరుగుబాటు దారుల నాయకులకూ మధ్య సంప్రతింపులకు అవసరమైన ప్రాతిపదికల యేర్పాటుకు కృషి చేసినందుకు ఆయన ఆ బృందం సభ్యులకు తన కృతజ్ఞత తెలియజేశారు

ఈ సంప్రతింపులను సఫలం చేయడానికి ప్రజలంతా సహకరించాలనికూడా ఆయన విజ్ఞప్తి చేశారు

అల్యూమినం కార్మికసమ్మె విరమణ

సంయుక్త సోషలిస్టుపార్టీ నాయకుని హామీపై

వారణాసి, జులై 4

పియాప్రీలో 11 రోజులనుండి సాగుతున్న అల్యూమినం ప్యాక్టరీ కార్మికుల సమ్మె నిన్న రాత్రి విరమించ బడింది

సంయుక్త సోషలిస్టు పార్టీ నాయకుడు శ్రీ రాజ్‌నారాయణ్ సలహాపైన యీ సమ్మెను విరమించినట్లు సమ్మెదారుల నాయకు లొకరు ప్రకటించారు.

వేతనాల హెచ్చింపు, ధరల అలవెన్సు మొదలైన 12 కోర్కెల సాధనకోసం యీ ఫ్యాక్టరీ కార్మికులు జూన్ 20 నుండి సమ్మె చేస్తూ వుండిన విషయం పాఠకు లెరిగినదే

బర్మా సైనికులచే 71 మంది పాడాంగ్ తిరుగుబాటుదార్ల వధ

రంగూన్, జులై 3

బర్మా గస్తీ కేంద్రాన్నొక దానిని గతమాసం 15 వ తేదీ నుండి 20 వ తేదీ వరకూ వరుసగా ముట్టడించిన మూడువందలమంది సైనికులు గలఒకతిరుగుబాటుదళంపైబర్మాప్రభుత్వ సైన్యం తిరుగుదాడి చేసి 71 మందిని చంపివేసిందని, మరో 33 మందిని గాయపరిచిందని నేడిక్కడ ప్రకటించిన వార్తలవల్ల తెలుస్తూ వుంది

ఈ తిరుగుబాటుదార్లలో ఎక్కువ మంది పాడాంగ్ జాతీయులని వారు బై టో ద్యాన్ నాయకత్వాన ఉన్నారని కూడా ఈ వార్తలు తెలుపుతూ వున్నాయి.

గత బుధవారంనాడు ఆదేశానికి చెంది 20 మంది తిరుగుబాటుదార్లు తమ ఆయుధాలన్నింటినీ అప్పగించి ప్రభుత్వ సైన్యాలకు లొంగిపోయారనికూడా ఈ వార్తలు చెప్పుతున్నాయి.

ఆసియా, ఆఫ్రికా దేశాల విముక్తి పోరాటంలో జాతీయ బూర్జువా వర్గం పాత్ర ఏమిటి?

[illegible]వాదు, వలస విధానాన్ని నిర్మూలించడంతోపాటు, కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాలు అభివృద్ధి చెందడ మెలాగ అన్న సమస్య ఒక్క ఆసియా ఆఫ్రికా దేశాల ప్రజలకు మాత్రమే ఆందోళన కలిగించడం లేదు దాన్ని పరిష్కరించడమనేది మానవ జాతి కంతటికి అత్యంత ప్రాముఖ్యం గల విషయం. ఎందుచేతనంటే, పెట్టుబడిదారీ విధానానికీ, సోషలిజానికీ జరుగుతున్న పోరాటంలో యీ సమస్య ప్రస్తుత రాజకీయ సమస్యలు ప్రధానమై వున్నాయి

జాతీయవిముక్తి విప్లవాలు అభివృద్ధికాకుండా అరికట్టడానికీ, విముక్తి చెందిన దేశాలకు నయా వలససంకెళ్ళను తగిలించడానికి సామ్రాజ్యవాదులు, దేశీయ అభివృద్ధి నిరోధకులు ప్రయత్నిస్తునారు అయినప్పటికీ, అభ్యుదయకర ప్రజాస్వామికశక్తులు, సంపూర్ణ జాతీయ విమోచన కోసమూ, పెట్టుబడిదారీ మార్గంలో కాకుండా మరోమార్గంలో అభివృద్ధి పొందడం కోసమూ పోరాడుతూ వున్నాయి.

ఈ పోరాటపు ఫలితంమీదనే కోటానుకోట్ల ప్రజల భవిష్యత్తు ఆధారపడివుంది

సహజంగానే యీ పోరాటం వివిధ ఆసియా, ఆఫ్రికా దేశాలలో వివిధ రూపాలు తీసుకుంటుంది, ఆ రూపాలు ఆయాదేశాలలోని నిర్దిష్టమైన స్థానికపరిస్థితులనుబట్టి, ఆర్థిక సాంఘిక అభివృద్ధినిబట్టి వుంటాయి సరిగ్గా యీ విషయమే, అభివృద్ధికర ప్రజాస్వామిక శక్తుల తాత్కాలిక కర్తవ్యాలను, ఆ పోరాటంలో వారు సంపాదించే మిత్రులను నిర్ణయిస్తుంది. ఈ సందర్భంలోనే జాతీయ బూర్జువా వర్గంతో ఎలాంటి సంబంధాలుండాలి అనే ప్రశ్న ఉదయిస్తుంది.

పూర్వం వలసదేశాలుగా వున్న వారిలో అత్యధికభాగం సామ్రాజ్యవాద రాజకీయ ఆధిపత్యాన్ని పూర్తిగా తొలగించుకున్నాయి. ఇప్పుడా దేశాలు తమ స్వాతంత్ర్యాన్ని బలపర్చుకోవాలి. వలసవిధానాన్ని నిర్మూలించాలి. ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కలిగించే విధంగా తమ ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవాలి విదేశీ గుత్తపెట్టుబడులను తొలగించడం, రైతులకు లాభదాయకమైన వ్యవసాయ సంస్కరణలను ప్రవేశపెట్టడం, ప్రధానంగా ప్రభుత్వ రంగాన్ని నెలకొల్పడంద్వారా జాతీయ పరిశ్రమలను అభివృద్ధి చేయడం, సాంఘిక రాజకీయ జీవితాన్ని ప్రజాస్వామిక పద్ధతులలో నడిచేటట్లు చేయడం ఆ దేశాలకు తక్షణ కర్తవ్యాలవుతున్నాయి.

లెనిన్ యిచ్చిన సందేశం

ఈ కర్తవ్యాలను సాధ్యమైనంత త్వరగా నెరవేర్చాలంటే ఆ కార్యక్రమాలను అమలు జరుపడంలో ఆసక్తిగల ప్రజాస్వామిక శక్తుల నన్నిటినీ కూడదీసే విశాలమైన సంయుక్త సంఘటనను నిర్మించటం అవసరం. విదేశీ గుత్త పెట్టుబడులతో సంబంధంలేని జాతీయ బూర్జువా వర్గానికి మొట్టమొదట చిన్న, మధ్యరకం బూర్జువా వర్గానికి స్థానం వుంటుంది. లెనిన్ చాలా పుస్తకాలలో, యూరప్‌లోమాదిరి కాకుండా ఆసియాలో ఒక ప్రత్యేకదశలో వలస విధానానికి వ్యతిరేకంగానూ, అభివృద్ధి నిరోధకశక్తులకు వ్యతిరేకంగా పోరాడే ప్రజలతోకలిసి ప్రజాస్వామిక సంస్కరణల కోసం చురుకుగాను, పట్టుదలతోను పోరాడగల బూర్జువావర్గం వుంది అని నొక్కిచెప్పారు.

సామ్రాజ్యవాద వ్యతిరేకపోరాటంలో ప్రజా సమీకరణకు ఎంత చిన్న అవకాశం దొరికినా సరే, అది ఎంత తాత్కాలికమైనదైనా, హీనమైనదైనా అపాయకరమైనదైనా, అపనమ్మకమైనదైనా, షరతులతోకూడినదైనా ఉపయోగించుకోవాలి" అని గట్టిగా చెప్పారు. అదేసమయంలో, బూర్జువావర్గం కార్మిక వర్గంతో ఎక్కువకాలం కలిసివుండే మిత్రుడు కాదు అనికూడా చెప్పారు.

జాతీయ బూర్జువావర్గపు ప్రయోజనాలు సామ్రాజ్యవాద పెత్తనానికి పూర్తిగా వ్యతిరేకం గనుక ఆ వర్గాన్ని విశాల ప్రజాస్వామిక సంఘటనలోకి తీసుకురావచ్చును జాతీయ బూర్జువావర్గం, పరిపాలకవర్గంగా వున్న దేశాలకు లేదా అలా తయారవుతున్న దేశాలకు కూడా కొంతవరకిది వర్తిస్తుంది.

ప్రస్తుత పరిస్థితులలో బూర్జువావర్గం అవలంబించే విధానంలో రెండు ధోరణులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొదటిది సామ్రాజ్యవాదాన్ని, పోయిన వలస దేశాలలో తన పెత్తనాన్ని ఏదోరూపంలో తిరిగి నెలకొల్పకోడానికి అదిచేసే ప్రయత్నాలను ప్రతిఘటించడం శాంతిని కాపాడాలని సోషలిస్టు దేశాలలో ఆర్థిక సహకారాన్ని ఏర్పాటు చేసుకోవాలని అనుకోవడం.

రెండవది: జాతీయ బూర్జువా వర్గం ప్రత్యేకించి పెద్ద పెట్టుబడిదారీ వర్గం, ప్రజాస్వామిక సంఘ సంస్కరణలను మెల్లిగా జరిగేటట్లు, అసలు జరగకుండా వుండేట్లుకూడా చేయడానికి ప్రయత్నిస్తుంది. సామ్రాజ్యవాదంతోను, ఫ్యూడలిజంతోను రాజీపడడానికి ప్రయత్నిస్తుంది, కొన్నిదేశాలలో నియంతృత్వాలను నెలకొల్పడానికికూడా ప్రయత్నిస్తోంది. సామ్రాజ్యవాద రాజ్యాలు, ప్రధానంగా అమెరికా, యీ ధోరణి విజయవంతం అయేటందుకు, సర్వవిధాలా కృషిచేస్తాయి.

ఆసియా, ఆఫ్రికా దేశాల అనుభవం

తరుణ ఆసియా, ఆఫ్రికా దేశాల అనుభవం ఒక విషయాన్ని తెల్పుతోంది. సమాజాన్ని త్వరితంగాను, కృత నిశ్చయంతోను ప్రజాస్వామికమొనర్చే చర్యలను జాతీయ బూర్జువా వర్గం ఒక్కటే చేయజాలదు విముక్తి చెందిన దేశం అవలంబించవలసిన విధానాన్ని తాను రూపొందించే అవకాశం బూర్జువా వర్గానికి లభించినప్పుడు, ఆ విధానంపై ప్రజానీకపు ప్రభావం లేకుండా విరోధించ గల్గినప్పుడు అది స్పష్టంగాకనిపిస్తోంది సంఘటితమైన కార్మిక వర్గమూ దాని ప్రజాస్వామిక మిత్రులు, గట్టి ఒత్తిడి తెచ్చినప్పుడు మాత్రమే జాతీయ బూర్జువా వర్గం ప్రజాస్వామిక సంఘ సంస్కరణ మార్గాన్ని అనుసరిస్తుంది

దీన్ని దృష్టిలో పెట్టుకొనే కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాలలోని అభ్యుదయకర శక్తులు, జాతీయ ఐక్య సంఘటనలో శ్రామికవర్గం ప్రధానపాత్ర వహించాలనే పోరాడుతున్నాయి. శ్రామికవర్గంలేని చోట్ల లేదా అది బలహీనంగా వున్నచోట్ల విప్లవకర ప్రజాస్వామిక శక్తులే జాతీయ ఐక్య సంఘటనకు నాయకత్వం వహిస్తాయనికూడా వారు నమ్ముతున్నారు. సంఘటిత కార్మికవర్గంవున్న దేశాలలోను బూర్జువావర్గం సామ్రాజ్యవాదంతో సహకరిస్తున్న దేశాలలోను జాతీయ విముక్తి ఉద్యమంతో శ్రామికవర్గ నాయకత్వం కోసం పోరాటం సాగింపబడుతోంది.

పి. అలెగ్జాండ్రోవ్

ఐక్య సంఘటన

ప్రతి వర్తమాన దేశంలోను వున్న స్పష్టమైన పరిస్థితుల ననుసరించి మార్క్సిస్టులు, జాతీయ విమోచనోద్యమంలో వివిధ వర్గాల పాత్రలు ఏమిటి? అవి ఎంతవరకు పాల్గొనాలి అనే సమస్యను పరిష్కరిస్తారు. జాతీయ బూర్జువా వర్గం తన సామ్రాజ్య వ్యతిరేకతను పూర్తిగా వదలుకోకుండా వున్న స్వతంత్ర ఆసియా, ఆఫ్రికా దేశాలలోని జాతీయ విమోచన పోరాటంలో శ్రామికవర్గం, బూర్జువా వర్గంతో కలిసి ఐక్య సంఘటనను నెలకొల్పేటట్లు చేయడం ఆ పార్టీల కర్తవ్యంగా భావిస్తారు.

జాతీయ బూర్జువా వర్గాన్ని ఎల్లప్పుడూ విప్లవ వ్యతిరేక శిబిరంలోనే వుంచుతూ, అతివాద పదజాలాన్ని ప్రయోగించడంలో మొనగాళ్ళయిన ట్రాట్‌స్కీ యిస్టులు, కార్మికవర్గాన్ని దాని సహజ మిత్రులైన కర్షకుల నుండి వేరు చేయడానికి సిద్ధ పడుతున్నారు. అది దుందుడుకు విధానం అవుతుంది. కృత్రిమ, శ్రామిక వర్గ వీరత్వం అవుతుంది. ప్రధాన శత్రువైన సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తరుణ వర్ధమాన దేశాలు సాగించే పోరాటాన్ని పెడదారులు పట్టించడం అవుతోంది.

అచ్చమైన విప్లవ శక్తులచే యీ ధోరణులు గట్టిగా నిరాకరింపబడ్డాయి. 81 దేశాల కమ్యూనిస్టు, కార్మికపార్టీల సమావేశం ఇలా ప్రకటించింది. "ప్రస్తుత పరిస్థితులలో వలస దేశాలలోను, అధీన దేశాలలోను సామ్రాజ్యవాద ముఠాలతో సంబంధాలులేని జాతీయ బూర్జువావర్గం, సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక విప్లవం యొక్క ప్రధాన కర్తవ్యాన్ని నెరవేర్చడంపట్ల ఆసక్తి కలిగివుంది. అందుచేత అది సామ్రాజ్యవాదానికి ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా కొనసాగింపబడే విప్లవ పోరాటంలో పాల్గొనే అర్హతను నిలబెట్టుకుంటోంది, ఆ దృష్టిలో అది అభివృద్ధికరమైనదే"

సంపూర్ణ రాజకీయ స్వాతంత్ర్య కోసం సాగింపబడే పోరాటం ఏ స్థితిలో వున్నప్పటికీ, దానికి సోవియట్ యూనియన్‌నుండి యితర సోషలిస్టు దేశాలనుండి సోదర సహాయం ఎల్లప్పుడూ లభిస్తుంది. ఆసియా ప్రజలు తాము కొనసాగించే సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో తాము ఒంటరి గాలేమని తెలుసుకున్నారు అభివృద్ధిచెందుతూన్న దేశాలకు అనేక సందర్భాలలో సోవియట్ యూనియన్ ఆర్థిక రాజకీయ సహాయాన్ని అందజేసింది. ప్రపంచంలో మొట్టమొదటి సోషలిస్టు దేశమైన సోవియట్ యూనియన్ బలం పెంపొందినకొద్దీ యీ సహాయంకూడా ఎక్కువ అవుతుంది.

నిజానిజాలు

'భానుద'

అస్తమించెడి రవి
అరుణ కాంతులుగావు
కష్టజీవుల రుధిర
స్వేద బిందువులవి
గగనసీమలతేలు
కారు మేఘముగాదు
కొండరాళ్ళను తొలుచు
కష్టజీవుల గతులు
ఋతురాజు రాకతో
విరియు వృక్షముగాదు
వృక్షఛాయలలోన
వసియించుజీవులు
నెలరాజు వెన్నెలలో
అగుపించు సెగగాదు
నిదురించు శ్రామికుల
వేడి వుచ్ఛ్వాసములు
మకరంద బిందువుల
నొలుకు కుసుమముగాదు
వనమాలి తనువుపై
స్వేద బిందులవి
కల్పనా సౌధములో
కులుకు లొలుకుటగాదు
కనుల యెదుట జరుగు
విధుల నెరుగుటయే!

భట్టిప్రోలు

భట్టిప్రోలు చేనేత సహకార సంఘమునకు ఈ క్రింది నూతన పాలకవర్గం ఎన్నిక అయింది.

శ్రీయుతులు అవుతరపు సూర్యనారాయణ (అధ్యక్షుడు), రాజాబత్తుని లక్ష్మీ సుందరరావు (కార్యదర్శి) వంగర వీరయ్య, గంటి కనకయ్య, వంగర వెంకటేశ్వర్లు, భట్టు వీరరాఘవయ్య కవుతరపు చలపతిరావు, డైరెక్టర్లు.

బ్రెజిల్‌లో "నరహంతక" రాజ్యం

అమెరికా అండదండలతో భూస్వామిక-సైనిక ముఠా సాగిస్తున్న రాక్షసపాలన

విశాలాంధ్ర

"విప్లవాలు సాధారణంగా తమ బిడ్డలనే పొట్టపెట్టు కొంటాయని అంటారు బ్రెజిల్‌లో సంభవించిన మితవాద విప్లవం ఇందుకు అతీతమైనది కాదని, దాని రెండు నెలల చరిత్రలో తేలిపోయింది" అంటూ అమెరికన్ వారపత్రిక "న్యూస్‌వీక్" వ్యాఖ్యానించింది

ఆ పత్రిక తన వాదనను బలపర్చటానికి ఈ క్రిందివిషయాలకు ఉదాహరించింది

• ఆ దేశాన్ని నిజంగాపాలిస్తున్న సైనికాధికారులు, తమను విమర్శిస్తున్న వారినిచూసి సహించలేక బహిష్కరణ కార్యక్రమాన్ని పనిగా పెట్టుకొన్నట్లు కన్పిస్తున్నది. చివరకు తమ కొత్త ప్రభుత్వాన్ని బలపర్చిన వారిని సైతం వారు బహిష్కరిస్తున్నారు.

• కమ్యూనిస్టులపై పోరాటం అనే పేరుతోను, కమ్యూనిస్టులను బహిష్కరించటం అనే మిషతోను ఆ సైనికాధికారులు గత వారంలో రాజ్యాంగ హక్కులను రద్దుచేసే అప్రతిష్ఠాకరమైన "ఇన్‌స్టిట్యూషనల్ యాక్టు"ను తిరిగి ప్రాణం పోయాలని పట్టుబట్టారు.

• సైనికాధికారులుస్వయంగా "నిర్వహించే" బహిష్కరణ కార్యక్రమంలో భాగంగా 500 మంది పేరులతో కూడిన కొత్త "బహిష్కరణ పట్టిక" నొకదానిని తయారుచేశారు, బహిష్కరింపవలసిన వారిలో ఆరుగురు మాజీ మంత్రులు, పదిమంది పార్లమెంటు సభ్యులు, సుప్రీంకోర్టు జడ్జిలు ఇద్దరు, మాజీ ప్రెసిడెంటు జ్యాసెలినో క్యూబిట్‌చెక్ మున్నగు ప్రముఖుల పేర్లు వున్నాయి ఈసారి అధ్యక్షపదవికి జరిగే ఎన్నికల్లో తాను పోటీ చేయగలనని జ్యాసెలినో క్యూబిట్‌చెక్ ప్రకటించి వున్నారు.

• అవినీతి, అక్రమ ఆర్జన అంతులేకుండా పెచ్చుపెరిగిపోయాయి కాగా, పత్రికలేవీకూడ పాలకముఠాను విమర్శించడానికి వీలులేకుండా చేశారు, పైగా ఆ పాలకముఠాయే అవినీతి కమ్యూనిజం ఆరోపణలపై అనేకమందిని అరెస్టు చేస్తూ, నిర్బంధ విధానానికి గురి చేస్తున్నది

సుప్రసిద్ధ అమెరికన్ రాజకీయ వ్యాఖ్యాత డేవిడ్‌నాసర్ ఆదిలో బ్రెజిల్‌లో సైనిక తిరుగుబాటును సమర్థించాడు, ఆయన ఈ మధ్య బ్రెజిల్‌లో పర్యటించిన అనంతరం, ఆ దేశంలోని పరిస్థితిపై ఇలా తెలుపుతున్నారు

నరహంతకుల విప్లవం మనకు అక్కడ ప్రత్యక్షమవుతున్నది"

అమెరికాలో పలుకుబడి కల్గిన పత్రికలైన "న్యూయార్క్ టైమ్స్", చికాగో ట్రిబ్యూన్ లు ప్రెసిడెంట్ గులార్ట్ ప్రభుత్వాన్ని కూలద్రోయడాన్ని మొదట్లో సంబరపడుతూ సమర్థించినప్పటికీ, అవే పత్రికలు ఇప్పుడు పునరాలోచనలో పడక తప్పలేదు. "న్యూయార్క్ టైమ్స్" విలేకరి రియోడిజనిరో నుంచి 1964 జూన్ 10 వ తేదీన ఈ క్రిందివిధంగా తెలిపాడు:

శ్రీ లజపత్ రాయ్

కమ్యూనిస్టు, ఉదారవాది అనేభేదాలేకుండా మితవాది, తీవ్రవాది అనే భేదం పాటించకుండా అందరినీ ఒకేచోట కట్టేపరిస్థితి అక్కడ ఏర్పడింది. వారందరిని గుదిగుచ్చి అరెస్టు చేస్తున్నారు కొత్తప్రభుత్వాన్నిబలపర్చినవారిని సైతం కొన్ని సందర్భాలలో నిర్బంధిస్తున్నారు

ఈ బహిష్కరణ కార్యక్రమానికి స్వస్తి చెప్పాలని' చికాగో ట్రిబ్యూన్ తన సంపాదకీయంలో కోరింది, "బ్రెజిల్‌లో పరిస్థితి అతి త్వరితంగా చేయిదాటిపోతుందన్నందున" పునరాలోచించవలసినదిగా ఆ పత్రిక అమెరికా ప్రెసిడెంటుకు విజ్ఞప్తి చేసింది.

ప్లేట్ ఫిరాయింపు

ఆ విధంగా ప్రెసిడెంట్ జాన్సన్ ఆ విప్లవాన్నే- ఏ విప్లవానికైతే తన హర్షామోదాలు తెలిపాడో సంభవించిన ప్రతీఘాతుక విప్లవాన్నే ఏప్రిల్‌లో - ప్రముఖ అమెరికన్ పత్రికా వ్యాఖ్యాతలు నరహంతకుల విప్లవ" అని అంటున్నారు ప్రముఖ అమెరికన్‌పత్రికలే ఇప్పుడు ఆ విప్లవాన్ని దుమ్మెత్తి పోస్తున్నాయి

బ్రెజిల్ సైనికాధికారుల వైఖరిని గురించి ఒకానొక అమెరికన్ అధికారి ఇలా వ్యాఖ్యానించినట్లు న్యూస్ వీక్" ప్రకటించింది:

ఇప్పటికి జైళ్ళలో వున్న వేల కొలది ఖైదీలలో ప్రతి ఒక్కరూ కమ్యూనిస్టని చెబితే, అమెరికా సంతసిస్తుందని ఆ సైనికాధికారులు భావిస్తున్నట్లు తోస్తున్నది దీని ద్వారా వారేదో మనకు పెద్ద ఉపకారంచేసి పెడుతున్నట్లు వారు అనుకొంటున్నారు. దీనికి ప్రతిఫలంగా మననుంచి వారు పెద్ద ఉపకారాన్ని ఆశిస్తున్నారు. బ్రెజిల్ అమెరికాకు యివ్వవలసిన ప్రయివేటు పబ్లిక్ అప్పుల చెల్లింపును వాయిదా వేయమని వారు మన నుంచి కోరుతున్నారు. ఆ అప్పులు ఇంచుమించు 200 కోట్ల డాలర్ల వరకు వుంటాయి.

ప్రజలపై దారుణమైన దమన నీతిని అమలు జరుపుతున్నారు ఎలాంటి నేరారోపణ లేకుండానే వేలకువేలు జనులను అరెస్టు చేశారు వారిని న్యాయస్థానాలలో విచారించటంలేదు చివరకు అమెరికన్ బడా వ్యాపారస్తుల బాకా అయిన "టైమ్" వార పత్రిక సైతం, అమెరికన్ ప్రెసిడెంట్ ప్రశంసలు పొందిన ఆ మితవాద సైనికాధికారుల కార్యకలాపాలను గురించి ఏమని తెలుపుతున్నాడో చూడండి:

"క్యాబినెట్ మంత్రులతోను, అతిముఖ్యమైన సైనికాధికారులతోను ఏర్పడిన జాతీయ భద్రతా సమితి అవలంబిస్తున్న పద్ధతులు ఆందోళన కల్గిస్తున్నవి. తాము నిర్దోషులమని న్యాయస్థానాలలో వాదించుకొనే హక్కు అనుమానితులకు లేకుండా అది చేస్తున్నది. అసలు తమపై ఏనేరం ఆరోపించబడిందో కూడా తెలుసుకోవడానికి అనుమానితులు నోచుకోవటంలేదు, అంతేకాదు, తాము నిందితులమన్న సంగతే వారికి తెలియటంలేదు, జాతీయ భద్రతా సమితి రహస్యంగా సమావేశమవుతున్నది. అది తాను తయారు చేసిన "దోషుల పట్టిక"ను ప్రకటిస్తున్నది."

ఈ విధంగా ఇంతవరకు 167 మంది రాజకీయ వేత్తలు, ప్రభుత్వోద్యోగులు తమ హక్కులను కోల్పోయారు. (1964 జూన్ 12 వ తేదీ సంచిక)

క్యూబిట్‌చెక్ హెచ్చరిక

బ్రెజిల్ జాతికి కొత్తరాజధానీ నగరాన్ని- బ్రాసిలాను నిర్మించిపెట్టిన వ్యక్తి, ఆ దేశంలో పరిశ్రమలను, ఉక్కు ఉత్పత్తి, ఆటోమొబైల్ పరిశ్రమలను అభివృద్ధిచేసిన వ్యక్తి, ఇరిగేషన్ పథకాలను ప్రారంభించటంద్వారా వ్యవసాయకోత్పత్తిని పెంచిన వ్యక్తి బ్రెజిల్ మాజీ ప్రెసిడెంటు జూసిలినో క్యూబిట్ చెక్ అలాంటి ఆ వ్యక్తిపై గడచిన వారం జాతీయ భద్రతాసమితి సమావేశంలో అక్రమ ఆర్జన, అవినీతి, కమ్యూనిజాన్ని బలపర్చటం వంటి ఆరోపణలు మోపారు రాజకీయ హక్కులు లేకుండా చేస్తున్నవారి జాబితాలో ఆయన పేరును కూడా చేర్చారు ఆయన పౌరస్వాతంత్ర్య హక్కును కూడా రద్దు చేస్తున్నారు. అంటే 1965 లో అధ్యక్షపదవికి జరిగే ఎన్నికలలో పోటీచేసే అవకాశం ఇక ఆయనకు వుండదు.

మే 30 వ తేదీన రియోడిజనీరో నుంచి జారీచేసిన పత్రికా ప్రకటనలో (1964 జూన్ 2 వ తేదీ 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక) క్యూబిట్‌చెక్ ఇలా పేర్కొన్నారు:

"అత్యంత పవిత్రమైన న్యాయసూత్రాలను ఈ విప్లవం తన పొట్టను పెట్టుకొంటున్నది ప్రజాజీవితంనుంచి నన్ను వెలివేసే ఈ నిరంకుశ చర్యవల్ల, కమ్యూనిజంనుండిమనలనురక్షించడంకోసంప్రారంభించబడిన విప్లవానికే తీరని అంతరాయం ఏర్పడుతున్నది. అధర్మ బీజాలు నిరంకుశ ధోరణి, పగ, విద్వేష బీజాలు నాటుకొంటున్నాయి. వారు నాపై తీయాలనుకొంటున్న దెబ్బ మన ప్రజాస్వామిక జీవితానికే తగులుతుంది"

అమెరికా ప్రోద్బలంతో బయలుదేరిన సైనిక తిరుగుబాటు తన మూడు నెలల జీవితంలో చేసిన నిర్వాకం ఇది. లాటిన్ అమెరికన్ ప్రజల మహానాయకుడు బొలివార్ ఒకప్పుడు చెప్పిన మాటలు ఈ సందర్భంలో గమనార్హమైనవి "మన విప్లవాలు పెనుభూతాల వంటివి కంటికి కల్పించిన, చేతికి అందిన ప్రతిదానినీ మ్రింగివేయడమే వాటి పని" బొలివార్ హెచ్చరించిన పెనుభూతాలవంటి బాపతు విప్లవమే ఈనాడు బ్రెజిల్‌లో స్వైర విహారం చేస్తున్నది

ఒక వైపున సైనికాధికారులు ప్రజల పౌర స్వత్వాలను సర్వనాశనం చేయడంలోను, బహిష్కరణ పట్టికలు తయారుచేయడంలోను, రాజకీయ వేత్తలను ప్రభుత్వోద్యోగులను వెలివేస్తూ, వారిరాజకీయ హక్కులను పొట్టను పెట్టుకొనడంలోను నిమగ్నమైవుండగా, ఇదంతా చూసి విభ్రాంతులైన బ్రెజిల్ ప్రజానీకం" మరి ఇక మన సమస్యలమాట ఏమిటి? అని ప్రశ్నిస్తున్నారు.

'అంతులేని సమస్యలకు ఆలవాలమైన అతివిశాలమైన దేశం" అని ఒకానొకప్పుడు ప్రెసిడెంట్ ఫ్రాంక్లిన్ డీ రూజ్వెల్టు బ్రెజిల్‌నుగురించి వర్ణించాడు ఆ దేశంలో ద్రవ్యోల్బణ సమస్య తీవ్రతరమైవుంది. పారిశ్రామికీకరణ విదేశీ పెట్టుబడి సామ్రాజ్యాలు ఆ దేశాన్ని పట్టుకు పీడిస్తున్నాయి. దేశం ఈశాన్య ప్రాంతంలో అనావృష్టితోనూ, వాయవ్య ప్రాంతంలో వరదలతోను ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దేశంలో నిరక్షరాస్యత, రోగాలు రాజ్యమేలుతున్నాయి. ఆయుః ప్రమాణం చాలా తక్కువగావుంది. వ్యభిచారం, అక్రమ ఆర్జన, అవినీతి, సైనిక తత్వం ప్రబలంగావున్నాయి లాటిన్ అమెరికన్ వ్యవసాయసమస్యలపై నిపుణుడుగాపేరొందిన ప్రొఫెసర్ నాక్ మాటలలో చెప్పాలంటే,"బ్రాజిలియన్ జీవనానికి, రాజకీయాలకు గీటురాయి" అనతగిన అతి ముఖ్యమైన భూ సమస్యకూడా అపరిష్కృతంగానే మిగిలిపోయింది.

లాటిన్ అమెరికన్ దేశాలన్నింటిలోకి పెద్ద దేశం బ్రెజిల్. దక్షిణ అమెరికా ఖండంలో దాదాపు సగం భూభాగం అది. అలాస్కా మినహా అమెరికా వైశాల్యంతో బ్రెజిల్ విస్తీర్ణం సరిసమానం ఆర్థికవనరులు అపారంగా వున్న దేశం అది వ్యవసాయాభివృద్ధికి అనేక వనరులు వుండటంతో పాటు ఇటు కావలసినంత ఖనిజసంపదకూడా ఆ దేశంలో వుంది. పెట్రోలియమ్ నిధులుకూడా వున్నాయి బ్రెజిల్ పూర్వ చరిత్రకు పోర్చుగల్‌కు సంబంధం వుంది. జనాభాలో నీగ్రోలు ఎక్కువగా వున్నారు, మిశ్రజనాభా కలిగిన దేశం, ప్రపంచంలోనే సారవంతమైన క్షేత్రాలు అని చెప్పదగిన క్షేత్రాలు కొన్ని ఆ దేశంలో వున్నాయి ఆ దేశం స్వాతంత్ర్యం పొందినప్పటినుంచీ భూస్వామ్య వర్గానికిచెందిన నాయకత్వమే ఆ దేశాన్ని పాలిస్తూ వస్తున్నారు.

భూములపై గుత్తాధిపత్యం కలిగివున్న వర్గం పాలనలో, పొలాలలో కష్టపడి పనిచేసే కర్షకులు ఇంచుమించు బానిస బ్రతుకువెళ్ళ బోస్తున్నారు అమెరికా మాజీప్రెసిడెంట్ ఐసన్‌హోవర్ సోదరుడైన మిల్టన్ ఎస్. ఐసెన్‌హోవర్ స్వయంగా ఎనిమిదేళ్ళ పాటు అమెరికన్ ప్రెసిడెంట్ ప్రతినిధిగాలాటిన్ అమెరికా దేశాలలో గడిపి తన అనుభవాలను క్రోడీకరిస్తూ రచించిన "దాక్ష రసం చేదు' (1960) అనే గ్రంథంలో ఇలా వివరించారు:

అగ్ని పర్వతం

"జనాభాలో బహు కొద్దిమంది గాగల భూస్వామ్యవర్గం గుప్పెట్లోవున్న బ్రెజిల్ కాళ్ళీడ్చుకుంటూ క్రిందపడుతూ లేస్తూ సాగిపోతున్నది. ఈశాన్యబ్రెజిల్ ఏ క్షణంలోనైనా బద్దలయ్యే అగ్నిపర్వతంలా వుంది అక్కడ ఏ క్షణంలోనైనా తీవ్రరూపంలో తిరుగుబాటు ప్రారంభం కావచ్చు వెనిజులా దేశం కంటే రెండింతలుగాను, మధ్య అమెరికాలోని అయిదు రిపబ్లికుల విస్తీర్ణం కంటే రెండింతలుగాను వున్న ఆ ప్రాంతంలో ఏడు రాష్ట్రాలు వున్నాయి. ఈశాన్య బ్రెజిల్‌లోని జనాభాలో నూటికి 75 వంతులు పొలాలలోనే పనిచేస్తూ జీవిస్తున్నారు. తమ ప్రాచీన పూర్వీకుల వలెనే వారు అనాగరికంగానే జీవిస్తున్నారు ఆ ప్రాంతంలోని జనాభాలో నూటికి రెండు వంతులుగావున్న పెద్ద భూస్వాముల చేతుల్లో, ఆ ప్రాంతంలోని మొత్తం పంట పొలాలలో సగానికి పైగా కేంద్రీకృతమైవుంది. చివరకు కొదిపాటి భూఖండాలను కలిగివున్న రైతులకు సైతం పట్టాలు లేవు అందుచేత వారు భూస్వాములకు కౌలు చెల్లించుకోవలసి వస్తున్నది."

"దక్షిణ అమెరికన్ దేశాల ప్రజలందరికంటే బ్రెజిల్ ప్రజలు నిరుపేదలుగా జీవిస్తున్నారు. వారి సాలీనా ఆదాయం 100 డాలర్లకు మించటంలేదు పాలై రాష్ట్రంలో జనుల ఆయుఃప్రమాణం 31 సంవత్సరాలకు మించి లేదు'

బ్రెజిల్ జమీందార్లను గురించి మిల్టన్ ఐసెన్‌ హోవర్ ఇలా వర్ణించాడు,

"ఫిజెండా" జమీదారీలు సామ్రాజ్యంలో అంతర్ సామ్రాజ్యంగా వున్నాయి, కేంద్ర ప్రభుత్వం తలపెట్టే మార్పులను ప్రతిఘటించ గలుగుతున్న ప్రాంతీయ తత్వానికి అవి పెట్టిన కోటలుగా పనిచేస్తున్నాయి"

ఒక ఫజెండాకు - జమీందారుకు - వేయికుటుంబాలవారు ఊడిగం చేస్తున్న ఉదంతాన్ని ఒక భూస్వామికి అయిదువేల కుటుంబాలవారు దాకిరీ చేస్తున్న ఉదంతాన్ని మిల్టన్ తన గ్రంథంలో వర్ణించాడు

బ్రెజిల్‌లోని పెద్ద జమీందారీలలో ఒకటయిన ఫిజెండాకు మేము వెళ్లాము. అతిభయంకరుడైన ఒక వ్యక్తి అధీనంలో గల సామ్రాజ్యమేనని చెప్పాలి. అతను అందగాడు: సరదా పురుషుడు: అతని ఉత్సాహానికి పట్టపగ్గాలులేవు. అతడు ఫ్యూడల్ భూస్వామి కనుక, కనుచూపుమేర దూరలో గల భూమి యావత్తు అతని సొంతమే. ఆయనకు చెందిన పొలాలలో అయిదువేల కుటుంబాలవారు పనిచేస్తున్నారు అందరూ అతనికి దాకిరీ చేసేవారే. ఆయన తన పళ్ళ తోటల మధ్య అతిసుందరమైన ప్రదేశానికి మమ్ములను తీసుకువెళ్లాడు. అక్కడ ఆయన మా కోసం (మిట్టమధ్యాహ్నం) విందుఏర్పాటు చేశాడు. మాకు విపరీతమైన ఆకలివేస్తున్నది. అందుచేత ఆ విందుకోసం చూడగానే నోరూరింది. అక్కడ కూర్చొని విందు ఆరగిస్తున్న మాకు, అల్లంత దూరాన పొలాలలో పని చేస్తున్న కూలీలు కన్పిస్తున్నారు. వారు బక్కచిక్కి వున్నారు. వయస్సును మించిన వృద్ధాప్యం వారిని కృంగదీస్తున్నది. అప్పటికే వారు అలసిపోయి వున్నారు. అయినా ఆ మండుటెండలో వారు ఇంకా అనేకగంటలపాటు తమ ఒంట్లో మిగిలినశక్తిని కరిగించక తప్పదు బహుశా వారు పొద్దున్నే ఇంత చద్ది పొట్టలో వేసుకొని వచ్చి వుంటారు. వారిని చూస్తుంటే, అంత పసందైన విందు కూడా మాకు ఏమాత్రం రుచించలేదు." (198, 199 పేజీలు)

అంతులేని దారిద్ర్యం

బ్రెజిలియన్ ప్రజల పరిస్థితులను వర్ణిస్తూ మిల్టన్ ఐసెన్‌హోవర్ ఇలా వ్రాశాడు:

"జనాభాలో నూటికి 60 వంతులకు పైగా వ్యవసాయముపై ఆధారపడి జీవిస్తున్నారు. అయితే, జనాభాలో నూటికి 2 వంతులుగావున్న వారి చేతుల్లో సాగుభూమిలో హెచ్చుభాగం కేంద్రీకృతమై వున్నది బ్రెజిల్ దేశంలో ఆయుః ప్రమాణం 35—40 సంవత్సరాల మధ్య వున్నది. సరియైన పోషణ లేనందున చాలమంది చచ్చిపోతున్నారు బ్రెజిల్‌లోని 6½ కోట్ల జనాభాలో కొద్దిమంది శ్రీమంతులను మినహాయిస్తే మిగతా ప్రజలందరు నిస్సారమైన తిండి తిని జీవిస్తున్నారు పుష్టికరమైన ఆహారానికి వారు నోచుకోవడం లేదు రొట్టె, వరి అన్నం, జొన్నకూడు చిక్కుడు గింజలు మున్నగు ఆహార పదార్థాలు మాత్రమే వారికి అందుబాటులో వున్నాయి. వారికి మాంసం లభించదు నూటికి కోటికివారు ఎప్పుడైనాటక కోడినో పందినో కోసుకు తింటారు అడపాదడపా ఎండబెట్టిన గోమాంసం తింటారు అంతే అసలే అంతంతమాత్రంగావున్న తన ఆదాయంలో హెచ్చుభాగాన్ని బ్రెజిల్ దేశ[illegible] తిండికి వెచ్చించవలసి వస్తున్నది. గ్రామీణ ప్రాంతాలనుంచి వేలసంఖ్యలో వ్యవసాయ కూలీలు పొట్టచేతపట్టుకొని పట్టణాలకు తరలి వెళ్లుతున్నారు అక్కడ వారు మురికికూపాలలో తలదాచుకోవలసివస్తున్నది. వ్యవసాయకూలీలు ఈ విధంగా పొలాలువదలి, పట్టణాలకు తరలిపోవటంతో ఆహారోత్పత్తి తగ్గిపోతున్నది. (112 118 పేజీలు)

బ్రెజిల్‌లోని భూసంబంధాలను వివరించడంతో మిల్టన్ ఐసెన్ హోవర్ తన గ్రంథాన్ని ముగించాడు.

లాటిన్ అమెరికాలోని అనేక దేశాలలోవలెనే బ్రెజిల్‌లో కూడా భూస్వామ్య బానిస సంబంధం ఆధారంగా ఆ భూసంబంధాలు నెలకొన్నాయనీ, తత్పర్యవసానంగా కష్టజీవులు కటిక దారిద్ర్యంలో జీవించవలసి వస్తున్నదనీ జాతీయార్థికాభివృద్ధికి తీరని ప్రతిబంధకం ఏర్పడుతున్నదనీ ఆయన వివరించారు.

ప్రెసిడెంట్ గులార్ట్ ప్రభుత్వం ఆ భూస్వామ్య-బానిస సంబంధాలను మార్చాలని ప్రయత్నించినందువల్లనే, భూస్వామ్య కుటుంబాలనుంచి వచ్చిన సైనికాధికారులు ఆయన ప్రభుత్వాన్ని కూలద్రోశారు. ఆయన తలపెట్టిన వ్యవసాయ సంస్కరణల బిల్లునుచూచి బెదిరిపోయిన భూస్వామ్య వర్గం సైనిక తిరుగుబాటును లేపింది.

బ్రెజిల్‌ను ఎదుర్కొంటున్న మరొక తక్షణ తీవ్ర సమస్య కూడా వుంది. దురదృష్ట వశాత్తు మిల్టన్ ఐసెన్‌హోవర్ ఈ సమస్యను తన 300 పేజీల ఉద్గ్రంథ

(మిగతా 6 వ పేజీలో)

ప్రజల ప్రధాన శత్రువు ఎవరు?

ప్రశ్న: ప్రజల దారిద్ర్యానికి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వమేనన్న విషయం ఎలా కాదనగలరు? అందుచే సహజంగా నేడు కాంగ్రెసే ప్రజల ప్రధాన శత్రువు.

—(పి. జి. నాయర్, ఎర్నాకుళం)

జవాబు: ప్రజల దారిద్ర్యస్థితిని గురించి ఎవ్వరుకూడా - అందులో కమ్యూనిస్టుపార్టీ - కాదనలేదు. ఇటీవల భారత రిజర్వుబ్యాంక్ ప్రకటించిన నివేదిక కార్మికుల నిజవేతనాలు [illegible] యని వెల్లడిచేసింది.

వ్యవసాయ కార్మికుల దుర్భర దారిద్ర్య జీవన ప్రమాణాలు మరింత అధ్వాన్నమయ్యాయని ఇతర పూర్వపు అధికార నివేదికలు తెలియజేశాయి. పట్టణాలలోని మధ్యతరగతి ప్రజలలో అత్యధిక సంఖ్యాకులు తమ ఆదాయంకంటే ఖర్చు ఎక్కువగాచేస్తున్నట్లు మరొక నివేదికతెలియజేసింది. నిరుద్యోగం మన సమాజానికి వ్యాధిగా పెంపొందుతున్నది.

ప్రస్తుత విధానాలూ, వ్యవహార పద్ధతీ కొనసాగినట్లయితే ప్రజల్లోని అత్యధికభాగం ఈ శతాబ్దం చివరికి కూడా ప్రస్తుత దారిద్ర్య స్థితిని దాటలేరని, దీర్ఘకాల ప్రణాళికలు సైతం ఆశ కల్గించటంలేదనీ స్పష్టమౌతుంది. ఈలోగా ధరలు ఆందోళనకరంగా విపరీతంగా పెరిగిపోవడం వల్ల పేదలు దోపిడీ చేయబడుతున్నారు.

భారత పెట్టుబడిదారీ విధానం ప్రధానంగా పెంపొందే క్రమము త్వరితమౌతున్నది.

రాజకీయ అధికారం కాంగ్రెస్ గుత్తగా వున్నప్పుడే, దేశాన్ని త్వరగా అభివృద్ధిచేసే అవకాశాలు, ప్రజల దీనస్థితిని తొలగించడానికి తగినన్ని అవకాశాలు కాంగ్రెస్‌కున్న కాలంలోనే, ప్రజల ఈ భయానక బాధలు పెచ్చు పెరిగాయి.

త్వరితగతిని అభివృద్ధి లేకపోవడం, ప్రజల దారిద్ర్యం, కాంగ్రెస్ వైఫల్యానికి కొలతబద్దలు తప్పకుండా ఈ నేరానికి బాధ్యత కాంగ్రెసుదే ప్రజలు ఆపాదించే అభియోగాలను, వారి న్యాయమైన ఆగ్రహాన్ని చవిచూడటానికి అది బోనులో నిలబడవలసిందే

అందుచేతనే కాంగ్రెస్ అవలంబించే ప్రజా వ్యతిరేక విధానాలను, అభివృద్ధి నిరోధక విధానాలకు రాజీలేని వ్యతిరేక వైఖరిని కమ్యూనిస్టుపార్టీ అవలంబించింది. అందుచేతనే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అనేక పోరాటస్వరూపాలను కమ్యూనిస్టుపార్టీ రూపొందించింది అందుచేతనే కాంగ్రెస్ గుత్తాధికారాన్ని అంతమొందించడం, లేక బలహీన పరచడం తన కేంద్ర నినాదంగా కమ్యూనిస్టుపార్టీప్రకటించింది.

కొంత మంచిచేసింది

ఇదే సమయాన పండిట్ నెహ్రూ నాయకత్వాన కాంగ్రెసు ప్రభుత్వం దేశానికి కొంత మంచికూడా చేసింది. అలీన విధానం, వలస వ్యతిరేకవిధానం అనే విదేశాంగ విధానాన్ని అది అవలంబించింది. ప్రభుత్వ రంగాన్ని పెంపొందించి, కొన్ని భారీపరిశ్రమలను నిర్మించింది. కొంతవరకు ప్రణాళికావిధానాన్ని ప్రవేశపెట్టింది. ఆర్థిక సహాయంకోసం, వర్తకం కోసం సోషలిస్టు దేశాలను ఆర్థించింది, లౌకిక, పార్లమెంటరీ ప్రజాతంత్ర పద్ధతిని అవలంబించింది. ఇలాగే మరికొన్ని...

కాంగ్రెసు విధానంలోని ఈ అభివృద్ధికరమైన అంశాలు దానంతటవే వచ్చినవికావు. జాతీయ బూర్జువాయొక్క (వీరిసంస్థ కాంగ్రెస్) లౌకిక ప్రయోజనాలవల్ల, ప్రజానీకంసాగించిన ఉద్యమం ఒత్తిడివల్ల ఇవి వచ్చాయి.

ఈ విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబించవలసిందిగా కోరిన ఉద్యమానికి కమ్యూనిస్టుపార్టీ అగ్రగామిగావుంది. అభివృద్ధి నిరోధకులు, కాంగ్రెస్‌లోని [illegible] లకు వ్యతిరేకంగా ఈ విధానాలను సంరక్షించడంలో కమ్యూనిస్టుపార్టీ అగ్రగామి పాత్రను వహించుతూనే వుంది.

కాంగ్రెస్, కాంగ్రెస్ ప్రభుత్వమూ, మొత్తంగా భారత ప్రజల ప్రధాన శత్రువుకాదు. సామ్రాజ్యవాదంతో రాను రాను ఎక్కువగా సహకరించుతున్న గుత్త వ్యాపారుల వర్గప్రయోజనాలను ప్రతిబింబించే కాంగ్రెస్‌లోని మితవాద వర్గమూ, స్వతంత్ర, జనసంఘ అకాలీ, డి. యం. కె, మొదలయిన యితర మితవాద అభివృద్ధి నిరోధక శక్తులూ భారత ప్రజలకు ప్రధాన శత్రువులు.

శ్రీ మోహిత్ సేన్

ఇతర వర్గాలు

కాంగ్రెస్‌లో మరికొన్ని వర్గాలున్నాయి గుత్త వ్యాపారులు కానట్టి దేశభక్తి యుత బూర్జువాజీ, ధనిక రైతులు, మధ్య తరగతి ప్రజల ప్రతినిధులు కాంగ్రెస్‌లోను, కాంగ్రెస్ ప్రభుత్వంలోను వున్నారు. వీరు భారత ప్రజలకు శత్రువులుకాదు ఊగిసలాడే వారైనా వీరు వారి మిత్రులే. వీరికి ద్వంద్వస్వభావం వుంది. వీరు మితవాదులతో సంబంధాలను త్రెంచుకొన్నవారు కాదు.

ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, చట్టరీత్యా చూసినట్లయితే కాంగ్రెస్ విధానాలన్నింటికీ శ్రీ యస్. కె పాటిల్, మొరార్జీదేశాయిల వలెనే పండిట్ నెహ్రూకు బాధ్యత వుంది అలాగే కృష్ణమీనన్, కె. డి. మాలవీయలకు కూడా. వీరంతా తరతమ భేదాలతో కాంగ్రెసు నాయకులు కేంద్ర ప్రభుత్వ మంత్రులు. కాని పండిట్ నెహ్రూ భారత ప్రజల ప్రధానశత్రువా? లేక కృష్ణమీనన్, కె. డి. మాలవీయగార్లు శత్రువులా? జాతీయ ప్రజాప్రయోజనాల విషయంలో వారు యస్. కె. పాటిల్, మొరార్జీ దేశాయిలున్న పరిస్థితిలోనే వున్నారా?

కాంగ్రెస్ మొత్తంగా ప్రజల ప్రధాన శత్రువు అనేవారు, ఈ ప్రధానశత్రువుకు ముఖ్య మద్దతుదారు పండిట్ నెహ్రూ యని శాస్త్రీయంగా అంగీకరించవలసివుంది.

అలా జరిగితే నెహ్రూను ఇంత అద్భుతమైన ప్రేమ గౌరవాలతో ప్రజలెందుకు చూస్తున్నారు? ఆయనకు సమర్పించిన అభినందనల నన్నిటినీ మోసమని భావించాలా?

స్వాతంత్ర్య పోరాటంలో ఆయన నిర్వహించిన పాత్ర, అసమానమైన వ్యక్తిత్వం, శీలం-ఇవన్నీ ప్రజల ప్రేమకు పాత్రుణ్ణిచేశాయి. దేశం, దేశ ప్రజల ప్రయోజనాలను ప్రతిబింబించే కాంగ్రెస్ విధానంలో అభివృద్ధికర అంశాలకు ఇతరు లెవరికన్నా నెహ్రూయే బాధ్యుడన్న అంశం కూడా మరొకటి వుంది.

అందువల్లనే మితవాద అభివృద్ధి నిరోధకులకు ఆయనన్నా, ఆయన విధానాలతో సన్నిహితంగా ఏకీభవించే వారన్నా ఆగ్రహం అందుచేతనే ఒక ప్రక్క నెహ్రూ దహన సంస్కారం కాకముందే "టైమ్"పత్రిక (అమెరికా) నెహ్రూను దూషిస్తూ వ్యాఖ్యానించింది నెహ్రూ ఇక లేరు గనుక. చిట్టచివరకు ఈ నాడైనా తమకు అవకాశం కల్గిందని మితవాద అభివృద్ధి నిరోధకులు పెద్ద ఆశలు పెట్టుకొంటున్నారు.

మొత్తం కాంగ్రెస్ భారతప్రజల శత్రువని చెప్పేవారు, కాంగ్రెసుకు విశాల ప్రజానీకంలో వున్న పలుకుబడిని చూడకపోవడమేగాక, కాంగ్రెస్, కాంగ్రెస్ నాయకత్వానికి ఉన్న విభిన్నవర్గ స్వభావాన్ని గుర్తించలేకపోతున్నారు.

గుత్త వ్యాపారులు, భూస్వాములు కాంగ్రెస్ యొక్క అన్ని స్థాయీలలోనూ వున్నారు. వారు కీలకమైన స్థానాలలో వున్నారు. కాంగ్రెస్ పార్టీ యంత్రాంగంపైన, ప్రభుత్వంపైన వారికి గట్టి పట్టు వుంది.

ఐతే కాంగ్రెస్ పార్టీపైన లేక ప్రభుత్వం పైన పూర్తి పెత్తన, తమదే ప్రత్యేకంగా అయేటట్లు ఇంకా చేసుకోలేదు. అనేక సందర్భాలలో వారు తమ ప్రత్యేక నాయకత్వాన్ని, అధికారాన్ని నెలకొల్పాలని ప్రయత్నించి నప్పుడు కాంగ్రెస్‌లోని ఇతర శక్తులు, ప్రజలు త్రిప్పికొట్టారు.

కాంగ్రెసునూ, కాంగ్రెసు ప్రభుత్వాన్నీ ప్రత్యేకంగా తమ ప్రయోజనాలకే సాధనంగా గుత్త వ్యాపారులు, భూస్వాములు చేసుకోగల్గినట్లయితే, అపుడు తప్పకుండా కాంగ్రెసు భారత ప్రజల ప్రధాన శత్రువవుతుంది.

కాని నేటి పరిస్థితి అదికాదు కాంగ్రెసును మిశ్రమ వర్గాలు నడుపుతున్నాయి. అందులో గుత్తవ్యాపారులు కాని దేశభక్తిగల్గిన పెట్టుబడిదారీవర్గంకూడా వుంది. అందుచేతనే ప్రజల కష్టాలను తొలగించి వారి పరిస్థితి బాగుపరచడానికి కృషి చేసే ఉద్యమానికి నాయకత్వం వహించుతున్న కమ్యూనిస్టుపార్టీ, తదితరులూ మొత్తం కాంగ్రెసు యెడల ద్వంద్వ విధానాన్ని అవలంబించుతున్నారు. అందుచేతనే కాంగ్రెసులోని మితవాద వర్గంపైన, బయటనున్న దాని మిత్రుల పైన కమ్యూనిస్టుపార్టీ తన దాడిని కేంద్రీకరించుతుంది

కాంగ్రెసుయొక్క అభివృద్ధి విధానాలను కాపాడటానికి, కాంగ్రెసుయొక్క అభివృద్ధి నిరోధక ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించడానికి, దేశాన్ని ప్రభుత్వాన్ని అతివాదంవైపు మరలించడానికి కాంగ్రెసులోని ప్రజాతంత్రవాదులకు, కాంగ్రెసు నాయకత్వంలోని ప్రజాతంత్రవాదులకుసైతం కమ్యూనిస్టుపార్టీ తన మైత్రీ హస్తాన్ని అందించుతుంది.

భారతదేశంలోని ప్రజాతంత్ర నాయకత్వంలోని ఈ రెండు పెద్ద సంస్థలను అనుసరించుతున్న ప్రజలు కలిసి, ఐక్య కార్యాచరణను లేక ఒకే గమ్యంవద్ద కలిసే కార్యాచరణను కొనసాగించినప్పుడే ఈ పోరాటం తగు విజయాన్ని సాధించగలదు.

కమ్యూనిస్టు పార్టీలోని సభ్యులు పిడివాదాన్ని వదలివేసినప్పుడు, కాంగ్రెసులోని కనబడ్డ ప్రతివారినీ నిందించడం మానివేసినప్పుడు, కాంగ్రెసులోని అతివాదులు కమ్యూనిస్టుపార్టీని గురించి తనభయాలను అనుమానాలను వదలుకున్నట్లయితే, కాంగ్రెస్ తానొక్కటే ఇపుడున్న స్థితిలోనే సమస్యలను పరిష్కరించగలదన్న భావాన్ని అది వదలుకొన్నట్లయితే, అలాంటి ఐక్యత, కార్యాచరణ వాస్తవమౌతాయి.

ఇది కష్టమూ క్లిష్టమూ ఐన పని కాంగ్రెస్ ప్రధాన శత్రువని అరవడం, అవకాశవాదులతో కలిసి కాంగ్రెస్ వ్యతిరేక సంఘటనలను నిర్మించడం తేలికే కాని ప్రజల్ని దేశాన్ని సంరక్షించడానికి దేశాన్ని అతివాదం వైపు మొగ్గేటట్లు చేయడానికి ఒకే ఒక మార్గం పైనచెప్పిన ఐక్యత కార్యాచరణతే.

పిల్లనగ్రోవి

— రెడ్డిగోయిన వెంకటేశ్వర్లు.

హిందూమహాసముద్రంలో అమెరికా సప్తమనౌకాదళం

ఆసియా - ఆఫ్రికా దేశాలకు ముప్పు

దుష్కృత్యాలకు పేరుగన్న అమెరికా సప్తమ నౌకాదళం తన కార్యకలాపాలను హిందూమహాసముద్రానికి వ్యాపింప చేసింది ఇది, భారతదేశం, బర్మా సింహళం మొదలైన ఈ ప్రాంతదేశాలకు నూతన ప్రమాదాన్ని తెచ్చిపెడుతోంది. ఈ దేశాలు అవలంబించుతున్న అలీన విధానాన్ని సవాలు చేస్తోంది. ఈ ప్రాంతమంతటిలోను తగినంతగా ఉద్రిక్తతను రెచ్చగొడుతోంది.

వాషింగ్‌టన్‌లో ఎప్పుడో పన్నిన దుస్సాహసిక పథకం ఇప్పుడు ఆచరణలోకి వస్తోంది. ఆసియా ఆఫ్రికా ప్రజలు అనేకసార్లు అసమ్మతి తెలిపినా అమెరికా సప్తమ నౌకాదళం గత ఏప్రిల్‌లో హిందూ మహాసముద్రంలో ప్రవేశించి పశ్చిమదిశగా వెళ్లింది అసోసియేటెడ్ వార్తాసంస్థ ప్రకారం అమెరికా పెద్దనౌకలు, ఇదివరలో చాలఅరుదుగా సందర్శించే ప్రాంతాలను-ముఖ్యమైన నౌకాతీర ప్రాంతాలను సందర్శించడం ప్రారంభించాయి

అమెరికా సప్తమ నౌకా దళంలో యుద్ధ నౌకలు రాకెట్లు అణ్వాయుధాలతో కూడిన జలాంతర్గాములు, 120 విమానాలు, 650 సైనిక సిబ్బంది 64 వేల మంది వున్నారు.

అమెరికా ఆడుతున్న ఈ బాహా సైనిక జూదంవలన ప్రమాదం సుస్పష్టమే, హిందూ మహా సముద్రంలోకి అమెరికా సప్తమ నౌకా దళాన్ని ప్రవేశ పెట్టడం అమెరికా సైనిక కార్యకలాపాల రంగంగా అది మారటమేగాదు, అణ్వాస్త్రాలుపయోగించదగిన నూతన మండలంగా అది మారుతోంది. హిందూ మహాసముద్ర తీర దేశాలకు ఇది చాలా ప్రమాదం తెచ్చిపెట్టడమేగాక, ప్రపంచ ఉద్రిక్తతను కూడా పెంచుతుంది. ఇప్పటికే అమలులో నున్న అణ్వస్త్రమండలాల్ని రద్దు చేయాలని ప్రజలుకోరుతున్నసమయంలో ఆఫ్రికా ఖండాన్ని అణ్వస్త్రరహిత మండలంగా చేయాలని ఐరాసతీర్మానించిన సమయంలో, ఇదంతా జరుగుతూ ఉండడం విశేషం.

అలీన విధానానికి అపాయం

ఇంతేగాక హిందూమహాసముద్రంలో అమెరికా సప్తమనౌకా విన్యాసాలను విస్తరింపజేయడం అనేకరాజ్యాల స్వాతంత్ర్యానికి తీవ్రమైన ప్రమాదం. ఈ ప్రాంతంలో ఎక్కువ దేశాలు అవలంబించుతున్న అలీన విధానానికి ప్రత్యక్ష సవాలు. భారతదేశం. సింహళం. బర్మా ఇండొనేసియా. కాంబోడియా, టాంగనీకా, కెన్యా. సోమాలియా మొదలైన దేశాలకిది సవాలు

అమెరికా ఈ చర్యలను భారతదేశ పత్రికలు నిరసించాయి. భారతదేశ అలీన విధానానికి ఇవి ప్రమాదకరమనీ, దాని జాతీయ ప్రతిష్ఠకు అవమాన కరమనీ పత్రికలు వ్రాశాయి.

దురాక్రమణ సైనిక కూటములలో రెండింటిలో సభ్యత్వంగల పాకిస్తాన్‌లోసైతం అమెరికా సప్తమ నౌకాదళం హిందూమహాసముద్రంపై దాడిచేయడానికి వ్యతిరేకంగా అసమ్మతి ఉద్యమం పెంపొందుతోంది.

కరాచీలో జరిగిన ఒక సభకు అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులు వచ్చారు. యువజన కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. అందులో అమెరికా పథకాలను "పాకిస్తాన్‌కు, ఆఫ్రికా-ఆసియా ప్రపంచానికి ప్రత్యక్ష ప్రమాదం" అని వారు ఖండించారు.

దుష్ట చరిత్ర

ఈ భయాలు యాదృచ్ఛికంగాదు. ఈ సందర్భంలో అమెరికా సప్తమ నౌకా దళ చరిత్రనూ, దాని "పర్య"లనూ జ్ఞప్తికి తెచ్చుకోవడం అవసరం. చైనా అంతర్యుద్ధ కాలంలో జంగ్-కై-షేక్‌కు సైనికసహాయాన్ని అందించింది ఈ సప్తమ నౌకాదళమే, ఇండో-చైనాలో ఫ్రెంచి వలస పెత్తందారులు జరిపిన యుద్ధంలో వారికి ఇది సహాయపడింది వారు ఓడిపోయిన తర్వాత దక్షిణ వియత్నామ్‌లో దేశభక్తులయిన ప్రజాశక్తులపై సైనికచర్యలు ప్రారంభించింది. జపాన్‌లోని ఒక భాగమయిన ఓకినావాను ఆక్రమించుకోడానికి సప్తమ నౌకాదళాన్ని అమెరికా ఉపయోగించుకొంది. ఓకినావాను ఒకసైనికస్థావరంగా తర్వాత మార్చివేసింది. సయాం అఖాతంలోకి సప్తమనౌకాదళంనిరంతరంయాత్రలు చేయడం, లావోస్ వ్యవహారాల్లో అమెరికా సాయుధ జోక్యానికి సహాయ పడింది థాయ్‌లాండ్‌కు పొరుగునవున్న దేశాలలోని జాతీయస్వాతంత్ర్య పోరాటాన్ని అణచి వేయడానికై అమెరికా నాయకులు థాయ్‌లాండ్‌కు పంపబడ్డారు

హిందూమహాసముద్రంలో సప్తమనౌకాదళ కార్యకలాపాలను విస్తరింప చేయడంలో అమెరికా దురాక్రమణోద్దేశాలను అమెరికా పత్రికలు నగ్నంగా ప్రకటించుచున్నాయి, హిందూ మహాసముద్రానికి వెళ్ళిన అమెరికా నౌకలు జాంజిబార్‌కు కొన్ని ఆఫ్రికా దేశాలకు కొద్ది వందల మైళ్ళలోనే వుంటాయని అసోసియేటెడ్ వార్తాసంస్థ ప్రకటించింది జాంజిబార్‌లో అతివాద ధోరణులు కనబడుతున్నాయి. ఇంకా కీన్యాలాంటి ఇతర ఆఫ్రికా దేశాలలో అశాంతి పెరుగుతోంది. మరొకమాటలో చెప్పాలంటే ఆఫ్రికా, ఆసియా దేశాలలో జాతీయ స్వాతంత్ర్య ఉద్యమాన్ని అణచివేయడానికి సప్తమ నౌకా దళాన్ని మాటి మాటికీ సైనిక శక్తిగా ఉపయోగించుకోవాలని చూస్తున్నదని స్పష్టమౌతుంది.

పశ్చిమ జర్మనీకూడా

మరొక ముఖ్య విషయాన్ని కూడా దృష్టిలోకి తీసుకోవాలి హిందూ మహాసముద్రంలోకి అమెరికా తానొక్కడే చొచ్చుకు పోవటంలేదు. ఉత్తర అట్లాంటిక్ కూటమిలో భాగస్వామైన పశ్చిమజర్మన్ సైనికతత్త్వవాదులను కూడా తీసుకువెళ్ళదలచుకొంది. ఆసియా ఆఫ్రికా దేశాలలోని జాతీయ స్వాతంత్ర్య ఉద్యమానికి వ్యతిరేకంగా అమెరికాకు పశ్చిమ జర్మన్ సైనికతత్త్వవాదులు తమ సహాయాన్ని ఇతోధికం చేస్తున్నారు. ఈ సందర్భంలో ఫ్రెంచి వార్తాపత్రిక పారిస్-జోర్ ఇలా వ్రాసింది.

'పశ్చిమ జర్మనీ నౌకలు అమెరికా సప్తమ నౌకాదళంతోపాటు హిందూమహాసముద్రంలోకి వెళ్ళడానికి పశ్చిమ జర్మనీ అధ్యక్షుడు ఎర్హార్డ్‌తో అమెరికా అధ్యక్షుడు జాన్‌సన్ అంగీకరించాడు. ఈ ప్రాంతంలో జర్మనీ - అమెరికాల రాజకీయ, సైనిక వ్యూహ ఐక్యతను ప్రదర్శించడానికి ఈ సంయుక్త విన్యాసాలు ఉద్దేశించబడినాయి."

వి. అగార్కొవ్

అయితే అమెరికా పాలకవర్గాలు ఒక విషయాన్ని జ్ఞాపకం ఉంచుకోవాలి. ఇపుడు కాలం మారిందని, బెదిరింపులు బీరాలు పనికిరావని వారు తెలుసుకోవాలి. సోషలిస్టు మహాశిబిర బలంపైన, శాంతికాముక దేశాలన్నిటి అండపైన ఆధారపడుతూ, ఆఫ్రికా - ఆసియా దేశాల ప్రజలు అమెరికా దురాక్రమణ పథకాలను - హిందూ మహా సముద్ర ప్రాంతంలో వున్న స్వతంత్ర రాజ్యాల విషయంలో దాని కపట పన్నాగాలను కూడా - వమ్ముచేయగలరు.

బల్గేరియాలో శిశు సంక్షేమం

సోషలిస్టు బల్గేరియాలో పనులలోకి పోయే స్త్రీలపిల్లల గురించి ఎక్కువ శ్రద్ధతీసుకొనబడుతుంది, అధిక సంఖ్యలో వున్న శిశు సంక్షేమ కేంద్రాల్లో, బాలోద్యానవనాల్లో సుశిక్షితులైన డాక్టర్లు, నర్సులు, ఉపాధ్యాయులు యీబాలలను శ్రద్ధతోచూస్తూవుంటారు.

మూడు సంవత్సరాల లోపు బాలలు శిశు సంక్షేమ కేంద్రాల్లోనూ. ఏడు సంవత్సరాల లోపు బాలలు బాలోద్యానవనాల్లోనూ వుంచబడుతారు కొన్ని శిశుసంక్షేమ కేంద్రాల్లో బాలలు యెల్లవేళల్లో వుంటారు కొన్ని శిశు సంక్షేమ కేంద్రాల్లో తల్లులు పనిలోకి పోయిన సమయాల్లో వుంటారు. తల్లులు యేలాంటి దిగులు లేకుండా తమ పిల్లలను శిశు సంక్షేమ కేంద్రాల్లో వదలి పనికి వెళ్ళిపోతారు, బల్గేరియాలో సోషలిస్టు విప్లవానికి పూర్వం 289 బాలోద్యాన వనాలు మాత్రమే వుంటుందేవి వాటిలో 13,550 మంది బాలలువుండేవారు. ఇప్పుడు 7,416 బాలోద్యానవనాలు వున్నాయి. వాటిలో 330 000 మంది బాలలు వుంటున్నారు, విప్లవానికి పూర్వం శిశుసంక్షేమ కేంద్రాలు 7 మాత్రమే వుండేవి. వాటిలో 284 మంది బాలలకు వసతి వుండేది. ఇప్పుడు 2,50,000 మంది బాలలకు వసతిగల 717 శిశు సంక్షేమ కేంద్రాలు వున్నాయి

శిశు సంక్షేమ కేంద్రాలల్లో బాలోద్యానవనాల్లో బాలలను వుంచేందుకు చాలా స్వల్పమైన మొత్తాలు తీసుకొనబడుతాయి. వాటి నిర్మాణానికి అయ్యే ఖర్చులను యంత్రాంగాలు సహకార వ్యవసాయ క్షేత్రాలు భరిస్తాయి. బాలలను గురించి యీ విధంగా శ్రద్ధ తీసుకోవడం వల్ల బల్గేరియాలో శిశు మరణాలు 1939 తో పోల్చితే ఇప్పుడు ఐదింతలు తగ్గిపోయాయి.

చెకోస్లోవేకియాలో బాలల సంక్షేమం

మొట్టమొదట 1950 లో 41 దేశాలలో అంతర్జాతీయ బాలల దినోత్సవం జరుపబడింది. తరవాత 1952 ఏప్రిల్‌లో బాలల పరిరక్షణ గురించి జరిగిన అంతర్జాతీయ మహాసభ ప్రతిఏటా జూన్ ఒకటవ తేదీన యీ దినోత్సవం జరగాలని నిర్ణయించింది

ఆ రోజున ప్రపంచ మంతటా తల్లిదండ్రులూ ఉపాధ్యాయులూ, బాలల శ్రేయస్సు నాశించే సమస్త ప్రజలూ బాలలకుఆనందమూ, శాంతియుత ప్రపంచమూ కోరుతారు, ఆరోగ్యవంతమైన జీవితాన్నీ, ఆత్మిక, నైతిక వికాసాన్నీ కోరుతారు.

ఆరోగ్యకరమూ ఆనంద దాయకమూ అయిన బాల్యమూ, విద్యా వికాసాలు, శాంతి స్వేచ్ఛ, ప్రజాస్వామ్య పరిస్థితులలో మాత్రమే సాధ్యమన్నది సుస్పష్టం,

చెకోస్లోవాకియాలో చట్టరీత్యా కుటుంబం సమష్టిగా, అందులోని సభ్యులు ఒకరి కొకరు తోడ్పడుతూ వుండాలి.

పిల్లలను ఉత్తమ పౌరులుగా పెంచి పెద్ద చేయడానికి తల్లిదండ్రులు సమాజానికి బాధ్యత వహిస్తారు.

చట్టరీత్యా తల్లిదండ్రు లుభయులకూ తమ పిల్లలకు విద్యాబుద్ధులు గరపడంలోనూ, వారికి ప్రాతినిధ్యం వహించటంలో, వారి ఆస్తిని కాపాడడంలోనూ సమానమైన హక్కులూ బాధ్యతలు వున్నాయి. బాలల విద్యాభివృద్ధికీ. పోషణకూ తల్లిదండ్రులదే బాధ్యత.

ఉద్యోగులకూ, పెన్షన్ దారులకూ వారిపై ఆధారపడే పిల్లల నిమిత్తమై ప్రభుత్వం అలవెన్సులు (ధనసహాయం) యిస్తుంది పిల్లల సంఖ్యనూ బట్టీ, కుటుంబ పోషకుని ఆదాయాన్నిబట్టీ యీ అలవెన్సు నిర్ణయ మవుతుంది కుటుంబ పోషకునకు పిల్లల సంఖ్యను బట్టి ఆదాయపు పన్నుకూడా తగ్గుతుంది.

పిల్లలుగల కుటుంబాలకు ప్రభుత్వం యింకా అనేక విధాల సాయపడుతూంది. ఉద్యోగాలు చేస్తున్న తల్లులు తమ పిల్లలను అతితక్కువ ఖర్చుతో శిశుపోషణాలయాలలోనూ నర్సరీ పాఠశాలల్లోనూ వుంచవచ్చును. పిల్లల బట్టలు జోళ్ళు అతితక్కువధరలకు లభిస్తాయి పాఠశాలల్లో పిల్లలకు పాఠ్యగ్రంథాలు, నోటుబుక్కులు తదితర సామగ్రి ఉచితంగా లభిస్తాయి

ఆరోగ్యం

1946 లో చెకోస్లోవాకియాలో ఒకటినుండి పద్నాలుగు సంవత్సరాల వయస్సులుగల బాలల మరణాలు ఎక్కువగా వుండేవి-ప్రతి లక్షమంది బాలల్లో 300 మంది చనిపోయారు. 1960 లో ఈ మరణాల సంఖ్య ప్రతి లక్షకూ 62 కు తగ్గిపోయింది.

గడచిన అయిదేళ్లలో బాలల్లో క్షయవ్యాధి సోకిన కేసుల సంఖ్య సగానికి సగం తగ్గిపోయింది. క్షయవ్యాధి ఆస్పత్రులు బాలల ఆరోగ్య కేంద్రాలుగామార్చివేయబడుతున్నాయి ఈ ఆస్పత్రులు కొన్నిటిలో రోగులు లేకపోవటంవల్ల క్షయవ్యాధి చికిత్సను ఎత్తివేసి వేరే చికిత్సలు చేస్తున్నారు

స్కూలు పిల్లలందరికి ప్రత్యేకమైన ఆరోగ్య రక్షణ ఏర్పాట్లున్నాయి. ఈ ప్రత్యేక ఆరోగ్య శాఖ వ్యాధినిరోధానికి ఎక్కువగా శ్రద్ధ వహిస్తుంది అంటువ్యాధులు చాలవరకు నిర్మూలించబడినప్పటికీ, ఇంకా కొన్ని రకాలవ్యాధుల నుండి బాలలను రక్షించడానికి చాల కృషి జరుగుతూంది ప్రమాదాలనుండి బాలలను కాపాడడానికి చాల ప్రయత్నం చేస్తున్నారు.

బాలలకు ప్రత్యేకమైన రేడియో, టెలివిజన్ కార్యక్రమాలతోబాటు దేశంలో అనేక బాలల నాటకశాలలు, సినిమా మందిరాలు వున్నాయి

1960 లో దేశంలో బాలలకోసమై 23 పత్రికలు మొత్తం 43,552,000 ప్రతులలో వెలువడ్డాయి.

1945 కూ 1962 కూ మధ్య చెకోస్లోవాకియాలో బాలల కోసమై 18 కథా చిత్రాలు, 130 తక్కువ నిడివి చిత్రాలు నిర్మించబడ్డాయి

పిల్లల చిత్రాలు

1962 లో విడుదలయిన "అనీ పాఠశాలకు వెళ్తుంది," "పాత్రాము కథ" "సంచార సినిమా' "కుర్రవాడూ, రూబుల్" "కుక్కపిల్ల, సూర్యుడు" "బాల్య' అనే చిత్రాలు చాల జయప్రదమయాయి. వీటిలో చివరి నాలుగుచిత్రాలు కేన్స్‌లో జరిగిన బాలల చలనచిత్రాల అంతర్జాతీయ ఉత్సవంలో బహుమతులు పొందేయి

వాక్లావ్ పొకోర్నీ

ప్రాగ్‌లోని ప్రభుత్వ బాలసాహిత్య ప్రచురణాలయం బాలలకోసం పుస్తకాలు ప్రచురిస్తుంది. ఈ సంవత్సరం ప్రచురించబడుతున్న 242 పుస్తకాలలో 110 కొత్తపుస్తకాలు. మిగిలినవి పాతవే తిరిగి ముద్రించబడుతున్నాయి. బాలలకు పద్యకావ్యాలు కూడా రచించబడుతున్నాయి. 41 మంది ఆధునిక కవులు రచించిన "ప్రయాణానికి ఆహ్వానం"అనే పద్యసంపుటి అప్పుడే 15 వేల ప్రతులు అమ్ముడయాయి

1962 లో దాదాపు 6 లక్షల మంది బాలబాలికలు తమ వేసవి సెలవులను బాలసంఘ శిబిరాలలో గడిపేరు

ఉల్లిపొరకాగితాలు తయారుచేసే పెద్ద యంత్రం

ఉల్లిపొరకాగితాల చుట్టలు తయారు చేయడానికి 15 అడుగుల వెడల్పు 120 అడుగుల పొడుగుగల ఒక పెద్ద యంత్రాన్ని డస్సెల్‌డార్ఫ్‌నగరంలో తయారు చేశారు. దీని బరువు మూడువందల ఏభయి టన్నులు, ఇది రోజుకి 70 టన్నుల ఉల్లిపొరకాగితం, అంటే అర లక్షల ఏభయి వేల చుట్టలు తయారు చేస్తుంది. కొద్ది మార్పులతో దీనితో 105 టన్నుల ఉత్పత్తి చేయవచ్చు.

తెలుసుకోతగ్గ విశేషాలు

ఆఫ్రికావారికి హెచ్చరికగా అమెరికాలో సాగిన ఘోర 'యుద్ధాలు'

అమెరికాలోని మొజేవ్, నెవాడా, అరిజోనా ఎడారుల్లో ఇటీవల ఉన్నట్టుండి బాంబుల వర్షం కురిసింది, విమాన యుద్ధాలు చెలరేగాయి, ఫిరంగులు పెళపెళ గర్జించాయి. టాంకు దళాలు ఒకదానితో ఒకటి తలపడ్డాయి, సైనిక సమూహాలు భయంకర 'యుద్ధాలు' సాగించాయి. మొత్తం లక్షకుపైగా సైనికులు, 780 యుద్ధ విమానాలు, ఏడువేలకుపైగా సాయుధ శకటాలు, ఒక వెయ్యికిపైగా టాంకులు వీటిల్లో పాల్గొన్నాయి.

33 నిండు ప్రాణాలను బలిగొన్నాయి వీరిలో ఆరుగురు యుద్ధ విమానాలు కూలడంలో మరణించారు, అయిదుగురు లారీ ప్రమాదాల్లోనూ, ఇద్దరు టాంకుల కింద నలిగి, అయిదుగురు నీళ్ళలో మునిగిపోయి, తక్కిన వారు తుపాకి దెబ్బలు తగిలి చనిపోయారు.

అయితే ఇవి నిజమయిన యుద్ధాలుకావు, ఇంత భారీఎత్తున సాయుధబలాలు పాల్గొన్నా, ఇంతమంది దుర్మరణం పాలయినా ఇవి సైనిక విన్యాసాలు మాత్రమే. వాటిని నిర్వహించిన కోరిక ప్రకారం 'అద్భుతమయిన యుద్ధాలలాగే జరిగిన విన్యాసాలు', ఇందుకు ఆరు కోట్ల డాలర్లకుపైగా ఖర్చయింది. నిలువునా నిండు ప్రాణాలను బలిగొంటూ సాగిన ఈ విన్యాసాలపట్ల, వాటిని నిర్వహించిన జనరల్ పాల్ అడమ్స్ ఎంతో సంతోషాన్ని, సంతృప్తిని వ్యక్తం చేశాడు. ఆ ఆనంద పారవశ్యం చేత కాబోలు. పత్రికా విలేకరులతో మాట్లాడుతూ, ఈ విన్యాసాల అసలు ఉద్దేశాన్నికూడా బయట పెట్టారు.

"ఆఫ్రికాలోనూ, పశ్చిమాసియాలోనూ ఎడారి ప్రాంతాలు బోలెడన్ని ఉన్నాయి. అక్కడ ఎప్పుడయినా యుద్ధాలకు వెళ్ళవలసివస్తే అక్కడ ఎలా వ్యవహరించాలో, ఇలాంటి విన్యాసాలవల్ల ముందుగానే బాగా అలవాటయి ఉంటుంది" అని ఆయన అన్నారు.

ఇటువంటి ఘనకార్యానికి ముందుగానే సన్నద్ధమవుతూన్న ఆయనను ప్రశంసిస్తూ "ఆయన అపరఫీల్డ్ మార్షల్ రోమెల్" అని "టైమ్" అనే ప్రముఖ అమెరికా పత్రిక అన్నది. ఫీల్డ్‌మార్షల్ రోమెల్ అంటే ఎవరో తెలియకకాదు బాగా తెలిసే. నిజమైన ప్రశంసగా ఉద్దేశించే. ఆ పత్రిక, అతనితో ఈయనను సరిపోల్చింది. రెండవ ప్రపంచయుద్ధంలో ఉత్తరాఫ్రికాపై దురాక్రమణను సాగించిన నాజీ కిరాతక మూకలకు ఆధిపత్యం వహించిన వాడు ఫీల్డుమార్షల్ రోమెల్.

నాజీ కిరాతక సైనికాధికారులతో తమ వారిని సరిపోల్చుకుని, అమెరికా పత్రికలు సంతోషిస్తే సంతోషించవచ్చుగాక. అది వాటి సొంత విషయం.

కాని పైన ఉదహరించిన సంఘటనలో ప్రపంచానికి, ముఖ్యంగా ఆఫ్రికా. పశ్చిమాసియా దేశాలకు ఒక హెచ్చరిక ఇమిడి ఉంది ఈ రెండు రంగాల్లోనూ తమ జాతీయ స్వాతంత్ర్యాన్ని పటిష్ఠం చేసుకొంటూన్న దేశాలపై అదను చూసుకొని దెబ్బ తీయడానికి అమెరికా యుద్ధోన్మాదులు సన్నద్ధ మవుతున్నారనేది, జనరల్ పాల్ అడమ్స్ మాటలనుబట్టి స్పష్టమవుతూంది ఈ విషయంలో వీరు నాజీ దురాక్రమణ దారులను ఆదర్శంగా తీసుకున్నారనేది "టైమ్" పత్రిక వ్యాఖ్యను బట్టి స్పష్టమవుతూంది.

మాజీ నాజీ సైనికాధికారులకే కీలక స్థానాలు

పైన ఉదహరించిన సంఘటనకు అనుగుణమయినదే మరొక విషయం.

పశ్చిమ జర్మనీ సైన్యానికి చెందిన మేజర్ జనరల్ ఎర్నెస్టు ఫెర్బెర్ ఈ నెల ఒకటవ తేదీనుండి వాషింగ్టన్‌లో, అట్లాంటిక్ సైనిక కూటమి స్థాయీ సంఘ ప్రణాళికా సిబ్బంది అధిపతిగా పదవీస్వీకారం చేశాడు

ఇటలీ సైనికాధికారులు ఎందరో ఈ పదవి కోసం తహతహలాడారు, కాని, అట్లాంటిక్ కూటమి కార్యవర్గం చాలా ముఖ్యమయిన ఈ పదవిని ఈ పశ్చిమ జర్మనీ సైనికాధికారికే ఇచ్చింది. ఇటలీ వారికి కావాలంటే అతని కింద సహాయకాధికారిగా ఉద్యోగం ఇస్తానన్నది అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర అట్లాంటిక్ కూటమి సభ్య దేశాల తరపున చెరొక సైనికాధికారి కూడా ఆయనకింద ఉంటారు.

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఈ ఫెర్బర్ ఒక ప్రముఖ నాజీ సైనికాధికారి. 1943 లో ఆయన నాజీ సర్వసైన్యాధికార వర్గ సభ్యుడయాడు కూడా అందులోనూ, నాజీ ప్రధాన గూఢచారి అయిన రీన్‌హార్డ్ గెహ్లెన్ ముఖ్య సహాయకులలో ఒకడయ్యాడు నాజీ జర్మనీ పూర్తిగా లొంగిపోయినంత వరకూ కూడా అతను ఆ పదవిలోనే ఉన్నాడు

ఆ గెహ్లెన్ ఇప్పుడు పశ్చిమజర్మనీ గూఢచారిశాఖ అధిపతిగా ఉన్నాడు. అతని మాజీ సహాయకాధికారి ఫెర్బర్ వాషింగ్టన్‌లో అట్లాంటిక్ కూటమి ముఖ్య ప్రణాళికా సిబ్బంది అధిపతిగా పీఠం ఏర్పరచు కొన్నాడు.

అట్లాంటిక్ కూటమి నిర్మాణంలో ఈ స్థాయీ సంఘానికి చాల ప్రధానస్థానం ఉంది. అంతవరకు ఇందులో అమెరికా, బ్రిటిష్, ఫ్రెంచి ప్రతినిధులు మాత్రమే ఉండేవారు ఈ స్థాయీ సంఘంలో సభ్యత్వానికై పశ్చిమ జర్మనీ ఇదివరలో ఎంతో ప్రయత్నించింది, అట్లాంటిక్ కూటమి సైనిక ప్రతినిధివర్గ కమిటీ అధ్యక్షుడుగా ఉండి ఈమధ్యనే రిటైర్ అయిన పశ్చిమ జర్మనీ సైనికాధికారి అడాల్ఫ్ హ్యూసింగరు కూడ యిందుకోసం యెంతో ప్రయత్నించారు. కాని లాభంలేకపోయింది

కాని యిపుడు ఫెర్బర్‌కి ఈ పదవి అప్పగించడంతో పశ్చిమజర్మనీకి స్థాయీసంఘంలో సభ్యత్వం లభించింది.

నాజీనరహంతకులను ఆదర్శంగాతీసుకోవడమే కాదు, ఆకిరాతకులతో ఇప్పటికి మిగిలివున్న వారికి సైనికంగా కీలక స్థానాలివ్వడానికి అమెరికా యుద్ధోన్మాదవర్గాలు యెలా సిద్ధపడుతున్నాయో దీనినిబట్టి స్పష్టం కాగలదు,

అమెరికా పత్రికలు బయటపెట్టిన నగ్న సత్యం

కిందటి మాసంలో అట్లాంటిక్ మహా సముద్రంలోని బహామాదీవుల ప్రాంతంలో ఒక సంఘటన జరిగింది. ఆదీవులు బ్రిటిషవలసదీవులు ఆ దీవులకు చెందిన సముద్ర ప్రాంతంలో పయనిస్తున్న కొంతమంది క్యూబా విద్రోహులను బ్రిటిష్ డిస్ట్రాయర్‌నౌక 'డికోయ్' అడ్డగించి, బహామా దీవుల్లోని. అంగ్విల్లా దీవికి ఖైదీలుగా అప్పగించింది.

క్యూబాలో దిగి, అక్కడ సాయుధ చర్యలు సాగించేందుకు వెళ్తున్నట్లు ఆ విద్రోహ ముఠా నాయకుడు మాన్యుయెల్ రే అన్నాడు అమెరికా పత్రికలకు సంబంధించిన ఇద్దరు ఫోటోగ్రాఫర్లుకూడా వారివెంట ఉన్నారు "లైఫ్" అనే ప్రముఖ అమెరికా పత్రికకు చెందిన 'ఆండ్రూజార్జి ఈ ఇద్దరిలో ఒకడు. బహుశా క్యూబా "విముక్తి పోరాటం" గురించిన 'అద్భుతమైన" ఫోటోలు తన పత్రికకు పంపి బాగా జేబులు నింపుకోవడం కోసం అతను బయలుదేరి ఉంటాడు

కాని. అదేమీ జరగలేదు ఖైదీలుగా వారి నందరినీ బహామా దీవుల రాజధాని నాసౌ నగరం చేర్చారు. వారి అసలు ఉద్దేశం తెలిసినా అక్కడి బ్రిటిష్ మాజిస్ట్రేటు వారికి "అక్రమముగా ఆయుధాలుకలిగి ఉన్నందుకు" మాత్రం చెరొక పద్నాలుగు డాలర్ల జరిమానా విధించాడు అమెరికా కేంద్ర గూఢచారిశాఖ అధికారులు వచ్చి, ఆ జరిమానాలు చెల్లించి, వారిని అమెరికాకు వెంటబెట్టుకు తీసుకుపోయారు.

ఈ ఉదంతంలో అమెరికా కేంద్ర గూఢచారి శాఖ నిర్వహించిన పాత్రను 'టైమ్' పత్రిక బయట పెట్టింది. (ఈ పత్రికకూ, "లైఫ్" పత్రికకూ యజమానులు ఒక్కరే) అంగ్విలా ప్రాంతంలో ఈ విద్రోహ మూకను ఒక అమెరికా నౌక దించిందని ఆ పత్రిక తెలిపింది. క్యూబాపై దెబ్బ తీయడానికి అందుబాటులో ఉండేందుకు అనువైన స్థలాల్లో విద్రోహులను దింపడంకోసం అమెరికా కేంద్ర గూఢచారి శాఖ ఉపయోగించుకొనే నౌక ఇది అనికూడా ఆ పత్రిక వెల్లడిచేసింది.

క్యూబా విద్రోహులను ఇలా ఆయా ప్రాంతాలకు రవాణా చేసే బాధ్యతనే కాకుండా, బహామాలో లాగా ఎదైనా ఇబ్బందిలో ఇరుక్కుంటే. వారిని విడిపించుకువచ్చే బాధ్యతను కూడా అమెరికా కేంద్ర గూఢచారిశాఖ ఎలా నిర్వహిస్తూవుందో 'టైమ్స్' పత్రిక తెలిపిన వివరాలను బట్టిస్పష్టమవుతూంది.

ఇటలీలో సమ్మె వెల్లువ

ఇటలీలో జీవన పరిస్థితులు అంతకంతకు దుర్భరమవుతున్నాయి అందులోనూ ముఖ్యంగా శ్రామిక ప్రజల పరిస్థితి మరింత శోచనీయంగా పరిణమిస్తోంది. జీవన వ్యయానికి తగినట్లుగా వేతనాలు ఉండడంలేదు

ఈ కారణంచేత, వేతనాలు, తదితర విషయాలను గురించి ఉమ్మడిగా యజమానులతో ఒప్పందం కుదుర్చుకొనేందుకై దేశంలో ఇప్పుడే సమ్మె పోరాటాలు వెల్లువగా సాగుతున్నాయి. కిందటి మాసం వ్యవసాయ కార్మికులూ, కౌలుదార్లు కలసి మొత్తం ఇరవై లక్షలమందికిపైగా 24 గంటలసేపు సమ్మె చేశారు. దేశమంతటికీ వర్తించే ఉమ్మడి ఒప్పందానికి భూస్వాముల సమాఖ్య అంగీకరించాలనేది వీరి డిమాండే

ఈ విధంగా యజమానులతో ఉమ్మడి ఒప్పందాలను డిమాండుచేస్తూ-చౌళి కార్మికులు 4½ లక్షలమంది. భవన నిర్మాణ కార్మికులు 80 వేలమందికూడా సమ్మె చేశారు.

మునిసిపల్ కార్మికులూ, ప్రజావసరశాఖల కార్మికులు అయిదులక్షలమంది 48 గంటలసేపు సమ్మెచేశారు.

అమెరికా మార్కు ప్రజాస్వామ్యం

సిసలయిన ప్రజాస్వామ్యానికి నిలయమని పెట్టుబడిదారీవర్గాలు తెగ ప్రచారంచేసే అమెరికాలో నిరుద్యోగంమాట అటుంచండి, నిరక్షరాస్యత ఎంత తీవ్రంగా ఉందో బయట పడింది. ఒక కోటి పది లక్షల మందికి చదవడమూ, రాయడమూ నేటికి తెలియదని, నిరక్షరాస్యతా నిర్మూలనకై కృషి చేస్తూన్నఒకఅమెరికా పత్రిక ప్రకటించింది.

ఇక ఆదేశం రాజధాని నగరంలో నేరాల సంఖ్య విపరీతంగా పెరగడం అక్కడి అధికారవర్గాలకే ఆందోళనకరంగా పరిణమిస్తున్నదట. ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో ఈ నేరాల విషయంలో కొత్త రికార్డులు ఏర్పడ్డాయని అమెరికా పత్రికలు వెల్లడి చేశాయి. 1963 ఏప్రిల్‌లో కన్నా ఈ ఏప్రిల్ మాసంలో మోటారుకార్ల దొంగతనాలు నూటికి 108 వంతులూ, దారి దోపిడ్లు 63 వంతులూ, మానభంగాలు 31 వంతులూ ఇళ్లకుకన్నం వేయడం 52 వంతులూ పెరిగాయి గడచిన ఏడాది కాలంలో పెద్ద నేరాలు మొత్తంమీద 30,2 శాతం పెరిగాయి వాషింగ్టన్‌లో శాంతిభద్రతలను కాపాడేందుకు అమెరికా కాంగ్రెస్ గట్టి చర్యలు తీసుకోవాలని ప్రజాందోళన చాలకాలంగా తీవ్రంగా సాగుతూంది

చివరకు ఈ ఆందోళనను మన్నించింది అది కాదు అదనపు పోలీసులనూ, పోలీసులు ఉపయోగించే కుక్కలను వాషింగ్టన్‌లో నియోగించారు

రాజధానీనగరంలోనే ఇలావుంటే అధ్యక్షులు కెన్నెడీ అంతటివానిని వట్టపగలు నడిబజారులో కాల్చిచంపగలిగిన డల్లాస్‌నగరంలాంటి చోట్లా, జాత్యహంకారుల స్వేచ్ఛావిహారాలకు ఆటపట్టయిన టెక్సాస్ రాష్ట్రంలాంటి చోట్ల నేరాల విషయం ఇంకెంత దారుణంగా ఉంటుందో ఊహించుకోవచ్చు నీగ్రోల పౌర హక్కులకై ఆందోళన చేస్తూన్న ఇద్దరు నీగ్రో యువకులనూ ఒక శ్వేతజాతి యువకుని, జాత్యహంకారులు వాషింగ్టన్ నగరంలో జాడయినా తెలియకుండా మాయంచేయగల్గారంటే, అమెరికా మార్కు ప్రజాస్వామ్యం బండారం ఏపాటిదో అర్థమవుతుంది.

బ్రిటిష్‌గయానాలో వలసపాలకుల దుష్టపన్నాగాలు

బ్రిటిష్ గయానాలోని కార్మికుల ఉత్పత్తి చేసిన పంచదారలో వారి నికృష్ట పరిస్థితికూడా లీనమై ఉంటే, దక్షిణ ఆఫ్రికాలోని వెర్వోర్డ్ కన్నా కూడ అది ఎక్కువ చేదుగా ఉండేది కాని బ్రిటిష్ వలసప్రభువులు దీనినేమీ లెక్కచేయరు వారికికావలసిందల్లా మంచులాతెల్లగా ఉన్న తియ్యని పంచదారే దానిని వారు ఇతర దేశాలలో అమ్ముకొంటారు.

అట్లాంటిక్ సముద్రతీరానలాటిన్ అమెరికాలోని ఈ చిన్న దేశాన్ని బ్రిటిష్ వలస పాలకులు జలగల్లా మూడు వందల ఏండ్లుగా రక్తాన్ని పీలుస్తున్నారు. అక్కడి నుండి వెళ్ళిపోడానికివారికిష్టంలేదు, కారణం అక్కడకూలి చౌక లాభాలు అధికం. బ్రిటిష్ గయానాలో పంచదార అమ్మకంధర, ప్రపంచ ధరలలో రెండు రెట్లు తక్కువ. అందుచేతనే గయానా తీరంపట్ల బ్రిటిష్ వలసపాలకులకింత 'మక్కువ ' బ్రిటిష్ వలసలో ఇపుడు జరుగుతున్న విచిత్ర ఘటనలకు మూలం ఇందులోనే వుంది.

విభజించి పాలించే సూత్రం

గయానాపై తమ పెత్తనాన్ని సుస్థిరం చేసుకోడానికి, కనీసం అక్కడ తమ పెత్తనాన్ని కొనసాగించడానికి, వారు "విభజించి పరిపాలించే" నీతిని అవలంబించుతున్నారు ఈ లక్ష్యంకోసం ఎంతకైనా వారు సిద్ధపడతారు వలస పెత్తదార్ల తక్షణలక్ష్యం చెడీ జగన్ ప్రభుత్వాన్ని కూలదోయడం. చెడీ జగన్ ప్రభుత్వం, బ్రిటిష్ గయానా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకై సాహసోపేతంగా పోరాడుతున్న ప్రజలను అచంచలంగా బలపరచుతూంది చెడీ జగన్ పీపుల్స్ ప్రోగ్రెసివ్ పార్టీకి నాయకుడు, జగన్. ఆయన పార్టీ బ్రిటిష్ గయానాకు నిజమైన స్వాతంత్ర్యం ఇవ్వాలనీ,స్వతంత్రరాజ్యాంగం దానికిగ్యారంటీ చేయాలనీ కోరుతున్నారు. బ్రిటిష్ గయానా స్వాతంత్ర్యం లభించిన మొదటిరోజు, ఆ దేశంలో బ్రిటిష్‌పాలనకు స్వస్తిచెప్పే ఆఖరి రోజని వలసరాజ్య పరిపాలకులకు తెలుసు.

జగన్ ప్రభుత్వాన్ని బహిరంగంగా కూలదోయడానికి బ్రిటిషు ప్రభుత్వానికి ధైర్యంలేదు అందుచేత అవకాశం కోసం బ్రిటిష్ వలస పాలకులు ఎదురుచూస్తూ కూచున్నారు. ఈ అవకాశం రానే వచ్చింది. మూడు నెలలక్రితం చెరుకుతోటల కార్మికులు, బ్రిటిష్ గయానాలో శుద్ధికర్మాగారాల కార్మికులు సార్వత్రిక సమ్మె ప్రారంభించారు. సమ్మెచేసే కార్మికులుకోరే దానిలో అసాధారణమేమీలేదు, వలసదేశంలోసైతం ఈకోర్కె సామాన్యమైనదే. బ్రిటిష్, అమెరికా పంచదార వర్తకులకు సేవచేస్తున్న పాత యూనియన్‌స్థానే కొత్తయూనియన్‌ను గుర్తించవలసిందిగా వీరు కోరారు.

లండన్‌లో దౌత్యఉద్యోగుల సహాయంతో గయానాలోని యజమానులు దేశపరిస్థితిలో చిచ్చు పెట్టడానికి పథకం వేశారు. అందుకు ఎట్టి పద్ధతికైనా ఒడిగట్టారు హత్యలు, గృహ దహనాలు, లంచం, బెదరింపులు, రెచ్చగొట్టడం మొదలైన పద్ధతులన్నీ అవలంబించారు బ్రిటిష్ గయానాలోని భారత సంతతి ప్రజలను తూర్పు ఇండియన్లంటారు. వీరికి నీగ్రోలకూ, కృత్రిమమైన శత్రుత్వం కల్పించడంలో ఈఅభివృద్ధి నిరోధకులు విపరీతమైన శ్రద్ధవహించుతారు. ఈ రెండు జాతులవారే బ్రిటిష్ గయానాలో నివసించే వారిలో ప్రధానమైన జాతులు.

వలసపాలకుల డబ్బు తింటున్న ఏజెంట్లు రెచ్చగొట్టిన ఫలితంగా అప్పు డప్పుడు ఘర్షణలు తలయెత్తుతూ వుంటాయి ఇవి తప్పని సరిగా హత్యలు. గొంతు కోతలతో అంతమౌతుంటాయి. మూడునెలల 'శాంతి" కాలంలో పోలీసుల లెక్కలప్రకారం 27 మంది హత్య గావించబడ్డారు 363 మంది గాయపడ్డారు దెబ్బలు గొట్టిన ఘటనలు 757 ఉన్నాయి. 128 ఇండ్లు దహన మయ్యాయి 525 ఇండ్లు నష్ట మయ్యాయి.

వలసాధిపతుల కుట్ర

గయానా ప్రజలశత్రువులు సంతోషంతో విరగబడుతున్నారు, వలసాధిపతులు పన్నిన ఈ దుష్టపన్నాగం దేశంలో పరిస్థితులను చక్కపెట్టడంలో జగన్ ప్రభుత్వం "అసమర్థత" చూపించిందని రుజువు చేయడమే. ఆ విధంగా చెరుకుతోట, పంచదార పరిశ్రమల కార్మికుల సార్వత్రిక సమ్మెను అణచివేయడంలో అది విఫలమైందని వారి ఆరోపణ ఈ సమ్మెను వివిధ జాతుల మధ్య సంఘర్షణగా వారు చిత్రిస్తున్నారు. పరిస్థితులు ఈ విధంగా చెడ్డగా ఉన్నాయి గాబట్టి, గయానాలో జాతి యుద్ధాన్ని తప్పించడానికి బ్రిటన్ జోక్యం కలుగచేసుకోవలసిన అవసరం వుందని బ్రిటిష్ వలస శాఖామంత్రి శాండీస్ ప్రకటించాడు

వి. కారీమోవ్

వలసాధిపతులు, క్రైస్తవ మత ప్రచారకులు కాలహరణం ఏమీచేయలేదు. మే 22వ తేదీన గయానాలో అత్యవసర పరిస్థితిని బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించింది. మూడు రోజుల తర్వాత బ్రిటిష్ సైన్యాలు ఆ ప్రాంతాలకు వెళ్లాయి "కల్లోలిత ప్రాంతాల"కు సైనిక విన్యాసాల నెపంతో ముందుగానే ఆ సైన్యాలక్కడికి వచ్చాయి. అలా వచ్చిన ఈ సేనలు చెరకుతోటల ప్రాంతంలో "శాంతి భద్రత" లను నెలకొల్పే బాధ్యతను వహించాయి. గవర్నరుకు అసాధారణాధికారాలివ్వబడ్డాయి, మీటింగులన్నీ ఊరేగింపులన్నీ నిషేధించడానికీ, వారెంటు లేకుండా ప్రజల్ని అరెస్టు చేయడానికి గవర్నరుకు హక్కు ఇవ్వబడింది.

బ్రిటిష్ గవర్నరు ఈ నూతనాధికారాలను ఉపయోగించుకొని, జగన్ సన్నిహితుల ఇండ్లను సోదాచేశారు జగన్ ఉపప్రధాని బెన్, రవాణామంత్రి విల్సన్ ఇండ్లను సోదా చేశారు.

ఎంత నిర్బంధ విధానం కొనసాగినా, గయానా అభ్యుదయ కాముక ప్రజలు పోరాడుతూనే వున్నారు. వ్యవసాయ కార్మికుల సంఘ నాయకుడైన హరిలాల్ సమ్మెదారుల తరపున ఒక ప్రకటన చేస్తూ, స్త్రీ పురుష కార్మికులెవరూ కూడా లొంగిపోరని"అని అన్నారు.

పీపుల్స్ ప్రోగ్రెసివ్ పార్టీ, తమ ప్రజల స్వాతంత్ర్యానికై వీరోచితంగా పోరాడే దాని నాయకుడు చెడిజగన్, ఈ పోరాటంలో నాయకత్వం వహించుచున్నారు

ఇటీవల ఒక సభలో ప్రసంగించుచూ జగన్ "కార్మికవర్గం ఐక్యంగా ఉంటే గయానా ఆర్థిక సంపదపై తమ పెత్తనం పోతుందని భయపడుతున్న వలస పాలకులు మనలో మనకు చీలికలు కల్గించ ప్రయత్నించుతున్నారు' అని అన్నారు. బ్రిటిష్ గయానా కార్మిక ప్రజలు ఐక్యతకై పోరాడుతున్నారు. ఐక్యతలోనే విజయమూ, స్వాతంత్ర్యమూనను సాధించగలమని వారికి తెలుసు

విటమినుల ప్రాధాన్యం

డచ్ శాస్త్రజ్ఞుని కృషి

ఇండొనేషియా రాజధాని నగరం జకార్తాశివార్లలోని ఒక మెడికల్ లాబొరేటరీలో వుంచిన కోళ్ళలో 1887 జూలై 10 న వ్యాపించిన ఒక వ్యాధి విటమినుల ప్రాధాన్యతను గురించి శాస్త్రజ్ఞులు తెలుసుకొనడానికి అవకాశమిచ్చింది. డచ్‌శాస్త్రజ్ఞుడు క్రిస్టియన్ ఇజిక్‌మన్ ఆయన బ్రిటిష్ సహచరుడు సర్. ఫ్రెడరిక్ గౌలాండ్ హాప్‌కిన్స్ కలిసి మానవ సంక్షేమానికి మహత్తరమైన ప్రసాదాన్ని బహూకరించారు 1929లో నోబెల్ బహుమతి ప్రదానంతో వీరి కృషికి మన్నన లభించింది ఆరోగ్య రంగంలో విటమినుల ప్రాధాన్యత ప్రచారంలోకి వచ్చింది.

19 వ శతాబ్దం రెండవ అర్ధభాగంలో ఇండొనీషియాలోను, ఆగ్నేయ ఆసియాలోను వంజ వ్యాధి. పండ్లవెంట నెత్తురు పడడం, శరీరంపై చుక్కలు పడే వ్యాధి ప్రబలింది. వేలమంది చనిపోయారు, ఇండొనీషియాలోని డచ్ అధికారులు ఆందోళనచెంది, ఈ వ్యాధి కారణాలను దర్యాప్తుకి నిపుణుల బృందాన్ని పంపారు. అందులో 28 సంవత్సరాల వయస్సు గల క్రిస్టియన్ ఇజిక్‌మన్ కూడా వున్నాడు. వంజవ్యాధి కారణాలు తెలుసుకొనడానికి తన జీవితాన్ని ధారపోయాలనే సంకల్ప బలంతో కృషి చేశాడు ఇందులో అదృష్టం కూడా ఆయనకు కలిసివచ్చింది.

పరిశోధనలకోసం శాస్త్రజ్ఞులందరివలెనే ఇజిక్‌మన్ కూడా కోళ్ళను పెంచాడు భోజనాల బల్లదగ్గర మిగిలే ఎంగిలి మెతుకులు ఈ కోళ్ళకు వేయడానికి అంగీకరించాడు. ఈ ఉప్పుడు బియ్యం మెతుకులు నెలరోజులు వీటికి వేయడంతో కోళ్ళకు ఒకరకమయిన వ్యాధి వచ్చింది.

క్రమంగా క్షీణించి అవి మరణించడం ప్రారంభించాయి, అంతగా హఠాత్తుగా ఒక అధికారి ఇలా యెంగిలిమెతుకులు వేయరాదన్న నిబంధన అమలు పరచాడు. ముతక బియ్యం మెతుకులు సప్లయికి అర్డరు చేశాడు, దానితో కోళ్ల ఆరోగ్యంలో పెద్ద మార్పు వచ్చింది. దీనిని ఆధారంగా తీసుకొని ఇజిక్‌మన్ ఒక నిర్ణయానికి వచ్చాడు. ఉప్పుడు బియ్యంవల్ల అనారోగ్యం. తవుడుపోని ముతక బియ్యంవల్ల ఆరోగ్యంకలదని తెలుసుకున్నాడు. తవుడులో బలవర్ధకమైన ఆహారం, వంజ వ్యాధి నివారణమార్గం కలదని నిర్ధారణ చేశాడు. ఇది ఆహార రంగంలో విప్లవాత్మకమైన పరిణామానికి దారితీసింది. మిల్లుబియ్యం కంటె దంపుడుబియ్యం శ్రేయస్కరమనే సూత్రాన్ని అమలులోకి తెచ్చాయి.

1923లో ఇజిక్‌మన్ సహచరులు జాన్సన్, రోనాక్ అనేవారు తవుడునుంచి ఒకరకం పొడరు తీశారు, ఇదే విటమిను "బి", ఈ విధంగా ఇజిక్‌మన్, ఆయన తోడి పరిశోధకులు కలిసి విటమినుల చరిత్రలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభింపజేశారు.

వీరి సిద్ధాంతాన్ని కొంతకాలం ఎవరూ విశ్వసించలేదు ఆ తర్వాత అందరూ అంగీకరించారు. సర్ ఫ్రెడరిక్ గోలాండ్‌హాప్కిన్స్ అనే ఆయన కూడా విటమినుల ద్వారా పోషకత్వం అనే సిద్ధాంతాన్ని కనుగొన్నాడు. ఆరోగ్యానికి ఆహారానికిగల సంబంధాన్ని మూలంలో ఇజిక్‌మన్ కృషివల్ల, వైద్య రంగంలో నూతన శకం ఆరంభమైంది. పెక్కువేలమంది ప్రాణాలను కాపాడింది. చివరకు 1917 నాటి జకార్తాలోని వంజ వ్యాధి నివారణ ఆసుపత్రిని రోగులులేక పూర్తిగా మూసివేయవలసి వచ్చింది.

శ్రీ ఇజిక్‌మన్ కృషి ఫలితంగా నెదర్లాండుకు 30 సంవత్సరాల వ్యవధిలో ఆరవ నోబెల్ బహుమతి కూడా వచ్చింది. ఇజికమన్, ఆయన సహచరుడు శ్రీ హాప్‌కిన్ మరణించినా వారి కృషి, భవిష్యత్తులో కూడా వారి స్మారకచిహ్నంగా ప్రపంచ ప్రజల మధ్య శాశ్వతంగా నిలిచిపోయింది.

అతి పురాతనమైన హోటల్

జర్మనీలోని "రోవెన్" భోజన విశ్రాంతి గృహం ఆదేశంలోని అతి పురాతమైన హోటలని దాని అధికార్లు నిరూపించారు. దీనిని 1231 లో నిర్మించారు గడచిన 700 ఏళ్ళలోనూ, యిది అనేక తుఫానులకి గురిఅయినా చెక్కు చెదరకుండా వుంది.

తెనాలిలోని అన్ని పోస్టాఫీసుల్లో స్టాంపుల కొరత చాలా తీవ్రంగా వుంది. తెనాలి రామలింగేశ్వరపేట పోస్టాఫీసులో 1, 2, 3, 5, 6 10 నయాపైసల స్టాంపులు మచ్చుకైనా లేవు. ప్రజలు నానా బాధలు పడుతున్నారు.

చెకోస్లోవాకియాలో విశ్వవిద్యాలయాలు

1945 తరువాత చెకోస్లోవాక్ విశ్వవిద్యాలయాలు చాలా అభివృద్ధి అయాయి. వ్యవసాయంలోనూ, పరిశ్రమలలోనూ పని చేయడానికి సుశిక్షితులైన ప్రవీణులు అవసరమయారు అందుకని చెకోస్లొవాక్ శాస్త్ర విజ్ఞాన పరిషత్తూ, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ శాఖలు అనేక శాస్త్ర విజ్ఞాన పరిశోధనా సంస్థలను నెలకొల్పాయి.

1945 తరువాత కొత్త ప్రభుత్వం అనేక విశ్వవిద్యాలయాలనూ, కాలేజీలనూ తెరచింది, 1938 లో 9 విశ్వవిద్యాలయాలలోగల 42 విద్యాపీఠాలలో 19000 మంది చదువుకునే వారు, అలాంటిది1956 వచ్చేసరికి51000మంది చదువుతున్నారు. 1961 లో 51 విశ్వవిద్యాలయాలలోనూ కాలేజీలలోనూ గల 109 విద్యాశాఖలలో 75 వేల మంది విద్యార్థులయారు, ఉద్యోగాలుచేసుకుంటూ మరొక 30000 మంది విశ్వవిద్యాలయకోర్సులు అభ్యసించేవారు

ద్వితీయ ప్రపంచ యుద్ధానికి పూర్వం విశ్వవిద్యాలయ అధ్యాపకుల సంఖ్య 3500 వుండేది. అది 12000 లకు పెరిగింది.

పరిశ్రమలకూ, లేదా వ్యవసాయానికీ, విద్యా సంస్థలకూ సన్నిహిత సహకారం వుండేందుకై సాంకేతికవిశ్వవిద్యాలయాలు నెలకొల్పబడ్డాయి. ఆదివరకు విద్యాసంస్థలు లేనటువంటి ఆర్థిక, సాంస్కృతిక కేంద్రాలలో విశ్వవిద్యాలయాలు నెలకొల్పబడ్డాయి. ముఖ్యంగా స్లొవాకియాలో విశ్వవిద్యాలయాలపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోబడింది.

అనేక ఇంజనీరింగ్ కాలేజీలు, సాంకేతిక విద్యాలయాలు పారిశ్రామిక కేంద్రాలు నెలకొల్పబడ్డాయి విశ్వవిద్యాలయాలు విస్తృతం చేయబడ్డాయి. వైద్య విద్యాలయాల సంఖ్య కూడా ఎక్కువైంది లలితకళలనేర్పే సంస్థలు అనేక నగరాలలో నెలకొల్పబడ్డాయి ప్రతి ప్రాంతీయ నగరంలోనూ ఉపాధ్యాయ శిక్షణ సంస్థలు ఏర్పాటు చేయబడ్డాయి

* * *

విశ్వవిద్యాలయాల సంఖ్య పెరగడంతో బాటు అన్ని తరగతుల ప్రజలనుండీ విద్యార్థుల సంఖ్య కూడా పెరిగింది. యుద్ధానికి పూర్వం విశ్వవిద్యాలయ పట్టభద్రులలో 5మంది 7 శాతం మంది మాత్రమే కార్మికవర్గ కుటుంబాలకు చెందినవారు. అయితే 1961 లో విద్యార్థులలో 41,3 శాతం మంది కార్మికవర్గ కుటుంబాల నుండి 9 శాతం వ్యవసాయదారుల కుటుంబాల నుండీ వచ్చినవారున్నారు మొత్తం జనాభాలో వివిధ తరగతుల ప్రజల నిష్పత్తి కూడా దాదాపు యిదేవిధంగా వుంది.

ఈ నాటి విద్యా విధానం ఉన్నత విద్య అభ్యసించదలచుకున్న ప్రతివానికీ ఆ అవకాశం యిస్తుంది ప్రాథమిక నవవర్ష విద్య బాలలందరికీ తప్పని సరిగా అభ్యసించాలి ఆతరువాత విద్యాభ్యాసం కొనసాగించ దలచుకునేవారు మరొక మూడేళ్లపాటు 12 ఏళ్ళ సాధారణ సెకండరీ పాఠశాలలో చదువుకోవచ్చును. ఈ పాఠశాలలు విద్యార్థులను విశ్వ విద్యాలయాలకు తర్ఫీదు చేస్తాయి. కొందరు నవవర్ష విద్య తరవాత మూడు లేక నాలుగేళ్ళ సెకండరీ వృత్తి పాఠశాలల్లోచేరి, విశ్వవిద్యాలయ విద్యాభ్యాసానికి సన్నాహమవుతారు. నవవర్ష విద్య పూర్తిచేసిన విద్యార్థులలో దాదాపు మూడవవంతుమంది విద్యార్థులు యీ సాధారణ సాంకేతిక సెకండరీ పాఠశాలల్లో చేరుతున్నారు. తక్కినవారు అప్రెంటిస్ పాఠశాలల్లోగానీ, అప్రెంటిస్ శిక్షణ కేంద్రాలలోగాని శిక్షణ పొందుతారు ఇక్కడ మూడేళ్ళు శిక్షణ పొందేక విశ్వవిద్యాలయ పరీక్షకు కూర్చోవచ్చును.

సెకండరీ పాఠశాలా విద్యార్థులకయే ఖర్చు తల్లిదండ్రులే భరించాలి, కాని అలా భరించలేనివారికి ప్రభుత్వం ఉపకార వేతనాలిస్తుంది

ఒక కనీస ఆదాయం కంటే తక్కువ లభించేవారి పిల్లలకు విశ్వవిద్యాలయాల్లో కూడా స్కాలర్‌షిప్‌లు లభిస్తాయి ఫ్యాక్టరీలు. తదితర సంస్థలు కూడా తమ ఉద్యోగుల ఉన్నత విద్యాభ్యాసానికై స్కాలర్‌షిప్ లిస్తాయి విద్యాబోధన. సెకండరీ పాఠశాలల్లో పాఠ్య గ్రంథాలు, నోటుబుక్కులు మొదలైనవి ఉచితం.

సాహితీస్రవంతి

కథానిక:

జీతం వచ్చింది!

శ్రీ వాలివర్ల కృష్ణమూర్తి

ఉదయం ఏడు గంటలయింది. రామయ్యమాస్టారు స్నానంచేసి లోనికొచ్చారు. ఉతికిన పంచె చొక్కా అందించింది శారద. విదిలించి మడతలు విప్పారు. అక్కడక్కడ సిరా మరకలు.

"ఈ బట్టలు రెండైనా సబ్బుతో ఉతికితే బాగుండేది." గొణిగారు మాస్టారు. సబ్బుబిళ్ళ అయిపోయి ఆరు రోజులైంది అది మాస్టారికేం తెలుసు మనసులో అనుకుంది శారద

పంచె కట్టుకున్నారు. చొక్కా చేతబట్టుకొని అటుఇటు త్రిప్పారు. భుజాలపై పడ్డిన చిరుగులు నోరు తెరచుకొని చూశాయి మాస్టారివంక.

"శారదా"

వంటగదిలో కెళ్ళిన శారదను పిలిచారు. శారద చేతులు తుడుచుకుంటూ వచ్చింది గుమ్మంలోనే నిలబడి తలెత్తి మాస్టారివంక చూసింది. తెల్లగా పాలిపోయిన మొగంలో ఉత్సాహంలేని నల్లని కళ్ళు.

"ఏమిటండీ"

"ఈ చొక్కా చిరిగింది."

"అవునండీ, బట్టలందరికీ చిరిగాయి."

ఈ మాటలంటూ మాస్టారి చేతిలో చొక్కా నందుకుంది, అలమరలోని సూదీ, దారం తీసికుంది. చిరుగులు రెండూ కుట్టివేసింది. చొక్కాను భర్తకందించింది. తిరిగి వంటగదిలోకి వెళుతున్న శారద వంక చూశారు మాస్టారు. చిరిగిపోయిన రెండు పాత చీరె ముక్కలు. అతచేసి కుట్టిన "పావేరీ" కట్టుకున్నది శారద. అవికూడా గట్టిగాలేవు. అక్కడక్కడ చిరిగికంతలు పడ్డవి. ఆకంతల గుండా శారద శరీరం తనసూచని వెక్కిరిసుంది.

కడుపు నిండా తిండిపెట్ట లేకుంటేమానె, కనీసం మానం కాపాడుకునేందుకు వంటినిండా బట్టలైనా యివ్వలేని తన దుస్థితిని తలచుకుంటూ చొక్కా తొడుక్కున్నారు మాస్టారు విడిచిన చొక్కానున్న గుండీలు. కలము తీసి వంటికున్న చొక్కాకు తగిలించుకున్నాడు

ఇంతలో గ్లాసుతో కాఫీతెచ్చి అందించింది శారద. పంచదారలేని కాఫీ, బెల్లంకూడా కలవలేదు. కటిక చేదుగాఉంది. కళ్ళు మూసుకు ఒక్క గుక్కలో తాగేరు మాస్టారు.

గణగణమంటూ రెండోగంట మ్రోగింది. బడికి టయిం అయింది. అంగలు వంగలేసుకుంటు అరుగుదిగాడు . ఏమిటో మరచిపోయారు. తటిమని ఆగారు. ఏమిటి చెప్మా! ఆ.. పైపంచ.

శారదా! అక్కడే నిలబడి పిలిచారు వీధి గుమ్మంలోనికొచ్చి నిలిచింది శారద.

"పై పంచె యిలా యివ్వు. తర్వగా పోవాలి. రెండోగంట కొట్టారు" అన్నారు తొందర పెడుతూ.

అమ్మాయి ఓణీగా చుట్టుకెళ్ళింది.' శ్లేష్మంగా చెప్పింది శారద. చేసేదిలేక తల గోక్కుంటూ బయలుదేరారు మాస్టారు.

"లలిత పన్నెండేళ్ళ పిల్ల. దాని యీడు వాళ్ళంతా మంచి మంచి "ఓణీలు" చుట్టుకుంటున్నారు. ముక్కుటూ రెండు ఓణీలు కొనియిద్దామంటే తన చేతకావటంలేదు. చిన్న పిల్ల బిడ్డకూ చెరొక గౌను తప్ప మరింకేవీలేవు. అవైనా చిరిగినవి, వాటిద్దరికి చెరొక లంగా, చొక్కా కుట్టిద్దామంటే వీలు చిక్కటంలేదు అంటే డబ్బు మిగలటంలేదు. ఛీ ఛీ.. ఏమిటో పాడు సంసారం..."

ఇట్లా ఆలోచించుకుంటూ స్కూల్లోకి ప్రవేశించారు." టీచర్సు రిజిష్టరులో సంతకం పెట్టి వెళ్ళి తన క్లాసులో కూర్చున్నారు ఎదురుగా నలభై మంది విద్యార్థులు ఒక్కొక్కళ్ళే పరీక్షగా చూశారు. ప్రెసిడెంటుగారి రమ్మాయి. రాయుడుగారి రవ్వాయి. యింకా ఒకరిద్దరి పిల్లలు చక్కని ఖరీదైన బట్టలు ధరించి నీటుగా కూర్చున్నారు. మిగతాపిల్లలు ధరించిన బట్టలు వారివారి దరిద్రాన్ని చెప్పకే చెప్తున్నాయి. యింతమంది దరిద్రనారాయణులలో తనొకడు.

గణగణమంటూ యింటిగంట కొట్టారు. పిల్లలంతా ఎవరిండ్లకు వాళ్ళు వెళ్ళారు. రామయ్య మాస్టారు. కుర్చీకి అంటుకుపోయి కూర్చున్నారు. అంతు తెలియని ఆలోచనా సముద్రంలో యీదు లాడుతున్నారు తన ఆర్థిక దుస్థితి ఎలాపోతుందో? ఎప్పటికి తీరుతుందో అంతు చిక్కటంలేదు.

"హెడ్మాస్టారు పిలుస్తుంటారు బాబూ" అని స్కూలు జవానువచ్చి పిలిచాడు కట్టుకున్న పంచెతో చెమట పట్టిన ముఖాన్ని ఒక్కసారి తుడుచుకున్నారు. కుర్చీనుండి లేచి కాళ్ళీడ్చుకుంటూ హెడ్మాస్టారివద్దకెళ్ళారు

"కూర్చోండిమాస్టారూ" అన్నారు హెడ్మాస్టరు. టేబులు కెదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నారు రామయ్యమాస్టారు.

నమస్కారం సార్" అంటూ దిగాడు పోస్టుమాన్.

"కూర్చో బసవయ్యా! సరస్వతీ ప్రసన్నమేనా. లక్ష్మీప్రసన్నం ఏమైనా ఉందా?" అన్నారు హెడ్మాస్టరు నవ్వుతూ

"అవునుసార్ అదీ ఉంది" అంటూ మణియార్డరు ఫారంతీసి హెడ్మాస్టరు చేతికిచ్చాడు బసవయ్య

హెడ్మాస్టరు మణియార్డరు ఫారంకేసి చూస్తూ "జీతాలొచ్చాయండీ రామయ్యగారూ." అన్నాడు.

"హమ్మయ్య" రామయ్య మాస్టారిప్రాణం కాస్తంత తేరుకుంది.

నూట ఎనభది రూపాయలకు నోట్లులెక్కపెట్టి హెడ్మాస్టారి చేతిలో పెట్టాడు పోస్టుమాన్ బసవయ్య హెడ్మాస్టారు నోట్లు లెక్కపెట్టి సరిచూచుకున్నారు.

పోస్టుమాన్ మరిరెండు కవర్లు టేబిల్పై పెట్టి తపాలా సంచి భుజానవేసికొని నిలబడ్డాడు. హెడ్మాస్టారు ఒక్క రూపాయినోటు తీసి బసవయ్య చేతిలో పెట్టారు. ఒక్క నమస్కార బాణం విసిరి బసవయ్య బయట పడ్డాడు.

అసలు రామయ్య మాస్టారికి జీతం, ప్లస్ కరువు భత్యం కలసి పెరసి మొత్తం వంద రూపాయలు. ప్రావిడెంటుఫండు బాపతు ప్రతి నెలా మినహాయింపు పది రూపాయలు. పోను చేతికి వచ్చే నెట్ఎమౌంటు తొంభై రూపాయలు అందులో క్యూమిలేటివ్ డిపాజిట్ - నిర్బంధపొదుపు-నెలకు ఐదు రూపాయల మినహాయింపు.

క్రిందటి నెలలో రామయ్య మాస్టారికి యింక్రిమెంటు మంజూరైంది. అందుకు బ్లాక్ ఆఫీసు గుమాస్తాకు యిచ్చిన లంచం - కాదు మామూలు - ఐదు రూపాయలూ, యిప్పుడు పోస్టుమాన్ బసవయ్య కిచ్చిన రూపాయితో తన వాటా అర్ధ రూపాయి పోను, తన చేతికొచ్చిన జీతం డబ్బులు అక్షరాల డెబ్బది నాలుగు రూపాయల యాభై నయాపైసలు.

వచ్చిన డబ్బుతీసుకొని రామయ్య మాస్టారు జేబులో పెట్టుకున్నారు. ఎక్విటెన్సుఫారంలో సంతకం పెట్టారు. ఇంతలో ఊడిపడ్డారు బ్లాకాఫీసు జవాను సైకిలుపైన. చమట్లు కారుతూ వచ్చిన అతని వాలకంచూస్తే ఏదో కొంప లంటుకున్న ట్లేనసుకున్నారు ఉపాధ్యాయులు.

సైకిలు బైటనిలబెట్టి 'సలాం మహరాజ్' అంటూ లోనికొచ్చాడు.

ఏమిటి మీరాసాహెబూ, ఏమిటి యిట్లా గొచ్చావ్?" అని ప్రశ్నించాడు హెడ్మాస్టారు

'మన సమితి ప్రెసిడెంటుగారు నాటకం యేస్తుందార్ చెమట తుడుచుకుంటూ చెప్పాడు జవాన్ మీరాసాహెబ్,

'మన సమితి ప్రసిడెంటుగారు నాటకం వేస్తున్నారా" నవ్వు నాపుకుంటూ ప్రశ్నించాడు హెడ్మాస్టారు.

"అదికాదు మహరాజ్ నాటకం యేయిస్తుందార్, అంతా సినిమా యాక్టర్లు ఉందార్, మంచినాటకం. దానిపేరు ఉంది మాకార్ అది లేదంటయా ఆఁ..చింతామణి' తడబడకుండా చెప్పాడు మీరాసాహెబ్,

"అయితే ఆ నాటకానికి మమ్మల్ని ఆహ్వానించారా ఏమిటి? అసలు విషయం చెప్పవయ్యా సాయిబూ" అన్నారు రామయ్య మాస్టారు విసుగ్గా.

"అవును మహరాజ్ ఆహ్వానం పంపిచ్చినార్. యిద్గొండి టికెట్లు మాస్టర్ ఒకటికి రెండు టికెట్లు టికెట్ ఒకటికి ఐదురూపాయలు. డబ్బుయిప్పు ఇవ్వాలా మేముపోవాలి."

రామయ్య మాస్టారు ఆమాంతం నోరుతెరిచారు "గోరుచుట్టుమీద రోకటిపోటు. అసలే జీతాలు చాలక చస్తుంటే ప్రతి నెలా ఈ ఎన్.జీ.ఓ. లేమిటో అర్థంకావటంలేదు, క్రిందటి నెలలో నేషనల్ సేవింగ్సు సర్టిఫికెట్లు. ఆ క్రిందటి నెలలో టి. బి. సీల్సు అంతకుముందు నెలలో లాటరీ టిక్కెట్లు యిలా ప్రతినెలా జీతంలో పదో వంతు గుంజేస్తుంటే ఎట్లా చావాలి.' మనసులోనే తిట్టుకుంటూ మదన పడ్డారు మాస్టార్లిద్దరు. "ఏమైనాసరే తప్పదు కొనాల్సిందే నిరాకరిస్తే ఏం రానుందో" ఒకరి మొఖాలొకరు చూచుకున్నారు కిం అనకుండా చెరి పదిరూపాయలూ తీసి జవాను చేతిలో పెట్టారు

రామయ్య మాస్టారు రోడ్డుమీద నడుస్తున్నాడు వెనక నుండి ఎవరో పిలిచారు. నిలబడి వెనుదిరిగాడు. పంచాయితీబోర్డు బంట్రోతు బసవరావు దగ్గరగా వచ్చాడు.

నమస్కారం మాస్టారు తవర్ని మా ఆఫీసరుగారు పిలవమన్నారు" అయనావు వెంట పంచాయితీబోర్డు ఆఫీసుకు నడిచాడుమాస్టారు. వాకిటికెదురుగా ఆఫీసరుగారు కూర్చున్నారు. మాస్టారు వెళ్ళి నిలబడ్డారు.

"ఏమండీ? ఏం కావాలి?" ప్రశ్నించాడు ఆఫీసరు.

"నేను రామయ్య మాస్టారిని. మీరు నన్ను పిలిపించారు ఎందుకో సెలవిస్తారా?'

"అయామ్ సారీ! యిలా కూర్చోండి" మాస్టారు ప్రక్కనున్న కుర్చీలో కూర్చున్నారు. మనసులో మాత్రం ఏం కొంప మునుగుతుందో నని ఆందోళనగా ఉంది.

'చూడండి మాస్టారూ మీరు పెద్దవారు. మాలాంటివారికి గురువులు. యింతకాలంగా మీరు వృత్తిపన్ను చెల్లించలేదు. వెంటనేచెల్లిస్తే మర్యాదగా ఉంటుంది' ముఖం చిట్లించి అన్నాడు ఆఫీసరు

మాస్టారికి అభిమానం దెబ్బతిన్నది. తనకు బిల్లు కలెక్టరు డిమాండ్ నోటీసు లిచ్చాడు. రెండు మూడుసార్లు తిరిగాడు. అయినా తను ప్రొఫెషనల్ టాక్సు కట్టలేదు. కారణం ఏమిటి? వచ్చే జీతం ఏదోసిదంగా హరించుకుపోతుంది. జీతం వచ్చిన మూడు నాల్గు రోజుల తర్వాత చేతిలో కాని మిగలటంలేదు. పరిస్థితుల ప్రభావం అలాఉంది. తనేం చేస్తాడు.

జేబులో నుండి రెండు రూపాయల నోటు తీసి మాట్లాడకుండా టేబిలు మీద ఉంచాడు లేచి గేటు దాటాడు. అసమర్థతకు సంబంధించిన ఆలోచనలు పుంఖాను పుంఖాలుగా వస్తూవున్నాయి పండగ పదిరోజుల్లో రానుంది కుటుంబానికి కావలసిన సరకులు చాలా కొనాల్సివుంది. యీ మిగిలిన డబ్బుతో బాకీలు తీర్చాలి. క్రిందటి నెల బాపతు బాకీలు తీర్చేందుకైనా యీ డబ్బు చాలదు. మరింకా కావలసిన సరకులు కొనేదెక్కడ ఏమైనాసరే బట్టలిప్పుడుఅత్యవసరం అనుకున్నారు నాలుగు ఆరెలు శారదకు ఐక చీరెలు. లలితకు రెండు ఓణీలు, చిన్నపిల్లలకు చెరి ఒక్క గౌను కొని పెద్దామనుకొన్నారు. కాళ్లు బజారుకేసి బయలుదేరాడు.

ఆ వీధి మలుపు తిరిగాడు. అక్కడే వుంది కట్టెల అడితీ. కనకయ్య గేటులో నిలబడి ఉన్నాడు మాస్టారిని చూడగానే చిరునవ్వు చిలకరించాడు

"జీతం వచ్చిందా మాస్టారూ?' పలిచాడు కనకయ్య. మాస్టారికి జవాబు చెప్పక తప్పింది కాదు. అబద్ధమాడేందుకు అలవాటులేదు "జీతం వచ్చిందంటే బాకీదారులు ఐమకట్టారి ఏం చెయ్యాలి. బట్టలుకొనేదెట్లా' ఆలోచనలో పడ్డారు మాస్టారు.

"ఏం పంతులుగారూ మాట్లాడరేం?"

"వచ్చింది కనకయ్యా" ముక్తసరిగా జవాబిచ్చారు.

"నాకు ముందుగానే తెలిసిందిలెండి పోస్టుమాన్ బసవయ్య నడిగి తెలిసికొన్నాను"

ఖాతా పుస్తకం తీసి మాస్టారి చేతికిచ్చాడు కనకయ్య క్రిందటి నెల బకాయి ఐదు రూపాయలు. ఈ నెలలో వాడింది పదిహేను రూపాయలు. మొత్తం యిరవై రూపాయల బాకీ పద్దు కనబడింది.

మాస్టారు పది రూపాయలు తీసి కనకయ్యకందించాడు. 'యిదేంటండోయ్ మాస్టారు! ప్రతి నెలా ఐదు రూపాయలు బకాయి పెడితే నా యాపారం ఎత్తుదారమైనట్టే. యిదంతా నా సొంత సొమ్మేం గాదండి నేనూ పావలా డబ్బులవాడినే. వదవెయ్యండి మిగతా పది రూపాయలు." విదిలించి మాట్లాడాడుకనకయ్య.

ఇదిగో కనకయ్యా నామాట విను ..' నచ్చి చెప్పబోయాడు మాస్టారు.

'ఏమిటయ్యా వినేదీ? యిట్లాగైతే మా కొట్లో ఖాతా మానుకో' కస్సు విరిచినట్లు మాట్లాడేడు కనకయ్య. మాస్టారు చేసేది లేక మిగతా పది రూపాయలు తీసిచ్చి తల వంచుకొని బయలుదేరాడు.

"వచ్చిన జీతంలో సగానికి పైగా పద్దు కుంది ఏమి చెయ్యాలి? బట్టలెలా కొనాలి? బట్టలు కొనకుండా యింటికెలా వెళ్ళాలి? ఎలాగైనా యివ్వాళ బట్టలు కొనకుండా యింటి ముఖం చూడరాదు, అనుకుంటూ నడుస్తున్నాడు ఏదో నల్లని ఆకారం తనను సమీపిస్తూంది. తలెత్తి ఎదురుగా చూశాడు కిరాణా కొట్టు శేషావతారం నిలబడ్డాడు. అతని చేతిలో చిట్టా పుస్తకంవుంది.

"నమస్కారం పంతులుగారూ, మీ ఇంటికే బయలుదేరా, నా బాకీ పైసలుచేస్తే మళ్ళీ మీకు కావలసిన సరుకులు పట్టుకెళ్ళవచ్చు ఏం పంతులుగారూ ఏమంటారు? అవతల సేల్సుటాక్సువాళ్ళు నాగొంతు నొక్కేస్తుండారు" అన్నాడు ఆముదం తాగిన ముఖంపెట్టి.

"ఏమిటండీ యిది? నడి వీధిలో నిలవేసి బాకీలు వసూలు చేస్తున్నట్లుందే! కాస్త పరువూ, మర్యాదా ఉండక్కర్లా?' కోపగించుకున్నారు మాస్టారు.

"క్షమించండి పంతులుగారూ అసలు మీ యింటికే బయలుదేరానన్నాగా. యింతలో మీరే ఎదురైనారు. అయినా మా కొట్టు యిక్కడేగా, పోదాంరాండి. కోప్పడతారే పంతులుగారూ." బతిమిలాటగా అన్నాడు అవతారం.

"యిప్పుడుకాదు. తర్వాత యిస్తాను" తప్పించుకుని దాటిపోవాలనిచూశారు మాస్టారు. అవతారం వదలలేదు కాళ్ళకడ్డం పడేట్టున్నాడు. మాస్టారి ఎత్తు పార్లేదు, యిద్దరూ కలిసి కొట్టు కెళ్ళారు. ఖాతాపుస్తకం చూసి, "నలభై రూపాయల యాభై నయాపైసలయింది. మాస్టారూ, యివ్వండి," చేతులు చాపాడు అవతారం.

"ఇరవై రూపాయలు చెల్లు వెయ్యండి' అన్నారు పంతులుగారు.

'అమ్మమ్మ! అట్లా అనమాకండి. నలభై రూపాయిలూ యిచ్చి బాకీ పైసలు చెయ్యండి. తర్వాత మళ్ళీ పట్టుకెళ్ళండి నే కాదన్నానా' అన్నాడు అవతారం చేతులు నలుపుకుంటూ.

లాభం లేదని ఇరవై ఐదు రూపాయలు ఇచ్చి చెల్లు వ్రాయించాడు బలవంతంగా. అప్పటికి అవతారం ముసలమ్మలాగా గొణుగుతూనే ఉన్నాడు.

ఇక తనవద్ద పదిహేడురూపాయల యాభై నయా పైసలు మాత్రమున్నాయి. ఆ డబ్బుతో ఎన్ని గుడ్డలు కొంటాడు అంతా అయోమయంగాఉంది మాస్టారికి. అప్పటికే పన్నెండు గంటలు దాటింది. ఉదయం త్రాగిన చేదు కాఫీ తప్ప మరే ఆహారంలేదు కడుపులో మండుతూంది. మెల్లగా గుంజ పుచ్చుకుని లేచాడు,కళ్ళుతిరిగాయి..పడబోయి తమాయించుకున్నాడు ఎలాగోనడిచి రోడ్డు మీదకొచ్చాడు. యింటికి వెళదామనుకున్నాడు' కాని శారద గుర్తు కొచ్చింది. ఆమె దైన్యస్థితి గుర్తుకొచ్చిం, చింకి పాత గుడ్డలు 'చుట్టు కుంటూ ఆమె పడే హీనస్థితిని తలచుకొని విచారించాడు మాస్టారు, గుడ్డలు కొనేందుకు డబ్బు చాలదు

ఏంచెయ్యటానికి పాలుపోలేదు. ప్రతి నెల యిలాగే గడిచిపోతుంది. పండగ పది రోజుల్లో ఉంది యీ పండగకైనా గుడ్డలు కొందామంటే యిలా వుంది తనపరిస్థితి. తన స్థితి తనకే అసహ్యమేసింది. భార్యకు ఒక్క చీరెబట్ట కొనలేని అసమర్థుణ్ణి ఛీ ఛీ" అనుకున్నాడు బిగ్గరగా. చివరకు ఉన్న డబ్బుతో శారదకైనా ఒక్క చీరె కొనుక్కెళదామనుకున్నాడు. ప్రక్కనే ఉన్న కిళ్ళీకొట్టులో ఒక్క సోడా త్రాగి బట్టలషాపుకేసి నడిచాడు.

అలవాటుప్రకారం సుబ్బారావు కొట్టుదాకా నడిచి ఆగాడు మాస్టారు. తటాలున గుర్తుకొచ్చింది ఏడాది క్రిందట తీసికున్న బట్టల బాకీకు, సుబ్బారావుకు తను పదిహేను రూపాయలు బాకీ పడ్డాడు. ఆ బాకీ యిప్పుడు కట్టమంటే కొంపమునుగుతుంది.

అందుకే తలవంచుకొని కొట్టుదాటి రెండు అడుగులు వేశాడు మాస్టారు.

"పంతులుగారూ తప్పుకొని వెళ్ళటం మీవంటివారికితగదు " బిగ్గరగా సుబ్బారావన్న మాటలు వినపడ్డాయి. మాస్టారికి వెంటనే సడెన్ బ్రేక్ వేసినట్లు ఆగారు మాస్టారు. కొట్టు లోపలినుండి బయటి కొచ్చాడు సుబ్బారావు

"పంతులుగారూ మిమ్మల్నే అడుగుతున్నాను, మీరు బట్టలు పట్టుకెళ్ళి ఎన్నాళ్ళయింది పదిహేను రూపాయలు దిగబెట్టారు ఇదిగో రేపు పంపిస్తామన్నారు. సంవత్సరం దాటింది.వడుపువుచ్చాడాఁడుక్కుర్లా "గళగళా దులిపేశాడు పదిమంది దారిపోయేజనం పోగైనారు దిన్నుడై నిలబడ్డ మాస్టారివంక జాలిగా చూశారు.

మాస్టారికి తల నరికినంత పనైంది, పదిమందిలో జరిగిన పరాభవం దహించివేసింది. రోషం ముంచుకొచ్చింది. సహనం చచ్చింది. ముఖమంతా కందగడ్డయింది. కళ్లు ఎరుపెక్కాయి దెబ్బతిన్న పులిలాగయ్యారు మాస్టారు.

'ఇదిగో సుబ్బారావ్ పరువూ మర్యాదా ఉన్నది మాకు. నీ కున్నది డబ్బు. నీ డబ్బు ఎగ్గొట్టినట్లు మాట్లాడటం భావ్యంకాదు. యిదిగో నీడబ్బు. వడ్డీతో సహా పుచ్చుకో." జేబు నుండితీసినడబ్బుకొట్లోకివిసిరివేశారు మాస్టారు. తడబడే కాళ్ళతో యింటిదారి పట్టారు. వచ్చిన జీతం మడియలో ఖాళీ అయింది.

గ్రంథ సమీక్ష

పుత్రవతి

మహారాష్ట్ర రచయిత పండిత మహాదేవ శాస్త్రి జోషీ రచించిన కథలలో ఆరు ముఖ్యమైన కథలను, అనువాదకులు శ్రీ జగన్నాథ్ ఏర్చి కూర్చి దానికి 'పుత్రవతి' అని పేరు పెట్టారు

ఇవి మామూలు ఆషా - మాషీ కథలు కావు. మనుష్యుల మనస్సులలోదాగిన అంతరాలను, కొన్ని కొన్ని సందర్భాలలో సంప్రదాయికంగా ఏర్పడిన విశ్వాసాలవల్ల కలిగే పరిస్థితులను, వారి చింతనలను వెల్లడించే కథలివి

వీటిలో ముఖ్యమైంది 'గోపీ' అనేది.

ఆవూరికి హరికథలుచెప్పవచ్చిన బ్రాహ్మణ యువకుడు-గోపి ఆదరణను, తనపై క్రమంగా పెంచుకొన్న అభిమానానికి అచ్చెరువొందాడు అంతలో ఆ పల్లెటూరుకో ప్లేగు వచ్చింది. ఏ బ్రాహ్మణుడూ ఇంటికి జవ యివ్వలేదు. ప్లేగువ్యాధిగ్రస్తుడైన అతనికి గోపీ తన యింటిలో చోటుయిచ్చి పరిచర్యలు చేసింది తిరా బాగైన తర్వాత బ్రాహ్మణోత్తములకు అతని పురాణ వ్యాసంగం, హరికథాగోష్ఠి మాత్రం కావలసివచ్చింది. అందుకని గోపీ యింట్లోవున్నందువల్ల ప్రాయశ్చిత్తంచేసుకోవాలన్నారు. తమ యింట్లో తమ స్వకులస్తులకి తావు యిచ్చేపాటి జ్ఞానంకూడా లేక, తావిచ్చిన గోపిని అలా ప్రాయశ్చిత్తం చేసుకొమ్మనటం ద్వారా కించపరుస్తున్న ఆ బ్రాహ్మణులపట్ల నిరసనగా అతడా వూరినుండి వెళ్ళిపోతాడు రెండు మనస్సులు చాల దగ్గరకు వచ్చాయి కాని కలుసుకోలేకపోయాయి. దీనికి ప్రాయశ్చిత్తం కావలసింది ఆ యువతికా? ఆ బ్రాహ్మణ సమాజానికా? కథకుడు మన ముందు ఆ ప్రశ్నను వుంచాడా అన్నట్లు కథ నడుస్తుంది.

"పుత్రవతి" కథలో లేక లేక ఎన్నాళ్ళకో "పుత్రవతి" అయిన ఒక గృహిణి ఆ పర్వ సమయంలో ఆపరేషన్ జరగవలసివచ్చి, తన కంపే, పిల్లవాడే కావాలని కోరుకొన్న విషయం నెమరువేసుకొంటూ, అదే చింతతో ఒక గృహిణి మరణిస్తుంది. కథ బాగున్నా పాలు త్రాగే పిల్లవానితో తండ్రి ఈ కథ సంతా చెప్పడం కొంత వాస్తవికంగా లేదు.

ఆఖరు కథ 'భవతీ భిక్షాందేహీ' ఏ పరిస్థితి వల్ల ఈమాట అనవలసివచ్చిందో తెలుపుతుంది

మహారాష్ట్ర దేశంలో ఇంకా పాత నమ్మకాలు - కలలవల్ల కడుపు కలుగుతుంది అనే టంతటి నమ్మకాలు - ఎలా వ్యాపించియున్నవో 'స్వప్నభంగం' తెలియజేస్తుంది.

ఇక అనువాదం గురించి: మాతృకలోని ఉత్కృష్టతను పూర్తిగా తీసుకురాలేకపోయానేమోనని అనువాదకులు అన్నా, పాఠకులు చదువుతున్నప్పుడు అది 'వినయ ప్రకటన'గా భావిస్తారు.

138 పుటలుగల ఈపుస్తకం వెల రు 2 లు, ప్రచురణ "విశాలాంధ్ర ప్రచురణాలయం. విజయవాడ - 4

బాత్ ఏక్ రాత్ కీ

రచయిత్రి శ్రీమతి కె. వి. ఎస్. అచ్యుత వల్లి రచించిన బాత్ ఏక్ రాత్ కీ, నిదురలేవని దేవుడా, గన్తవ్యం, నీడబారిన మొక్క, కృష్ణ సుందరి, శాంత, నీలి, సంకల్ప వికల్పాలు, అరిటాకు ఇంటిదీపం అనే పది కథానికలుగల సంపుటి బాత్ ఏక్ రాత్ కీ".

ఇందులోని "గన్తవ్యం' అనే కథ నర్సు జీవితం గురించింది సాధారణంగా నర్సు అంటేనే ఎంత చౌకగా చూడబడతారో వారలా కావటానికి వీలైన, కాక తప్పని పరిస్థితులను ఈ కథ చక్కగా వివరిస్తుంది.

మిగతా కథలు కూడా హెచ్చుభాగం స్త్రీల కష్టసుఖాలు, వారి మనోగతాలను గురించి వివరించేవి

దేశకవితామండలి (విజయవాడ-2) వారు ప్రచురించిన ఈ 212 పుటలగల పుస్తకం వెల రు 3 లు.

—బంకా చిన్నరామప్ప.

సోషలిస్టు వాస్తవికత అంటే ఏమిటి?

(గతసంచిక తరువాయి)

మన సాహిత్యం ఇంకా బాల్య దశలో వుంది మహా కవులు దిన దినమూ ఉద్భవించరు. ఈ విషయం మనం మరచి పోకూడదు

సోవియట్ సాహిత్యంలో ఆధిపత్యం వహిస్తున్నధోరణి సోషలిస్టు వాస్తవికత ఎందుకు? ఎందుకంటే. మార్క్సిస్టు-లెనినిస్టు అవగాహనలో, ఏ కళ చారిత్రక సత్యానికి అత్యంత సన్నిహితంగా ఉంటుందో, భూతకాలకష్టంతో పోరాడటంలో జీవితం యే దశలో పయనింపక ఏ కళ అంతో ఇంతో వ్యక్తం చేయగలదో, అదే నిజమైన వాస్తవికత, మనకాలంలో నిజమైన వాస్తవికత ఎందుకు సోషలిస్టు వాస్తవికత అయింది? ఎందుకంటే, మన దేశం విజయం పొందిన సోషలిజంయొక్క దేశం గనుక, మన యుగంలోని మౌలిక ధోరణులదృష్ట్యా జీవితాన్ని సత్య సమ్మతంగా చిత్రించే సమకాలిక కళాకారుడు యీ జీవితాన్ని సోషలిజంయొక్క స్థావరాల నుండి చిత్రిస్తాడు గనుక.

కొన్నిప్రక్రియలనూ, ధోరణులనూ, రూపాలనూ, స్వభావాలనూ శైలులనూ పద్ధతులనూ సోషలిస్టు వాస్తవికత శ్రేష్ఠమైనవని కీర్తించదు. సోషలిస్టు వాస్తవికతలో శక్తివంతమైన వాస్తవికత వుంది అందులో పురాణ కవిత్వం. భావగీతాలు, నాటకం, విషాదాంతం, సుఖాంతం, వ్యంగ్యం, హాస్యం, పెద్ద నవలలు, చిన్న వ్యాసాలు గేయాలు చతురోక్తులు, మన సత్య నవలలు. సాహసగాథలు, ఉద్రిక్త విప్లవదృష్టి, శత్రువుయొక్క అన్ని ముసుగులనూ నిర్దాక్షిణ్యంగా చీల్చివేయడం, ప్రచండ విప్లవోద్రేకం నిస్వార్థతతో పరిశీలించడం, ఉద్రేకాల పోరాటం, ఉల్లాసపూరితమైన నవ్వులు, శుద్ధ లౌకికమైన సర్దుబాటు తత్వం హద్దులులేని ఊహాలోక విహారం వున్నాయి.

కావ్య వస్తువు

కావ్యవస్తువు విషయంలో కూడా సోషలిస్టు వాస్తవికత నియమాలు విధించదు. కొత్త అంశాన్నీ, సోషలిస్టు అంశాన్నీ చిత్రించాలని సోషలిస్టు వాస్తవికత కోరుతుంది. ఎందుకంటే, ప్రజల నిత్యజీవితంలో సోషలిజంయొక్క సత్యాన్ని అవి అవతరణ రూపంలో వ్యక్తం చేస్తాయి. కాని, మానవ జీవితంలోని వైవిధ్యమంతటినీ, మానవజాతియొక్క చరిత్రాత్మక అనుభవాన్నీ, నూతన మానవునికి సంబంధించిన అన్ని సమస్యలనూ, చిత్రించాలని సోషలిస్టు వాస్తవికత ఉద్దేశం.

కార్మికవర్గంయొక్క అంతర్జాతీయ పోరాటం, కమ్యూనిస్టు వ్యవస్థ కొరకు పోరాడే కార్మిక వర్గ పార్టీ, పెట్టుబడిదారీ విధానపు క్షీణదశ, పోరాటం, అంతం. కోటానుకోట్ల రైతులూ, మధ్యతరగతి ప్రజలూ. సోషలిస్టు పద్ధతులలో పునర్నిర్మాణం కావడం. జాతీయ పీడన నుండి ప్రజలు విముక్తి కావడం. నూతన సోషలిస్టు శ్రమ పెట్టుబడిదారీ శృంఖలాలలో బానిస శ్రమ, దోపిడీని అలంకరించే చిల్లరముసుగుల నన్నిటినీ చించివేయడం, వ్యక్తి తత్వం మరియు జాతీయ అధిక్యం మొదలైన భావాలను అందించి. సోషలిజం యొక్క స్వాతంత్ర్య భావాలను ప్రచారం చేయడం అంతర్యుద్ధం, సామ్రాజ్యవాదయుద్ధం పలు తరాల అవిచ్ఛేద్యత, నూతన సోషలిస్టు వ్యక్తిత్వపు అవతరణ సమిష్టితత్వ అవతరణ. గడచిన యుగాల ప్రచండ ప్రశ్నోద్యమాలు. శాస్త్ర విజయాలు, పరిశోధన, ప్రేమ, జననం, మరణం- సోషలిజానికి పెట్టుబడిదారీ విధానానికి జరుగుతున్న చరిత్రాత్మక యుద్ధంలో కోటానుకోట్ల ప్రజలజీవితంలోనూ, పోరాటంలోనూ వున్నవైవిధ్యమంతా సోషలిస్టు వాస్తవికతకు 'కావ్యవస్తువు' కావాలి. "కావ్య వస్తు" వౌతున్నది.

ఈ మహా ప్రవాహంలో "పరిశుద్ధ" రూపంలోనూ, ఆదర్శరూపంలోనూ శాక, శోపాలతో, అంతర్ వైరుధ్యాలతో, శత్రు ధోరణుల పోరాటాలను యెదుర్కొంటూ, తమ కళలో అంతో యింతో గతకాలపు చిహ్నాలను కలిగి వుంటూ, అంతకంతకూ గంభీరమూ, విస్తృతమూ ఔతున్న ఈ మహా ప్రవాహంలో, నిజమైన విప్లవకారులలోనూ, నిజమైన కళాకారుల లోనూ అత్యధిక భాగం. మహనీయుడు గోర్కీ నాయకత్వాన కృషి చేస్తూ సృష్టిస్తూ వున్నారు.

("సోషలిస్టు వాస్తవికత" 1932)

సోషలిస్టు వాస్తవికత అంటే సృజనాత్మక కళయొక్క పరిధినీ, సృజనాత్మక రూపాల వైవిధ్యాన్నీ కుంచించే నియమావళి కాదు. సోషలిస్టు వాస్తవికత నూతన సోషలిస్టు సంబంధాలకూ, విప్లవ సిద్ధాంతానికీ, సహజమైన వ్యక్తీకరణ. అందుకనే అది కళాకారునికి నూతన పరిశోధనలు చేయడానికి అనన్యమైన అవకాశాలు యిస్తుంది. కావ్యవస్తువులో అపూర్వమైన విస్తృతిని కలిగిస్తుంది, అత్యంత భిన్నభిన్నరూపాలనూ, ప్రక్రియలనూ, శైలులనూ, కళాసాధనాలనూ అభివృద్ధి చేస్తుంది. సోషలిస్టు వాస్తవికతకు ప్రధానంగా వుండవలసింది యేమంటే. విప్లవాత్మకంగా అభివృద్ధి చెందుతున్న జీవితం యొక్క చారిత్రిక విశిష్ట రూపాన్ని సత్య సమ్మతంగా చిత్రించడం. అనగా, శ్రామిక ప్రజలను సోషలిస్టు పద్ధతిలో సైద్ధాంతికంగా తీర్చి దిద్దడం.

సోషలిస్టు వాస్తవికతయొక్క యీఅంశాలు మనవర్తమాన సోవియట్ సాహిత్యంలో అంతకంతకూ యెక్కువగా కనబడుతున్నాయి. మన సాహిత్యానికీ, సమకాలిక బూర్జువా సాహిత్యానికీ మధ్యవున్న భేదమేగాక, మన సాహిత్యానికి గతించిన పూర్వసాహిత్యానికి మధ్యవున్న భేదంకూడా యీ అంశాలే. గతంలోని అత్యుత్తమ అభ్యుదయ రచయితలు కూడా వర్గజన్యమైన దృక్పథం కలిగి వున్నందున జీవితంయొక్క విప్లవాత్మక అభివృద్ధినీ చూడలేకపోయినారు. అందువల్ల సంపూర్ణ సత్యం చెప్పలేకపోయినారు, విప్లవ సిద్ధాంత ఆయుధధారియై మన దేశంలో సోషలిజం నిర్మించడంలో కలిగిన అనుభవంతో యూహాన్ని సుసంపన్నమైన సోషలిస్టు వాస్తవికత మాత్రమే జీవితాన్ని దాని చారిత్రక గమనంలో చిత్రించగలదు రేపటిదినం యే దినంలో యే విధంగా గర్భితమైందీ చిత్రించగలదు ఈ దృష్టిలో సోషలిస్టు వాస్తవికత విప్లవ కాల్పనికతను నిషేధించదు సరిగదా! అది సోషలిస్టు సృజనాత్మక కళలో ఒకముఖ్య భాగమని ఉద్ఘాటిస్తుంది.

సోషలిస్టు వాస్తవికత యొక్క యే పార్శ్వాలను సోవియట్ సాహిత్యం యెంత గంభీరంగా యెంత విస్తృతంగా అభివృద్ధిచేస్తే, అనగా విప్లవాత్మకంగా అభివృద్ధిచెందుతున్న జీవితం యొక్క చారిత్రక విశిష్ట రూపాన్ని సత్య సమ్మతంగా చిత్రించే పద్ధతిని యెంతబాగా అభివృద్ధి చేస్తే అంత యెక్కువ శక్తితో అది శ్రామిక ప్రజలను సోషలిస్టు పద్ధతిలో సైద్ధాంతికంగా తీర్చిదిద్దుతుంది

ఒక వైపున పూర్వసాహిత్యపు వారసత్వాన్ని విమర్శనాత్మకంగా జీర్ణం చేసుకోవడంద్వారానూ మరొకవైపున సోషలిజాన్ని విజయవంతంగా నిర్మించడంలో కలిగిన అనుభవాన్ని సోషలిస్టు సంస్కృతి యొక్క అభివృద్ధినీ అధ్యయనం చేయడంద్వారానూ, సోషలిస్టు వాస్తవికత ఉద్భవించిందని (సోవియట్ యూనియన్ రచయితల సంఘ) నియమావళి సరిగానే నిర్వచించినాయి.

గతకాలపు ఉత్తమ సాహిత్యానికి వారసులు

సోవియట్ సాహిత్యం సర్వసిద్ధమైన రూపంలో ఉద్భవించలేదు గత కాలపు కళాకారులు సృష్టించిన దానిలో ఉత్తమమైనదంతా, అభ్యుదయకరమైనదంతా, మన సాహిత్యానికి సంక్రమించింది. సోషలిస్టు నిర్మాణ పథకాల నుండీ, కర్మాగారాల నుండీ, సమష్టిక్షేత్రాల నుండీ, ప్రభుత్వ క్షేత్రాలనుండి అంతకంతకూ యెక్కువ మంది యువరచయితలు సోవియట్ సాహిత్యంలోకి ప్రవేశిస్తున్న యీనాడు మన సాహిత్య వారసత్వాన్ని విమర్శనాత్మకంగా జీర్ణం చేసుకోవడము యెంత

అలెగ్జాండర్ ఫెడయెవ్

ముఖ్యమో నొక్కి చెప్పవలసివుంది. పూర్వ సాహిత్యపు అనుభవం. సోషలిస్టు అనుభవం ప్రతిబింబం ద్వారా వక్రీభవం పొంది సమకాలిక సాహిత్యంలో ప్రవేశించాలి. మన వాస్తవికత నూతన సోషలిస్టు జీవితాన్ని వ్యక్తీకరించి సమర్థిస్తుంది గనుక, గత చరిత్రను సమకాలిక సోషలిస్టు దృక్పథంతో చూసి, పరిశీలించి విమర్శిస్తుంది గనుక, అది సోషలిస్టు వాస్తవికత అయింది.

గంభీరమైన సిద్ధాంత వస్తువునూ, ఉన్నత సమ్మేళనం చేసే మహాకళ కావాలి మనకు. సహజంగానే, రచయితకు మార్క్సిస్టు సిద్ధాంత అవగాహన వుండే వుండి తీరాలని షరతు విధించలేము, కాని సమకాలిక సంస్కృతి యొక్క అత్యంత సార్వత్రిక వ్యక్తీకరణ మార్క్సిజం లెనినిజం, మానవ వివేకానికి బ్రహ్మాండంగా తోడ్పడిన మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతాన్ని రచయిత బాగా అవగాహన చేసుకోవాలి, యెందుకంటే, ఈ సిద్ధాంతమే సామాజికాభివృద్ధి నియమాల అవగాహనను, మానవమనస్తత్వానికి భావాలకూ సంబంధించిన అవగాహననూ, ఇవ్వగలదు. మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంత పరిజ్ఞానం సృజనాత్మక కళాకారుని సిద్ధాంత శక్తిని పెంపొందిస్తుంది. కాని ఒక కళా ఖండం ఒక భావానికి పొంత భౌతిక రూపం ఇచ్చినప్పుడే మనోసంకల్పాలూ, మంచి చెడ్డలూ, రాగద్వేషాలూ, ధైర్యాధైర్యాలూ, నీత్యనీతులూ, సజీవసర్వాంగీణ పాత్రల్లో రూపుగట్టినప్పుడే. ఆ కళాఖండం సజీవంగా, విశ్వసనీయంగా వుంటుంది.

మిన్నా కాట్స్కీకి ఏంగెల్సు రాసిన ప్రసిద్ధమైన లేఖలో ఇలావుంది: 'పక్షపాత కవిత్వం అనే దానికి నే నెంతమాత్రమూ వ్యతిరేకిని కాదు విషాదాంత నాటకాలకు పితామహుడైన ఏస్కిలస్‌గానీ, సుఖాంత నాటకాలకు పితామహుడైన అరిస్టోఫేన్స్‌కానీ నిస్సందేహంగా పక్షపాత రచయితలే. అట్లే డాంటే. సెర్వాంటిస్ కూడా అద్భుతమైన నవలలురాస్తున్న ఆధునిక రష్యనులూ, నార్వీజియనులూ, అందరూ పక్షపాత రచయితలే కాని, ప్రత్యేక సూచనలు లేకుండా, సన్నివేశంనుండి కథా గమనం నుండి పక్షపాతం దానంతట అదే ఉత్పన్నం కావాలను కుంటాను.

సోషలిజం అనేభావం ఒకకృతిలోకి బాహ్య వస్తువుగా ప్రవేశించ కూడదు అది ఆ కృతిలోని జీవంగా వుండాలి: ఆ చిత్రణలో ఒక భాగంగా వుండాలి. కార్మికవర్గ ఆశయం రచయిత వ్యక్తిగత ఆదర్శంగా ఉండాలి. కార్మిక వర్గంతో కలసి సంతోషించడం, బాధపడడం, ప్రేమించడం, ద్వేషించడం అనేవే సోషలిస్టు కళకు చిత్తశుద్ధినీ. ఆ సమూహ పూర్ణత్వాన్నీ యిచ్చి, దానికళాత్మక ఆకర్షణను పెంచగలవు

గొప్ప సాధారణీకరణాల కళ కావాలి మనకు షేక్స్పియర్, గెథే, బాల్జాక్, పుష్కిన్, స్విఫ్ట్, డాంటే. టాల్స్టాయ్, మన కాలంలో గోర్కీ సాధారణ సాహిత్యస్థాయికి చాలా యెత్తున యెదిగున్నారంటే. వారి కళలో గొప్ప చారిత్రక సమ్మేళనం వుండి గనుక, గతంలో యెన్నడూలేని విధంగా మన యుగంలోని శాస్త్రవిజ్ఞానం సమ్మేళనం కావాలంటున్నది. మన దేశములో శాస్త్రీయ సమ్మేళన సమస్య సోషలిస్టు సంబంధాల ప్రారంభం నుండి ఉద్భవిస్తున్నది. అత్యున్నత సర్వవ్యాప్త సమ్మేళనం మన పార్టీ విధానం, ప్రతిదీ మన దేశంలో ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక రంగాలలో జరిగే ప్రతిదీ, మార్గదర్శకమైన ఒకే సంకల్పానికి లోబడి, అన్నిటినీ బంధించే సోషలిజానికి సేవ చేయడానికి వినియోగింపబడుతుంది.

సోషలిస్టుయుగంలో కళకు సమ్మేళన సమస్య చాలా ముఖ్యమైంది.

మన జీవితంలోని సత్యం తన సర్వానుభూతులలోను వ్యాపించి, తన వ్యక్తిత్వం నుండి విడదీయరానిదిగా వుండేటంతగా రచయిత జీవితాన్ని అమూలాగ్రంగా అధ్యయనం చేసి తన కావ్యవస్తువులోకి లోతుగా ప్రవేశించినప్పుడు మాత్రమే సమ్మేళనం సాధించగలడు ఈ విషయంలో అనవసరపు తొందరవలన సాధించేదేమీ లేదు విజయం పొందిన సోషలిజంయొక్క వాస్తవంతో సజీవ సంబంధం వుండాలి కళాత్మక సృష్టి వ్యక్తిలో భాగంగా వుండాలని సోషలిస్టు వాస్తవికత కోరుతుంది అది కేవల వివరణకూ వ్యతిరేకమే అర్థరహితమైన విషయసేకరణకూ వ్యతిరేకమే.

మనది ఉదాత్తమైన సుందర జీవితం. ఈ తరంలో అద్భుతమైన ఉదాత్త సుందర భవిష్యత్తు వస్తున్నది భవిష్యత్తు కేవల ఊహా కల్పన కాదు అది సాధ్యమని క్రియాంగా రుజువు చేయబడింది. ఆచరణలో రుజువు చేయబడి. ఆకారం దాలుస్తూవుంది. ఈ భవిష్యత్తును కోటానుకోట్ల ప్రజలకు సజీవ చిత్రాలలో చిత్రించి, సోషలిజం ప్రపంచ మంతటా జయించడానికి జరిగే పోరాటంలో వాళ్ళ బుద్ధినూ, వాళ్ళ శక్తినీ సమీకరించవలసిన విద్యుక్త ధర్మం సోవియట్ సాహిత్యం మీద వుంది.

యివి సోషలిస్టు వాస్తవికత యొక్క మౌలిక అవసరాలు.

('సోషలిస్టు వాస్తవికత, సోవియట్ సాహిత్యపు మౌలిక మార్గం 1934')

ప్రధానంగా సోవియట్ సాహిత్యంలోని అంశాలు యేమంటే సోషలిస్టు వ్యక్తి ఆవిర్భావం. ప్రజల మధ్య న్యాయమైన నూతన సంబంధాల ఆవిర్భావం, మానవ సంబంధాలలో పాత వ్యవస్థయొక్క అవశేషాలకూ, పోటీ వ్యవస్థలోని పాతుక మృగధర్మాలకూ వ్యతిరేకంగా, నూతన మానవతా వాదం కొరకు పోరాటం.

నూతన మానవతావాదం

సాహిత్య వస్తువులోని నూతన మానవతా వాదం సోషలిస్టు వాస్తవికతా భావానికి స్పష్టత చేకూర్చింది.

బోల్షివిక్కులు మొండివాళ్లని పాశ్చాత్య సాహిత్య పరులు అనుకున్నారు. కాబట్టి, సృజనాత్మక కళాసాహిత్యాలకు వాళ్ళొక మొండివాదం సూత్రీకరించి దానికి "సోషలిస్టు వాస్తవికత' అని పేరు పెట్టినారు. కళా ఖండాలను ఉత్పత్తి చేయడానికి అది సూత్రం కానేకాదు. సోషలిస్టు వాస్తవికతజీవితంలో వేళ్ళుపాతుకొని వుంది. వ్యక్తిగత గుణాలలోనూ, రచనా సామర్థ్యంలోనూ యెంతో వైవిధ్యం గల చాలామంది సోవియట్ కళాకారుల అనేక సంవత్సరాల కృషిఫలిత మే సోషలిస్టు వాస్తవికత, 20 సంవత్సరాలపాటు దేశ పునర్నిర్మాణమూ, నూతన మానవుని అభివృద్ధి జరిగిన తర్వాత మన సాహిత్యం యీవిధంగా రూపొందింది సంక్షిప్తంగా చెప్పేదే సోషలిస్టు వాస్తవికత.

యెందుకు వాస్తవికత? యెందుకంటే, వాస్తవికత జీవిత సత్యం గనుక పాత ప్రపంచాన్ని కొత్త ప్రపంచంగా మార్చే యే ప్రజలకైనా సత్యం పతాక గనుక.

యెందుకు సోషలిస్టు వాస్తవికత? యెందుకంటే సోషలిజం మాత్రమే సృష్టించగల నూతన గుణాలు ప్రజలలో, మానవ సంబంధాలలో, కనబడుతున్నాయి గనుక. నిజమైన విప్లవసోషలిస్టు దయచేతలో చూసినప్పుడు మాత్రమే నూతన ప్రపంచాన్నీ. అందులోని నూతన ప్రజలనూ, యదార్థంగా వర్ణించడం సాధ్యమౌతుంది.

మన కళాకారులు ప్రపంచాన్ని యదార్థంగా వర్ణించ గోరుతారు అందువల్ల విప్లవ సోషలిస్టులు వర్ణించవలసినట్లు వర్ణిస్తారు. కళలో సోషలిస్టు వాస్తవికతావాది కావడమంటే అదే అర్థం.

వాస్తవికతాభావాన్ని స్థూల లక్షణాల అవగాహనతో ఉపక్రమించే మొండివాళ్ళసంకుచిత దృష్టితో కాదు చూడవలసింది. మానవ జాతియొక్క, మానవ సమాజం యొక్క చరిత్రాత్మక అభివృద్ధి దృష్ట్యా మానవ జాతియొక్క అనాది సమస్యలనూ, జీవిత దురంతాలనూ, జీవిత దౌర్భాగ్యాలనూ, ప్రజలు యెందుకు బాధపడేదీ, తమ సంతోషాన్వేషణలో దేనికొరకు ఆశించేదీ, వీటిని అర్థం చేసుకొన్న దృష్టితోవాస్తవికతాభావాన్నిచూడాలి అప్పుడు అత్యంత విభిన్న అభిప్రాయాలూ రచనా పద్ధతులూగల అనేక పూర్వ కళాకారులకు మొండివాళ్ళ సాహిత్య సాంప్రదాయాలూ, ధోరణులూ అనే తమ అల్ప పరికరణవృష్టితో యిప్పటికీ వర్గీకరించిన కళాకారులకు, వాస్తవికతా భావం వర్తిస్తుంది

సోషలిస్టు వాస్తవికతకు సంబంధించిన విషయాలు ఈ విధంగా వున్నాయి. దానిలో అత్యంత వైవిధ్యంగల కావ్యవస్తువూ, వ్యక్తీకరణలో భిన్నపద్ధతులూ, కేవల ఊహాలోక విహారం కూడా, వైయక్తిక సృష్టికి అసాధారణమైన స్వాతంత్ర్యమూ వున్నాయి. ఎవ్వరి చేతనో కృతకంగా కల్పించబడింది గాక జీవితం చేత పోషింపబడి, పెరుగుతూ పరిపక్వమౌతూ, మానవద్వేషి సిద్ధాంతాలనూ జ్ఞానవ్యతిరేక సిద్ధాంతాలనూ ఎదిరించగల శక్తి

(మిగతా 6 వ పేజీలో)

స్వీకారం

బమ్మెరపోతనామాత్య ప్రణీత
శ్రీ మహాభాగవతము
(1, 2, 3, 4 సంపుటాలు)
(బహుపాఠాంతర పరిష్కార విపుల పీఠికా సహితము)
వెల ఒక్కొక్క సంపుటి
5 రూపాయలు

రసగంగాధరము
రచయిత శ్రీ ధరణికోట వెంకట సుబ్బయ్య

శతక సప్తకం
(సంస్కృతానువాదము)
అనువాదకులు:
శ్రీ తి. గు. వరదాచార్య యం. ఏ. (ఆనర్సు)
వెల: రు. 1-00
ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్.

శిథిల హృదయాలు (నాటకం)
రచయిత శ్రీ గరికిపాటి. వెల రు. 2 00
ప్రచురణ: ఆంధ్రరత్న బుక్‌డిపో, తెనాలి.

బుడుగు
(వినోదచిత్ర మాసపత్రిక)
వెల: 25 పైసలు
ప్రచురణ
బుడుగు (మాసపత్రిక). రాజమండ్రి.

ఏజెంట్లు కావలెను

క్యాలెండర్ల ఆర్డర్లు బుక్‌చేయుటకు, అనుభవంగల ఏజెంట్లు కావలెను ఆకర్షణీయమైన కమీషను. వ్రాయండి

Ajanta Art Calendar Mfg Co;
P B 255 MADRAS-1

ప్రభ
ప్లాస్టిక్ పెన్ను
తయారు చేయువారు
ప్రసాద్ పెన్ వర్క్సు,
తెనాలి - 1 (A P)

నెర్వొటాన్
నరముల బలహీనతకున్నూ, రక్తపోటునకున్నూ రామబాణము. అనుభవయుక్తముగా చేయబడినది.
8ఔ సీసా రు5-75, పోస్టేజిరు0-75,
ఇండియన్ మెడిసన్ హౌస్,
విజయవాడ - 2.

స్పెషల్ ఆఫర్
వాటర్ ప్రూఫ్ షాక్ ప్రూఫ్ స్విస్ మేక్. గ్యారంటీ 5 సంవత్సరములు సైజు 10½

జ్యూయల్డ్ క్రోమ్	రు	45
జ్యూయల్డ్ రోల్డ్‌గోల్డ్	రు	50
15 జ్యూయల్స్ క్రోమ్	రు	55
15 జ్యూయల్స్ రోల్డ్‌గోల్డ్	రు	60
17 జ్యూయల్స్ క్రోమ్	రు.	65
17 జ్యూయల్స్ రోల్డ్‌గోల్డ్	రు	70
21 జ్యూయల్స్ క్రోమ్	రు.	75
21 జ్యూయల్స్ రోల్డ్‌గోల్డ్	రు.	80
ఆటోమేటిక్ డేట్ ఛేంజింగ్ కాలెండర్		
21 జ్యూయల్స్ క్రోమ్	రు	80
21 జ్యూయల్స్ రోల్డ్‌గోల్డ్	రు.	85
ప్యాకింగ్, పోస్టేజి	రు	2

INDO AMERICAN CO.
BOMBAY-26

సోల్ సెల్లింగ్ ఏజంట్సు
సోగి సేల్సు కార్పొరేషన్
177, జగన్నాథ్ శంకర్ సేఠ్ రోడ్, బొంబాయి-2

అశ్వరాజావారి "శ్రీసత్యనారాయణ మాహాత్మ్యం"లో ఎన్. టి. రామారావు

శ్రీసత్యనారాయణమాహాత్మ్యం

మతిస్థిమితంలేని శివశేఖర మహారాజు (రేలంగి) అనే రాజు ఈశ్వర విష్ణువులు తనకు స్వంతదేవుళ్ళనీ, తాను ప్రజలకు ప్రత్యక్ష దైవం గనుక వారు తన ముఖతః మాత్రమే వారిని పూజించాలితప్ప, నరాధరి పూజించ రాదని శాసించాడు. ఇతని మూలంగా భూలోకంలో కలుగుతున్న హింసను భరించలేక భూదేవి (సూర్యకళ) శ్రీమన్నారాయణస్వామి (ఎన్. టి రామారావు)ని భూలోకానికి రమ్మని అర్థిస్తుంది. అందుకు శ్రీ దేవి (గీతాంజలి) అభ్యంతరం చెప్పుతుంది.

అందువల్ల భూలోక పరిస్థితిని తనకు నివేదించవలెనని నారదుని (కాంతారావు) వియోగిస్తాడు విష్ణువు.

పరిస్థితులన్నీ నారదునివల్ల వినిన తర్వాత, ఆదివరకే తన వరప్రసాదంవలన భూలోకంలో మనందుడు, కళ్యాణి అనే దంపతులకు జన్మించిన సత్యదాసు (ఎన్. టి. రామారావు) వలన "శ్రీ సత్యనారాయణ వ్రతం" గురించి ప్రచారం చేయించుమని విష్ణువు నారదుణ్ణి ఆదేశిస్తాడు.

శివశేఖరరాజు మూలంగా కలిగిన అనేక కష్టాలను అధిగమించిన సత్యదాసు రాజులో మార్పును తెచ్చాడు. రాజు తన కుమార్తె (కృష్ణకుమారి)ని సత్యదాసుకిచ్చి వివాహం చేస్తాడు

సత్యదాసు కోర్కె మేరకు శ్రీ విష్ణువు అన్నవరంలో శ్రీ వీర వెంకటసత్యనారాయణ స్వామిగా అవతరించారు.

ఎక్కువపాత్రలు-శివశేఖరమహారాజు, అతని ముఖ్య అనుచరులు నంది (ముక్కామల) పక్షి (అల్లు రామలింగయ్య)తో సహా-హాస్యప్రధానమైనవి అయినందున కథా తీవ్రత తగ్గి హాస్యం ఎక్కువ అయింది

ప్రధాన పాత్రధారులుగా రామారావు, కృష్ణకుమారి ముఖ్యంగా రామారావు చక్కగా నటించారు

'శివశివ పరమేశా' "చింతననా" పాటలు బాగున్నాయి

నిర్మాణం : అశ్వరాజాపిక్చర్స్
నిర్మాత : పి సత్యనారాయణ
స్క్రీన్‌ప్లే : కె గోపాలరావు
మాటలు, పాటలు : సముద్రాల (జూ)
సంగీతం : ఘంటసాల
కళ : వాలి
నృత్యం : వెంపటి

నేపథ్య గానం :
ఘంటసాల, మాధవపెద్ది, రాఘవులు, లీల, కోమల, వసంత, స్వర్ణలత.
విడుదల : వాణి

నటీనటులు :
రామారావు, కాంతారావు, కృష్ణకుమారి, గిరిజ, గీతాంజలి, సూర్యకళ, రేలంగి, ముక్కామల, రమణారెడ్డి, బలం, ప్రభాకర రెడ్డి, అల్లు రామలింగయ్య, లంకసత్యం, ఎ వి. సుబ్బారావు మొ॥

పాండవ వనవాసం

సావిత్రి, రామారావు, యస్. వి. రంగారావు, గుమ్మడి, రమణారెడ్డి, కాంతారావు, మిక్కిలినేని, ముక్కామల, ప్రభాకర్ రెడ్డి, లింగమూర్తి ప్రభృతులు ప్రధాన పాత్రలు ధరిస్తున్న చిత్రం పాండవ వనవాసం లో హనుమంతుని పాత్రకు పహిల్వాన్ అజిత్ సింగ్‌ను ఎన్నుకున్నారు, దర్శకత్వం : కమలాకర కామేశ్వరరావు. సంగీతం ఘంటసాల.

ఏలూరులో శ్రీ రంగారావుకు పౌరసన్మానం

ఏలూరు, జూలై 2

శ్రీ యస్ వి. రంగారావుగారు జకార్తాలో జరిగిన తృతీయ ఆఫ్రో-ఏషియన్ చలనచిత్ర పోటీలలో ఉత్తమ నటుడుగా ఎన్నిక అయిన సందర్భమున ఏలూరులో వారికి జూన్ 28న గొప్ప సత్కారము జరుపబడింది

ఈ సందర్భమున ఆహ్వాన సంఘాధ్యక్షులు శ్రీ నరహరిశెట్టి సూర్యనారాయణగారు పుర పాలక సంఘ అధ్యక్షులుగా శ్రీ రంగారావు గారికి పౌరసన్మాన పత్రమును సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ సహకారశాఖా మంత్రి శ్రీ కోట రామస్వామిగారు యీ సభకు అధ్యక్షత వహించారు. ఏలూరు పవరుపేటనుండి 27 ఎద్దుల జతలతో అమర్చబడిన వేదికపై శ్రీ రంగారావుగారిని పురవీధులలో మూరేగించారు. సాయంత్రం శ్రీ మోతే గంగరాజుపార్కులో బహిరంగసభ జరిగింది.

ఆహ్వానసంఘం తరఫున శ్రీ శంకర శ్రీరామారావుగారు సన్మానపత్రము చదివారు. పట్టణములోని వివిధ సంఘములు, వర్తకులు, కళాకారులు, సంస్థలు, విద్యార్థులు రమారమి ఏబది సన్మానపత్రములు సమర్పించారు. పవరుపేట పౌరులతరపున శ్రీ వి. కనకయ్య సన్మానపత్రము సమర్పించారు.

శ్రీ రంగారావుగారు తన ఉపన్యాసములో తాను ఏలూరు వాస్తవ్యుడ నేనని. ఏలూరుకు తనకు అవినాభావసంబంధం కలదనీ అన్నారు. కళ అనంతమైన విషయమనీ, ఏ కళారాధకుడూ జీవితమున కళను గూర్చి తృప్తి నందజాలడనీ, మానవజీవితము మిక్కిలి పరిమితమగుటయే దానికి కారణమనీ అన్నారు. తన జీవితాంతమువరకు కళారాధకునిగనే మిగిలిపోయెదననీ, తాను నటించిన చిత్రములలో నటనకు బహుమానము లందదగినవి పెక్కు ఉన్నవనీ, అందరి పాత్రపోషణను ప్రేక్షకులు గ్రహించి ఆనందించడమే తన జీవితమునకు పరమావధి యని కృతజ్ఞత తెలిపారు.

సభకు రమారమి 25 వేలమంది ప్రేక్షకులు వచ్చి, సభ ముగిసేవరకు వున్నారు ఈ సందర్భంలో శ్రీ రంగారావుగారి సన్మాన సంచిక కూడా ప్రచురించబడింది.

ఆహ్వానసంఘము తరపున శ్రీ చెన్నా రామచంద్రరావు వందనసమర్పణచేశారు.

బళ్ళారిలో 'రాఘవ కళామందిర్' ప్రారంభం

రెండులక్షల రూపాయల వ్యయంతో బళ్ళారిలో నిర్మించబడిన "రాఘవ కళామందిర్ కు శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు ఇటీవల ప్రారంభోత్సవం చేశారు. ఇది నాటక ప్రదర్శనలకు, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలకు, మాత్రమే వినియోగించబడుతుంది. కళ్యాణపూర్ణ శ్రీ బళ్ళారి రాఘవాచార్యుల పేరిట ఈ కళామందిరం బళ్ళారి చరిత్రలో ఒక ప్రముఖ ఘట్టం నాటక కళా చరిత్రలో బళ్ళారి చాల ముందంజవేసి యుండటమూ, దీనికి రాఘవుని పేరు పెట్టడమూ ఒక విశేషం

ఆర్. కె. ఫిలిమ్సు 'సంగమ్' చిత్రం, ఈనెల మొదటి వారంలో విడుదల కావలసి యుంది. కాని ప్రింట్లు రానందున వాయిదా వేయబడింది

జులై 6 న శతదినోత్సవం జరుపుకొంటున్న విక్రమ్ ప్రొడక్షన్సు వారి 'అమరశిల్పి జక్కన్న'లో జక్కన్నగా నాగేశ్వరరావు మంజరిగా బి. సరోజాదేవి

సినిమా

శ్రీ నాగేశ్వరరావుకు ఆంధ్రఫిలిం జర్నలిస్టుల విందు

ఆంధ్రుల అభిమాన నటుడు శ్రీ నాగేశ్వరరావుగారు అమెరికా, యూరప్ దేశాల పర్యటనను జయప్రదంగా ముగించుకొని వచ్చిన సందర్భంగా జూన్ 30 న రాత్రి మద్రాసు ఉడ్‌లాండ్సు హోటల్‌లో ఆంధ్ర ఫిలిం జర్నలిస్టుల అసోసియేషన్‌వారు ఆయన విందు చేశారు.

ఈ విందుకు శ్రీమతి అన్నపూర్ణతోపాటు, శ్రీ దుక్కిపాటి మధుసూదనరావుగారు కూడ హాజరైనారు.

అమెరికా నాటకరంగం, సినిమారంగం, జాతీయ జీవనరంగం అనే మూడు అంశాలను శ్రీ నాగేశ్వరరావుగారు వివరిస్తూ ప్రసంగించారు.

తన పర్యటన వివరాలన్నిటినీ ఒక పుస్తక రూపంలో వ్రాయదలచుకొన్నట్లు ఆయన తెలియజేశారు

జూన్ 28 న రాత్రి సుమారు ఒంటిగంటకు శ్రీ నాగేశ్వరరావు సతీసమేతంగా విమానంలో మద్రాసు చేరుకొన్నప్పుడు, పాతనటుడుగా ప్రసిద్ధికెక్కిన శ్రీ వి. నాగయ్యగారు తొలుత పూలమాలనువేశారు చిత్రరంగానికి చెందిన పలుశాఖలవారు సుమారు వేయిమంది హాజరయ్యారు.

మద్రాసు ఫిలింఫాన్సు అసోసియేషన్, సోషల్ అండ్ కల్చరల్ క్లబ్, సౌత్ యిండియన్ ఆర్టిస్ట్సు అసోసియేషన్‌లు ఆయనను వేర్వేరుగా సన్మానించాయి

శ్రీ నాగేశ్వరరావుగారు, జులై 5 న గుంటూరులో జరుగనున్న "అమరశిల్పి జక్కన్న" శతదినోత్సవంలో పాల్గొంటారు.

ఈనెల 10 న విడుదల కానున్న అన్నపూర్ణావారి 'డాక్టర్ చక్రవర్తి'లో జానకి నాగేశ్వరరావు

ఘర్ బసాకే దేఖో

"ఇంటినిచూచి ఇల్లాలిని గుర్తించు"అన్నారు పెద్దలు ఒక సామెతలో. ఆ-డే "ఇల్లు అనే మాటకు "ఇలాఖా" అని అర్థం చేసుకోమన్న మాట "ఇల"కు,"ఇలాఖా"కువున్నసంబంధం అంత సునిష్టమైనది. పరిమితమైన ఆదాయాలు కలవారు, వెనుక ఆస్తి ఆసరాలేని ఉద్యోగుల కుటుంబాలు ఎంతో గుట్టుగా మెలగవలసి వుంటుంది ఇది ఆర్థిక దరిద్రతపైనా ఆధారపడినప్పటికీ ముఖ్యంగా స్త్రీలపై హెచ్చుగా వుంటుంది.

ఇలా కాకుండా ఒక మధ్యతరగతికి చెందిన గృహిణి బొంబాయివంటి నగరంలో వుంటూ, ముందు వెనుకలు చూడకుండా యిష్టం వచ్చినట్లు లేనిపోని ఆడంబరాలు, అధికవ్యయాలు చేస్తే ఆ కుటుంబం ఎంత పతనమౌతుందో ఆనేదా 'ఘర్ బసాకే దేఖో' వివరిస్తుంది.

ఇది ప్రధానంగా రెండు కుటుంబాలకథ, ఇందులో లేనిపోని ఆడంబరాలు, మిడిసిపాటు కలిగిన గృహిణిగా మోహనాను, అణకువ, పొదుపరితనం, ముందువెనుకలు చూసుకొంటూ ఆడంబరాలకు పోకుండా మెలిగే గృహిణి గీతాను ప్రదర్శించి, ఆ రెండు మార్గాలకు గల భేదాను స్పష్టం చేస్తారు.

1960 లో తెలుగులో నిర్మాణమైన "అభిమానం" చిత్రాన్ని ప్రధానంగా అనుసరించిన ఈ హిందీ చిత్రంలో సావిత్రి మొదటి సారిగా నటించింది

రాజ్ "వారు విడుదల చేసిన ఈ చిత్రాన్ని విజయవాడ శ్రీనివాస మహల్‌లో జూలై 1 న పత్రికా ప్రతినిధులకు ప్రివ్యూ యిచ్చారు

బొంబాయిలోని ఒకే ప్లాటులో ఒకే గ్రామానికి చెందిన రెండు కుటుంబాలు కాపురమున్నాయి. కమల్ (సుదేశ్ కుమార్) ఒక వ్యాపార సంస్థలో ఉద్యోగి, సుందర్ (మహమూద్) ఒక ఇన్సూరెన్సు ఉద్యోగి కమల్‌భార్య మోహనా (శ్యామా) గొప్పవారింటి పిల్ల, తన ఆర్థికావకాశాలను గమనించకుండా దుబారా వ్యయంచేస్తూ కుటుంబంలో కలతలు తెచ్చుకుంటూంటుంది భర్తపట్ల ఆమె సాధారణమైన మర్యాదలను కూడ పాటించడం కష్టమయింది ఇద్దరూ ఎప్పుడూ ఎడమొహం పెడమొగ.

సుందర్ కాపురం హాయిగా వుంది. భార్య గీత (సావిత్రి) అటువంటిదికాదు, కాపురాన్ని మితంగా నడుపుకొంటూ భర్తపట్ల ఆదర్శ గృహిణిగా మెలగుతూ సంసారంలో కాంతిని పొదుకొల్పింది.

బీదకుటుంబీకురాలైనా కొడుకు కమల్‌ను వాళ్ళతల్లి (లలితాపవార్) ఎలాగో చదువు చెప్పించింది. ఇప్పుడు చిన్నకుమార్తె శారద (రాజశ్రీ)తో స్వగ్రామంలో వుంటూంది. కొడుకుకు ఉద్యోగం దొరికినా తల్లిని చూడటం లేదన్న లోకాపవాదానికి వెరచి మోహనా, అత్తనూ, ఆడపడుచునూ బొంబాయి రప్పిస్తుంది. వాళ్ళెంత నోరుమెత్తనివారైనా కోడలు చేస్తున్న అనాదరణకి ఎదురుచెప్పకుండా వుండలేక పోయారు. మోహనా, వాళ్ళిద్దర్నీ వెళ్ళగొట్టుతుంది కాని ప్రమాదానికి లోనైన వృద్ధురాలికి శారదకి కమల్ యజమాని అయిన కుమార్ (మనోజ్‌కుమార్) తన యింట్లోనే ఆశ్రయ మిస్తాడు

ఇంతలో భర్త వసూలు చేసుకొచ్చిన, వ్యాపార సంస్థ బాకీలు సొమ్ము పదివేలలో కాకుండా రు. 7,000 లను మోహనా వ్యయం చేసింది ఫలితంగా కమల్ యిరుకులోపడి జైలుకు వెళ్లాల్సిన స్థితి ఏర్పడింది.

కాని అంతలో మోహనా, తన వనుం మూలంగా సంసారంలో ఏర్పడిన కల్లోలాన్ని చూచి గాఢమైన పశ్చాత్తాప పడుతుంది

తాను ప్రేమించిన శారద, కమల్ అన్నా చెల్లెళ్ళని కుమార్‌కు తెలియడంతో చిక్కులన్నీ తప్పాయి.

శారదా కుమార్ వివాహంతో సమాప్తం

హాస్యకుటుంబంగా జానీవాకర్, మినూ ముంతాజ్ బాగా నవ్వించారు ఇంగ్లీషు భాషా సంప్రదాయాలను అనుకరించే జాక్సెన్ (అసలు పేరు జైకిషన్)గా జానీవాకర్, అతన్ని తిరిగి మార్గంలోకి తెచ్చే భార్యగా గాంజెస్ (అసలు పేరు గంగ)గా మినూ ముంతాజ్‌లు మంచి హాస్యం అందించారు.

నాగరికత అనో, నవ్యమనో ప్రయాణం చేసేటప్పుడుకూడ పెద్దలకు నమస్కరించటం కూడ చిన్నతనమని భావించేవారిని, పెద్దలాలోచించినంత మాత్రాన కేశాలంకరణ చెడిపోతుందని భావించేవారిని బాగా మందలించారు. భర్త పనిమండి యింటికి రాగానే ఆతనిని సాదరంగా ఆహ్వానించి సేద దీర్చడం పోయి, పోట్లాడటం, సమానత అనే పేరుతోనేమో భర్తపట్ల అవిధేయతగా మెలగడం వంటి వెర్రితలలు వేస్తున్న 'నాగరికత'ను నిరసించారు. గీతా ప్రవర్తన అందుకు ప్రతిగా మంచి గృహిణి ప్రవర్తన ఎలా వుండాలో విశదీకరించారు.

పూర్తి గృహ సంబంధమైన ఈ కథలో గీతగా సావిత్రి, మోహన్‌గా శ్యామా, శారదగా రాజశ్రీలు చక్కగా నటించారు.

చిత్రగుప్త సంగీత దర్శకత్వం బాగుంది. శ్రీ కిశోర్‌సాహు దర్శకత్వం వహించిన యీ చిత్రం ఇప్పుడు ఆంధ్రలో విడుదల అయింది

రత్నదీప్ పిక్చర్సు "ఘర్ బసాకే దేఖో"లో శారదగా రాజశ్రీ

ఎం. కె ఎస్ వారి 'కలియుగ భీముడు'లో ఒక దృశ్యం మధ్యలో మినూ ముంతాజ్

కలియుగ భీముడు

దారాసింగ్, కింగ్‌కాంగ్‌వంటి ప్రసిద్ధ యోధుల మల్లవిద్యలు బాగా చిత్రించబడి హిందీనుండి తెలుగులోనికి అనువదించబడిన "కలియుగ భీముడు" చిత్రం ఎం. కె. ఎస్. ప్రొడక్షన్సువారు నిర్మించినది

మహా బలశాలియైన యోధుణ్ణి - అతడు సామాన్యుడైనప్పటికీ - ఆ దేశపు రాజకుమారి ప్రేమించడం, రాజకుమారిని తానే వివాహం చేసుకోవాలనుకొంటున్న మరొక ప్రత్యర్థి - ప్రధానమంత్రి - కల్పించే కష్టాలను ఆ నాయకుడు ఎదుర్కొని చివరకు యీ వివాహాన్ని సమ్మతించిన మహారాజుచేతనే 'కళ్యాణమస్తు' అనిపించుకొనడంవంటి కథాక్రమం మట్టుకు పాతదే. అయినాదారాసింగ్ యొక్క-అతని ప్రత్యర్థులయిన మల్లయోధుల రకరకాల పోటీలు ముఖ్యంగా కుస్తీపోటీలు, కత్తియుద్ధం పోటీలు ఆశ్చర్యంగా వుంటాయి, అవి మామూలుగా సినిమాల్లో చూసే ట్రిక్ ఫొటోగ్రఫీ ప్రభావంతో కూడిన 'జూ మంత్రకాళీ' బాపతు కాదు. ఆయా పాత్రధారుల నిజ బల పరాక్రమాలతో కూడినవి, కథాక్రమంమేరకు ఎవరు ఓడాలో ఎవరు గెలవాలో పూర్వనిర్ణయం వుందినా ఆయా నటులు తమ శక్తి సామర్థ్యాలను బాగా జూపించారు,

తన కుమార్తెను ఒక సామాన్యుడు పెండ్లాడుతాడన్నజోతిష్యునిమాటలకు కోపగించి ఆ దేశపు రాజు దేశంలోని మగబిడ్డలందరినీ చంపివేయాలని ఆజ్ఞాపించాడు

అస్థితిలో ఒక పేదరాలు తన కొడుకును ఒక బుట్టలో పెట్టి నదిలో వదలుతుంది అబిడ్డను,బిడ్డలులేనిరాజోద్యోగి ఠాకూర్ రంజిత్ సింగు దంపతులు పెంచుతారు. అతడే మన కలియుగ భీముడు" అమర్‌సింగ్(దారాసింగ్)

వేటకువెళ్ళిన రాజకుమారిని ఈయువకుడు ప్రమాదం నుండి రక్షిస్తాడు, ఇంకేముంది? అంతా మామూలే, పరస్పరం ప్రేమదృక్కులు ప్రసరించుకొంటారు.

రాజకుమారిని పెళ్లాడాలనుకొంటున్న ప్రధాన మంత్రికి ఈ కలియుగ భీముడు" యిలా ప్రత్యర్థి కావటంతో ఉభయులకూ అనేక విధాల, అనేక రీతులతో పోరాటాలు సాగుతాయి అన్నింటిలోనూ విజయం చివరకు అమర్ దే.

అభయన రాజ్యానికీ, రాజకుమారి మనో రాజ్యానికీ ఈ 'కలియుగ భీముడు' అధినేత కావడంతో కథ కంచికి, మనం యింటికీ.

రాజకుమారిగా ముంతాజ్, నర్తకిగా మినూ ముంతాజ్ చక్కగా నృత్యాలు చేశా.. ఈ నృత్య దృశ్యాలను రంగులో చిత్రీకరించారు,

మాటలను పాటలను శ్రీ అనిసెట్టి వ్రాయగా, శ్రీ సామర్తి సంగీతం సమకూర్చగా శ్రీ మహమ్మద్ హుస్సేన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పూర్ణా పిక్చర్‌వారు విడుదల చేశారు.

బుద్ధభగవానుని శరణాగతి పొందిన రాజనర్తకి "ఆమ్రపాలి" కథను హిందీలో ఎస్ పి మెహ్రా ఈస్ట్‌మన్ కలర్‌లో భారీ యెత్తున నిర్మిస్తారట.

హిందీ చిత్రవార్తలు

సాధన కథానాయికగా నటిస్తున్న సాగర్ ఆర్ట్సు కార్పొరేషన్‌వారి ఈస్టమన్ కలరు చిత్రం 'అర్జు'కు ఇటీవల బొంబాయి కర్దార్ స్టూడియోలో షూటింగ్ జరిగింది. ఇందులో రాజేంద్రకుమార్, మహమూద్, నానాపల్సికర్, శశికళ, ఫిరోజ్‌ఖాన్ మొదలగు వారు నటిస్తున్నారు. పాటలు, హస్రత్ జైపురి, శైలేంద్ర; సంగీతం: శంకర్ జైకిషన్; దర్శకత్వం, రామానందసాగర్,

• • •

విజయదత్, కృష్ణకుమారి, చిత్ర, మారుతి, తివారీ, హీరాలాల్ మొదలగువారు నటిస్తున్న ఈద్ కా చాంద్" అనే చిత్రానికి మే 31 న షూటింగు మొదలయింది. దీనికి ప్రఖ్యాత తబలా విద్వాంసుడు ఉస్తాద్ అల్లా సంగీత దర్శకుడు, దర్శకుడు నానూభాయ్ వకీల్ రచన కైఫీ అజ్మీ.

• • •

ప్రవీణ్‌చౌదరి, పద్మాచౌహాన్, ఉమాదత్, షకీలాబాను భూపాలి, దారాసింగ్ నటిస్తున్న సింకేఫిలిమ్సువారి 'షేర్‌దిల్'లో కొన్ని ముఖ్య సన్నివేశాలను ఇటీవల చిత్రీకరించారు, ఈ దృశ్యాలలో దారాసింగ్, మల్లయుద్ధ ప్రవీణులు రేఅప్పొలన్, విల్‌రాబిన్‌సన్ పాల్గొన్నారు. పాటలు : హస్రత్‌జైపూరి, సంగీతం : రామచంద్ర, దర్శకత్వం : చాంద్.

• • •

శశికళ, ధర్మేంద్ర, రాజ్‌మెహ్రా, శర్మిలా టాగూర్, బేబీ ఎకీదా, దేవేన్‌వర్మ మొదలగువారు నటిస్తున్న డీలక్సు ఫిలిమ్సువారి (తాత్కాలిక నామం 'న') చిత్రానికి మే 16 న షూటింగ్ మొదలయింది అప్పుడే పూర్తి కావస్తూంది. కథ, తారాశంకర్ బంధోపాధ్యాయ నవల సంగీతం, రోషన్; నిర్మాత, దర్శకుడు: మోహన్ సెగల్.

దక్షిణభారత ఫిలించాంబర్ కార్యవర్గం

దక్షిణభారత ఫిలించాంబర్ జనరల్‌బాడీ సమావేశం జూన్ 7న జరిగింది. అందులో ఈ క్రిందివారు 1964-65 సంవత్సరానికి ఎన్నికయినారు.

అధ్యక్షుడు : బి. నాగిరెడ్డి (విజయా ప్రొడక్షన్సు) ఉపాధ్యక్షుడు శ్రీ ఎం. ఎల్. శ్రీనివాసన్ (ఎ. ఎల్ ఎస్ ప్రొడక్షన్సు) గౌరవ కార్యదర్శులు : శ్రీ సి ఎన్ రామానుజం, శ్రీ వి. పి సుబ్రహ్మణ్యం (కస్తూరి ఫిలిమ్సు), గౌరవ కోశాధ్యక్షుడు : శ్రీ సుందర్‌లాల్ నహతా (రాజశ్రీపిక్చర్సు), పట్టులు, స్టూడియో గ్రూప్ శ్రీ బి ఎస్ రంగా (విక్రమ్ స్టూడియోస్), శ్రీ ఎ కె వేలన్ (అరుణాచలం స్టూడియోస్) ప్రొడ్యూసర్ల గ్రూప్ : శ్రీ బి. ఆర్. పంతులు (పద్మినిపిక్చర్సు), టి. ఎస్. విశ్వ (సుభాష్ మూవీస్), శ్రీ ఎ పుల్లయ్య (పద్మా పిక్చర్సు), శ్రీ ఎస్. రాధాకృష్ణన్ (గణేష్ ప్రసాద్ మూవీస్) శ్రీ పి.యస్ రామకృష్ణారావు(భరణీ పిక్చర్సు) శ్రీ వి సి షణ్ముగమ్ (శివాజీ ఫిలిమ్సు), డిస్ట్రిబ్యూటర్ల గ్రూప్ శ్రీ ఎస్. రామచంద్రన్ (శ్రీ రామా ఫిలిమ్సు) శ్రీ వి. సి షణ్ముగం (శివాజీ ఫిలిమ్సు) శ్రీ సుందరలాల్ నహతా (ఈస్టిండియా ఫిలిమ్సు). ఎగ్జిబిటర్ల గ్రూప్ : శ్రీ యస్. కన్నయారామ్, శ్రీ డి. రామానుజమ్, శ్రీ బి ఎస్ రెడ్డి, శ్రీ ఎస్. రంగస్వామి, శ్రీ టి వెంకటపతిరావు, టెక్నిషియన్ సర్వీసులనుండి శ్రీ కె.ఎస్. అయ్యర్, వ్యక్తులనుండి : శ్రీ ఎ. రామయ్య, శ్రీ కె సుబ్రహ్మణ్యం.

నరహంతల రాజ్యం

(4 వ పేజీ తరువాయి)

మలో ప్రస్తావించనే లేదు బ్రెజిలు ఇరుగు పొరుగున గల ఉత్తర అమెరికా వచ్చిన నుంచి విదేశీ పెట్టుబడులు బ్రెజిల్‌యన్ ప్రజలను, వారి సహజ సంపదలను దారుణంగా కొల్లగొట్టుతున్న విషయాన్ని ఆయన తన గ్రంథములో మాట వరుసకు కూడా ప్రస్తావించలేదు

తమ దేశంలో విదేశీ పెట్టుబడులు విపరీతమైన లాభాలను ఆర్జించి ఆ లాభాలనుతమ తమ దేశాలకు తీసుకుపోతున్నట్లు ప్రెసిడెంటు గౌలార్టు క్రితం సంవత్సరం ప్రకటించారు బ్రెజిల్ లోకి వచ్చిన పెట్టుబడుల మొత్తంకంటే పెద్ద మొత్తాలు తమ దేశం నుంచి లాభాల రూపంలో విదేశాలకు వెళుతున్నట్లు ఆయన వివరించారు.

పందొమ్మిదో శతాబ్దం ఆఖరిదశాబ్దంలో బ్రెజిల్‌లోకి ప్రవేశించిన బ్రిటిష్ పెట్టుబడి బ్రెజిల్‌యన్ రైల్వేలను తన గుప్పెట్లో పెట్టుకొన్నది, ఇప్పటికే బ్రిటిష్ పెట్టుబడి పెత్తనమే ఆ రైల్వేలపై కొనసాగుతున్నది. పోతే అమెరికా పెట్టుబడులు ముఖ్యంగా వాడకం వస్తువుల పరిశ్రమలలోను, ప్రజోపయోగ పరిశ్రమలలోను, పెట్రోల్ పరిశ్రమలోను పెట్రోల్ పంపిణీ వ్యాపారంలోను, దేశీయ వాణిజ్యంలోనువున్నది, గనులు, నౌకా పరిశ్రమలలో కూడా అమెరికన్ పెట్టుబడులు ఎక్కువగానే వున్నాయి.

బ్రెజిల్‌లో ఎక్కువ జనాభాను కలిగివున్న రియోడిజనీరో, సాకోపాలో, నగరాలలోని ప్రజోపయోగ పరిశ్రమలైన గ్యాస్, సిటీ సరఫరా విద్యుచ్ఛక్తి, టెలిగ్రాఫ్ టెలిఫోన్, బస్సు రవాణా, ట్రాంబస్సులు,నగర రైల్వేలున్నగు నవన్నీ అమెరికన్, కెనడియన్ ఉమ్మడి సంస్థల యాజమాన్యంలోనే వున్నాయి బ్రెజిల్‌లోని ముఖ్య పరిశ్రమలైన మాంసాన్ని టిన్నులలో భద్రపర్చడం, ఆటొమొబైల్స్‌ను అమర్చడం, రిఫ్రిజిరేటర్స్, మోటార్ టైర్లు, ఇతర రబ్బరు సరుకులు,రసాయనిక పదార్థాల ఔషధాలు, సైకిళ్ళు తదితర పరిశ్రమలన్నీ కేవలం అమెరికన్ కార్పొరేషన్ గుప్పెట్లోనే వున్నాయి బ్యాంకులలోను ఇన్సూరెన్స్ కంపెనీలలోను అమెరికన్ పెత్తనమే సాగుతున్నది 1948-54 లో మధ్య కాలం అమెరికన్ పెట్టుబడులు ఏడురెట్లు పెరిగాయి.

విదేశీ కబంధ కౌగిలి

బ్రెజిలియన్ పరిశ్రమలో అమెరికన్ కార్పొరేషన్‌కు గల పెట్టుబడులు, పెత్తనం మూలంగా బ్రెజిలియన్ సామాజిక, రాజకీయ జీవితంపై ఆ కార్పొరేషన్లు విపరీతమైన పెత్తనం సంపాదించ గలిగాయి. ఆ పెత్తనాన్ని ఆ సంస్థలు బ్రెజిల్ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పూర్తిగా వినియోగించుకొంటున్నాయి

దేశంలో కారు చౌకగా లభ్యమవుతున్న మానవ శ్రమను, జాతీయ సహజ సంపదలను కొల్లగొట్టడంద్వారా విదేశీ గుత్తాధిపత్య సంస్థలు విపరీతమైన లాభాలు ఆర్జించగలుగుతున్నాయి. పైగా, విదేశీ పెట్టుబడులు చెల్లించవలసిన పన్నులు కూడా బహుస్వల్పమే. 1960 సంవత్సరంలో బ్రెజిల్‌లో ప్రత్యక్ష పన్నుల ద్వారాను, కార్పొరేట్ పన్నుల ద్వారాను వచ్చిన ఆదాయం మొత్తం ప్రభుత్వానికి వచ్చిన ఆదాయంలో 20 శాతం మాత్రమే. కాగా, అదే సంవత్సరం అమెరికా ప్రభుత్వానికి వచ్చిన మొత్తం ఆదాయంలో ఆ పన్నుల రూపేణా వచ్చిన ఆదాయం నూటికి 81 శాతం.

దేశంలో అంతూపంతూ లేకుండా పెచ్చు పెరుగుతున్న ద్రవ్యోల్బణను కూడా విదేశీ కంపెనీలు చక్కగా వినియోగించు కొంటున్నాయి. 1956-62 మధ్య కాలంలో బ్రెజిల్‌లోని ధరలు 300% పెరిగాయి దీనివల్ల జనసామాన్యం చెప్పనలవికాని అవస్థలు అనుభవించవలసి వచ్చింది, ఈ ద్రవ్యోల్బణసమస్య యిప్పటికీ ప్రజలనుపీడిస్తూనేవున్నది, ఆదేశాన్ని ఎదుర్కొంటున్న భూసంస్కరణల సమస్య విదేశీ పెట్టుబడుల సమస్యతోపాటు ఈ సమస్య కూడా గడ్డుగావుంది.

ఇప్పుడు ఆ దేశాన్ని పరిపాలిస్తున్న సైనికాధికారులకు ఈ సమస్యలేమీపట్టవు. అసలు ఈ సమస్యలను గురించి వారు బహుశా వినే వుండరు. అయినప్పుడు, ఈ సమస్యల పరిష్కారం గురించి వారు తల పోయటం ఇంకెక్కడ? అమెరికాప్రభుత్వ అండదండలు వారికి వున్నాయి దాంతో వారు స్వైరవిహారం చేస్తున్నారు మూకుమ్మడిగా జనాన్ని అరెస్టు చేస్తున్నారు. జైళ్ళను నింపుతున్నారు. ప్రజలకు రాజ్యాంగ పరంగా లభించిన హక్కులను వారు రద్దు చేస్తున్నారు

వగబట్టి, అతివాదులపైన, ఉదారవాదులపైన, ప్రజాస్వామిక వాదులపైన రాజకీయంగా కసి తీర్చుకొంటున్నారు. ఇదంతా కమ్యూనిజాన్ని ప్రతిఘటించడం పేరుతోనే సాగిపోతున్నది.

ఏప్రిల్ సైనిక తిరుగుబాటు అనంతరం బ్రెజిల్‌లో సైనికాధికారులు సాగిస్తున్న దారుణమైన దమననీతిని చూసి, ఆ సైనికాధికారులకు అపురైన అమెరికన్ మిత్రులు సైతం హడలిపోతున్నారు.

అవినీతికి ఆలవాలమై, ఆపాద మస్తకం కుళ్ళిపోయిన భూస్వామ్యవర్గంనుంచి వచ్చిన ఆ సైనికాధికారుల మత దేశ రాజకీయ జీవితంలోని అభ్యుదయకర ధోరణులన్నింటినీ నేలరాసివేయడమే పనిగా పెట్టుకున్నారు.

ప్రెసిడెంట్ గులార్టుపాలనలో వృద్ధిచెందిన అభ్యుదయకర ధోరణులు తమ స్వార్థప్రయోజనాలకు ప్రమాదంతెచ్చిపెడుతున్నటువాగ్రహం తారు ఆ సైనికాధికారులు క్యూబాతో దౌత్యసంబంధాలను తెగతెంపులు చేసుకొన్నారు. విదేశీ పెట్టుబడుల రక్షణకు అభయమిచ్చారు, ఆ విధంగావారు తమ ఉత్తరాదినగల తమ అగ్రజుకి సంతృప్తి కలిగించారు ఆ అగ్రజునికి మిగతావిషయాలేవీ అంత ముఖ్యమైనవి కావు.

ప్రజలను పీడిస్తున్న అనేక సమస్యలను సైనికాధికారులు అర్థం చేసుకోనూ లేరు వాటిని పరిష్కరించనూ జాలరు. కనుక వారు త్వరలోనే పదవీభ్రష్టులు కాక తప్పదు, బ్రెజిల్‌లో ఏప్రిల్‌లో జరిగిన "విప్లవానికి" ప్రెసిడెంటు జాన్సన్ త్వరపడి హర్షం ప్రకటించారు. మొదటి మందహాసం జాన్సన్‌ది అయితే, ఆఖరి చిరునగవు బ్రెజిల్ ప్రజలది కాకతప్పదు.

సోషలిస్టు వాస్తవికత

(5 వ పేజీ తరువాయి)

గలిగిన నూతన సోషలిస్టు మానవతావాదం యొక్క అవసరాలకు అనుగుణంగాలేనప్పుడు అది సోషలిస్టు వాస్తవికతకాదు,

("సోవియట్ రచన", 1938)

కళ : రాజకీయాలు

ప్రశ్న కళా స్వేచ్ఛ గురించీ, రాజకీయాల మీద కళ ఆధారపడటం గురించీ. మీ అభిప్రాయ మేమిటి?

జవాబు రచయిత కిదితెలిసినా, తెలియక పోయినా ఇష్టమున్నా, లేకపోయినా, కళ ఎల్లప్పుడూ సర్వకాలాలలోనూ, గతంలోనూ, యెప్పుడూ, రాజకీయాల మీద ఆధారపడి వుంది. రాజకీయాలంటే, పత్రికల్లో రాయడమూ సాంఘిక సమావేశాలు కాదు సమాజంలోని మహా వర్గాల, జాతుల, రాజ్యాల ప్రయోజనాల అత్యున్నత వ్యక్తీకరణే రాజకీయాలు అందరివలెనే రచయితకూడా మానవ మాత్రుడే గనుక, యీ ప్రయోజనాల ప్రభావమునుండి యెంత తప్పించుకోవాలనుకున్నా తప్పించుకోలేడు.

ఏ నిర్దిష్ట ప్రయోజనాలమీద కళ ఆధారపడింది, ప్రజా ప్రయోజనాలకు అనుకూలమైన విధానాల మీదనా, ప్రతికూలమైనవిధానాల మీదనా అనేదే ముఖ్యమైనసమస్య "పరిశుద్ధ కళ", కళకోసమే కళ", అనేవాటిప్రతినిధులు కూడా రాజకీయాలకు అతీతంగా లేరు.

వాళ్ళుప్రజాప్రయోజనాలకు సేవచేయడానికి మాత్రం యిష్టపడరు ప్రస్తున్న రూపంలో ఉన్నతవర్గాలకు, పైనున్న కొద్దిమందికి, సేవ చేస్తారు. కానీ, సోవియట్ ప్రజలమైన మనం కళ ప్రజలకోరకు ప్రజాకళగా వుండాలని కోరుతాం. అనగా, కళ నిజంగా గొప్పకళగా వుండాలని కోరుతాం. అందువల్లనే, మనం మన అభీష్టం ప్రకారం, సోవియట్ ప్రజల ప్రయోజనాలకూ, సోవియట్ దేశ ప్రయోజనాలకూ సేవ చేస్తున్నాము,

అందువల్ల నా దృష్టిలో సోవియట్ కళ అత్యంత స్వతంత్రమైంది.

(జెకోస్లోవేకియా వార్తాసంస్థ వేసిన ప్రశ్నలకు జవాబులు 1946)

ప్రశ్న : సోషలిస్టు వాస్తవికతను సోషలిస్టు భావ వాదమంచే బాగుంటుందని మీరు అనుకోవడం లేదా?

జవాబు : లేదు. సోషలిస్టు వాస్తవికత జీవితాన్ని ఉన్నదున్నట్లుగా చిత్రిస్తుంది. అదే సమయంలో ఉండవలసిన విధంగానూ చిత్రిస్తుంది దీనివల్ల వాస్తవికత శక్తి హెచ్చుతుంది. ప్రకృతి నుండి ఒక ఉదాహరణ ఇవ్వగలను. అడవిలో కాసిన ఆపిల్ పండు కొంత చేదుగా వుంటుంది, కానీ, మిచురిన్ తోటలోనో, బర్బాంక్ తోటలోనో కాసిన ఆపిల్ పండు ఆపిల్‌వున్నట్లుగానూ వుంటుంది. ఆపిల్ వుండవలసిన విధంగా వుంటుంది నిస్సందేహంగా, మిచురిన్ తోటలోనో, బర్బాంక్ తోటలోనో కాసిన ఆపిల్‌పండు ఆపిల్ తత్వాన్ని అడవి ఆపిల్ కంటే బాగా వ్యక్తం చేస్తుంది. సోషలిస్టు వాస్తవికత కూడా యింతే.

(బ్రిటిషు రచయితల ప్రశ్నలకు జవాబులు 1947)

ఎ. వి. ఎం. వారి "పూజా - కె - ఫూల్ 'లో మాలాసిన్హా, ధర్మేంద్ర

భౌతికశాస్త్ర పరిశోధనలు

ఫలితాల సర్వస్వం ప్రచురణ

వైద్య పరిశోధకులందరికి ఆధునికపరిశోధనాంశాలు తెలియజేసే "మెడికల్ యాబ్‌స్ట్రాక్ట్" అనే ప్రచురణ సంస్థ ఒకటి ఇంతవరకు పని చేస్తూవుంది. అయితే ఆధునిక భౌతికశాస్త్రపరిశోధనాంశాలను ప్రచురించే మరొక సంస్థ ఒకటి ఇప్పుడు దానికి జత కలిసింది బ్రన్స్‌విక్ లోని ఇద్దరు శాస్త్రజ్ఞులు ప్రొఫెసర్ హెర్బన్ ఉబర్ట్స్, డాక్టర్ వాల్టర్ పీడిమెన్ అనేవారికి "ఫిజికల్ రిపోర్ట్సు" అనే పేరుతో ఒక మాస పత్రికను ప్రచురించే బాధ్యతను అప్పగించారు. పశ్చిమ జర్మనీ అంతటా భౌతిక శాస్త్రంలో అన్ని అణు విభాగంలో జరిగే పరిశోధనాంశాలను తెలియజేయడం ఈ పత్రిక లక్ష్యంగా వుంది.

ఈ పత్రిక ప్రచురణకార్య ఎంత కష్టమో గ్రహించాలంటే, ఈ ఎడిటర్లు ఇద్దరూ కలిసి దాదాపు 400 మంది సహచరుల సహకారాన్ని రచనలను, అర్థించారని చెబితే సరిపోతుంది. భౌతికశాస్త్రంలోని వివిధభాగాలను ఒక్కొక్కరు స్వీకరించి అభాగానికి సంబంధించిన సర్వాంశాలనూ, గ్రంథాలనూ, కరపత్రాలనూ ఈ పత్రికలో ప్రచురింపజేయవలసివుంది. ఈ విధంగా పశ్చిమజర్మనీ లోని, విదేశాలలోని శాస్త్రజ్ఞులు ఈ మాస పత్రికద్వారా భౌతికశాస్త్రంలో ఏరంగంలో ఎక్కడ కొత్త పరిశోధన జరిగింది, ఫలితం ఏమిటో తెలుసుకొనగలుగుతారు. ఇందువల్ల ఒకరు చేసిన పరిశోధన మరొకరు చేయవలసిన అవసరం, శ్రమ శాస్త్రజ్ఞులకు తప్పిపోతుంది.

ఫ్రైడరికాగోస్సా

గత ఏడాది ప్రచురించిన ఈ మాసపత్రికలో చిన్న రివ్యూలు, పరిశోధనాంశాలు 24,000 వరకు వున్నాయి. పరిశోధనల సంఖ్యనుబట్టి భవిష్యత్తులో ఈ పత్రికలో వుండే ఈ అంశాల సంఖ్య ఇంకా పెరుగుతూ వుంటుంది, ప్రతి సంవత్సరాంతానికి ఈ పత్రిక ఒక సూచీక్రమాన్ని' (ఇండెక్స్) ప్రచురిస్తున్నది దీనివల్ల చివరకు ఇదొక భౌతిక శాస్త్ర పరిశోధనాంశాల సర్వస్వంగా శాస్త్రజ్ఞులకు అందుబాటు కాగలదు.

అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు, రష్యాలలో కూడా ఇలాంటి పరిశోధక పత్రికలు ప్రచురణ అవుతున్నందున, వీటన్నింటిని సమన్వయ పరచడానికి అంతర్జాతీయ విజ్ఞాన సమితి శ్రద్ధ చూపుతున్నది. పశ్చిమ జర్మనీకి ఈ సూచన నచ్చింది. ఈ అంతర్జాతీయ సహకారానికి సంబంధించిన పూర్తి ప్రతిపాదనలను ఈ బ్రన్స్‌విక్ ఎడిటర్లు సిద్ధంచేశారు. ఇందులో ప్రపంచంలోని శాస్త్రజ్ఞులందరితోను వారు సహకరించదలచుతున్నారు. (యు పి.యస్.)

గుండె పరీక్ష యంత్రం

గుండె ఎంతగా కొట్టుకున్నదీ సూచించగల కొత్త యంత్రాన్ని - కార్డియోటాకోమీటర్ - వి ఎస్, రూడ్ వర్క్సువారు కనుగొన్నారు, గుండె ఎంత వ్యవధిలో ఏ రీతిని కొట్టుకునేది ఈ యంత్రం- ఎలక్ట్రోకార్డియోగ్రామ్ ద్వారా సూచిస్తుంది. దీనిని బ్యాటరీతో నడుపుతారు కనుకఅన్నిప్రాంతాలలోను వినియోగించవచ్చు. నాడి రేటు మార్పునుబట్టి గుండె కొట్టుకొనే దంలోని వ్యత్యాసాన్ని నిపుణులు గ్రహిస్తారు. ఇందుకు అనువుగా నాలుగు రకాల సమాచారాన్ని ఈ యంత్రం అందజేస్తుంది. దీని కొలతలు 7.9"x9 8"x 5.9". బరువు 11 పౌన్లు, 9 వోల్టుల బ్యాటరీ సరిపోతుంది.

గ్రాఫ్ కొలతల యంత్రం

ఈ నాడు కొలతలు-రికార్డింగ్ పరికరాలు అత్యున్నత స్థాయిని అందుకున్నాయి, త్వరితగతిని వీటిని ఉపయోగించవచ్చు, కాని తగిన నిర్ణయాలు, వ్యాఖ్యానాలు చేయడానికి గ్రాఫ్‌ల పరిశీలన, కొలతలు అవసరం. ఇందుకువ్యక్తి ఓపిక అవసరం, ఇది కూడా త్వరగా జరగడానికిగాను డిసెల్‌డార్ఫ్‌లో వివాస్‌దూర్ఫ వర్క్సువారు ఒక యంత్రాన్ని (అపరేటస్) కనిపెట్టారు ఇది చిన్న పెట్టెవలె వుంటుంది. ఉపరితలం 12"x28" ఎత్తు 3.1". పై భాగాన గాజు పలక వుంటుంది, దీని కోవల విద్యుద్దీపాలు వుంటాయి, చార్టును తప్పేఅమరిక, ఒకరూలరు వుంటుంది, గ్రాఫ్ కాగితాలను కవరుపైటి అమరికకు తగిలించి, విద్యుద్దీపాలు వేసి, సులభంగా గ్రాఫ్‌తో కొలవలసిన భాగాలు చూడవచ్చు. రూలరు ద్వారా గ్రాఫ్‌లో అవసరమైన భాగాలను సులభంగా కొలవవచ్చు అవసరాలనుబట్టి ఈ అపరేటస్‌ను రెండు రకాలుగా తయారుచేసి సప్లయి చేస్తారు.

జవుళి పరిశ్రమకు రోటరీ

ఒకేదఫా 12 రంగులను, అద్దకంవేసే రోటరీ స్క్రీన్ ప్రింటింగ్ యంత్రాన్ని ఆమ్‌స్టర్‌డామ్‌లోని స్టోర్క్స్ కంపెనీవారు తయారు చేశారు ముద్రించదలచిన డిజైనులు, వినియోగించే సరుకు నాణ్యాన్ని బట్టి దీని సిలిండర్లను మార్చవచ్చు, ఈ యంత్రంలో గమనార్హమైన విశేషం నిమిషానికి 80 మీటర్లు వస్త్రం మీద రంగులు ముద్రించడం, ఇది దుస్తుల పరిశ్రమకు ఎంతో ఉపయోగకారి ఈ యంత్రాలలో సప్లయి విభాగం. ప్రింటింగ్ భాగం, డయింగ్ విభాగంఅని మూడు భాగాలు వున్నాయి. వస్త్రం మీద రంగుల ప్రింటింగ్ అవుతూవుండగానే అవసరమైన మార్పులకు దీనిలో అవకాశాలు వున్నాయి అద్దకం అయిన రంగులు ఎప్పటికప్పుడు ఎండిపోతూవుంటాయి. డిజైనులకు అనువుగా స్క్రీన్ పైబాగ మారు చేయుటానికి కూడా వీలుంది.

చదువుకున్న భార్య

శ్రీ రాజరాజేశ్వరీ ఫిలిమ్స్‌వారి"చదువుకున్న భార్య జూలైలో విడుదల కాబోతోంది. ఇది మెరుగులు వీనస్ స్టూడియోలో దిద్దుతున్నారు, 'ఆరతి' అనే హిందీ చిత్రం ఆధారంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సముద్రాల జూనియర్ మాటలు వ్రాస్తున్నారు. రాజన్ ఎడిట్ చేస్తున్నారు దర్శకత్వం: కే. వి. నాగ భూషణం, సంగీతం: అశ్వత్థామ.

ఎగువ అస్సాంలో వరద బీభత్సం

120 గ్రామాలు నీట మునక

షిల్లాంగ్, జులై 3

ఎగువ అస్సాంలోని సిబ్సాగర్ జిల్లాలో వరద తాకిడికి 122 గ్రామాలు గురయ్యాయని రాష్ట్ర రివిన్యూమంత్రి పత్రికలవారికి తెలిపారు గొల్హాట్ సబ్-డివిజన్‌లో 50 శాతం ఇండ్లు నీట మునిగిపోయాయి

జోర్హాట్ సబ్-డివిజన్‌లో పునరావాస కార్యక్రమాలకు 5 వేల రూపాయలు కేటాయించామని మంత్రి అన్నారు సిబ్సాగర్ ప్రాంతానికి బియ్యం, ఉప్పు సప్లయిలు పంపిస్తున్నారు

నౌగాంగ్ జిల్లాలోని 8 గ్రామాలకు చెందిన 8 వేల మంది బ్రహ్మపుత్ర వరదలవల్ల కొంపా గోడు కోల్పోయారన్నారు బ్రహ్మపుత్ర వరద మట్టం ఇంకా డిబ్రూ సబ్-డివిజన్‌లో పెరుగుతూనే వుందన్నారు

సిరియా-ఇజ్రాయెల్ సరిహద్దు కాల్పులు

డమాస్కస్, జులై 2

సిరియా ఇజ్రాయెల్ సరిహద్దుపై నేడు కాల్పులు జరిగాయి అయిదుగురు ఇజ్రాయెల్ సైనికులు చనిపోయారని డమాస్కస్ రేడియో తెలిపింది. ఈ కాల్పులను ఇజ్రాయెల్ సైనికులే ప్రారంభించారని ఈ రేడియో వార్త కాల్పు లింకా కొనసాగుతున్నాయని కూడా అన్నది.

రెండో బాండుంగ్ సభకు అల్జీరియా ఆహ్వానం

కైరో, జులై 2

రెండో బాండుంగ్ మహాసభకు ఆతిథ్యం ఇవ్వడానికై అల్జీరియా అంగీకరిస్తూందని ఆఫ్రికా సమైక్య సంస్థ కార్యదర్శికి అల్జీరియా లాంఛనప్రాయంగా తెలిపినట్లు తెలుస్తూంది.

ఈ మారు రెండో బాండుంగ్ రాజ్యాల మహాసభను ఏదో ఒక ఆఫ్రికా దేశంలో జరపడానికి నిర్ణయం జరిగింది. అయితే ఏ దేశంలో జరపాలి అనే నిర్ణయం రెండో ఆఫ్రికా అగ్ర నాయక సమావేశానికి విడిచిపెట్టబడింది.

ఘనా అధ్యక్షుడు న్క్రుమా ఆ సమావేశం 'అక్రా'లో జరపాలని కొంతకాలంగా ఆఫ్రికా దేశాల సహకారం కోసం ప్రయత్నిస్తున్నారు ఐక్య అరబ్ రిపబ్లిక్కు, సెనిగాల్, ఎథియోపియా, కీన్యాలుకూడా తమతమ రాజధానీ నగరాలలో ఆ సమావేశం జరగాలని కోరుతున్నాయి.

జులై 6 న టి. టి. కె; ఇందిర లండన్ పయనం

న్యూఢిల్లీ, జులై 3

కామన్‌వెల్తు ప్రధానుల సభకు ప్రధాని శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి తరపున హాజరయ్యేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి, సమాచారశాఖమంత్రి శ్రీమతి ఇందిరా గాంధి జులై 6 వ ఇక్కడ నుండి లండన్ బయలుదేరుతున్నారు.

అయూబ్ కోరికకు శ్రీ శాస్త్రి సుముఖత

న్యూఢిల్లీ జులై 2

ప్రధానమంత్రి శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రితో సంభాషణల నిమిత్తం ఢిల్లీ రావాలన్న పాక్ అధ్యక్షుని కోరికపట్ల ప్రధానమంత్రి శ్రీ శాస్త్రి నేడిక్కడ సుముఖత ప్రకటించారు

శ్రీ శాస్త్రి శారీరకంగా బాగా కోలుకొని సంభాషణలు జరిపే స్థితిలో ఉన్నప్పుడు భారత ప్రభుత్వం అయూబ్‌ఖాన్‌ను ఆహ్వానిస్తుంది

మరో మాసంపాటు విశ్రాంతి తీసుకోవలసినదిగా శ్రీ శాస్త్రికి వైద్యులు సలహా యిచ్చారు. అందువలన ప్రధాని శాస్త్రి అధ్యక్షుడు ఆయూబ్ మధ్య జరిగే సమావేశం బహుశా ఆగస్టు మాసంలో మాత్రమే జరగగలదని భావిస్తున్నారు.

పంజాబు మంత్రివర్గ నిర్మాణ సమస్య

కాంగ్రెసు పార్లమెంటరీబోర్డు సమాలోచనలు

న్యూఢిల్లీ, జులై 3

పంజాబులో నూతన మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయడంలో అనుసరించవలసిన ప్రధాన సూత్రాలను గురించి కాంగ్రెసు పార్లమెంటరీ బోర్డు నేడు చర్చించింది.

ప్రత్యేక ఆహ్వానంపై పంజాబు ముఖ్యమంత్రి కాబోయే శ్రీ రామకిషన్ బోర్డు సమావేశానికి హాజరయ్యారు. ఆ తరువాత ఆయన పత్రికల వారితో మాట్లాడుతూ తన మంత్రివర్గ సభ్యుల జాబితాను సమర్పించడానికి మరొక రోజు గడువు యివ్వవలసిందిగా తాను బోర్డును కోరానన్నారు

మంత్రివర్గ నిర్మాణంపై తుది నిర్ణయం చేయడానికి పార్లమెంటరీబోర్డు కాంగ్రెసు అధ్యక్షునికి అధికారం యిచ్చింది

పత్రికలవారి ప్రశ్నలకు శ్రీ రామకిషన్ సమాధానమిస్తూ తన మంత్రివర్గంలో 20 మందికి మించరని తెలిపారు.

దక్షిణ రొడీషియాలో శాంతిభద్రతల రక్షణ చట్టంక్రింద మరో 15 మంది ఆఫ్రికన్‌లపై నిర్బంధాలు విధించారు.

అణ్వస్త్రాలకోసం జర్మనీ బెదరింపు

నిరాయుధీకరణ సభలో జోరిన్ విమర్శ

జెనీవా జులై 3

అణ్వస్త్రాలను సంపాదించేటందుకు జర్మనీ మూడో ప్రపంచ యుద్ధం ప్రారంభించడానికి సిద్ధం అవుతున్నదని నేడు సోవియట్ యూనియన్ పశ్చిమ జర్మనీని విమర్శించింది.

నాటో ఉమ్మడి అణు సైన్యాలలో పాల్గొనిస్తారా, స్వంతానికి అణ్వస్త్రాలు తయారు చేసుకోమంటారా యని పశ్చిమ జర్మనీ రాజకీయట్ బెదరింపు సాగిస్తూందని నేడు సోవియట్ ఉప విదేశాంగ మంత్రి వలెరిన్ జోరిన్ 17 రాజ్యాల నిరాయుధీకరణ సభలో విమర్శించారు.

అంత భయంకరమైన విధ్వంసక శక్తిని ఇదివరకే రెండు మార్లు ప్రపంచ యుద్ధాన్ని ప్రారంభించి, తమ స్వార్థ ప్రయోజనాలకై అణ్వస్త్రాలతో మూడో ప్రపంచ యుద్ధాన్ని ప్రారంభించడానికి వెనుదీయని వారి చేతులలో వుంచరాదని ఆయన విమర్శించారు.

అణ్వస్త్ర వ్యాప్తి నిరోధాన్ని పశ్చిమ రాజ్యాలు కోరుతూండడం నిజమే అయితే ప్రాథమిక షరతులేవీ పెట్టకుండా వెంటనే చర్చలు ప్రారంభించడానికి సోవియటు యూనియను సిద్ధంగా వున్నదని వలెరిన్ జోరిన్ అన్నారు.

నాటో సైనిక బలాలపై వలెరిన్ జోరిన్ విమర్శ

జెనీవా, జులై 2

అణ్వస్త్రాలు వ్యాప్తికాకుండా నిరోధించడమో, ఉత్తర అట్లాంటిక్ కూటమికిచెందిననాటోకూటమిఅణుబలగాన్ని నిర్మించడమో పాశ్చాత్య రాజ్యాలు ఎన్నుకోవలసిన సమయం వచ్చిందని నేడు జెనీవా నిరాయుధీకరణ చర్చలలో సోవియట్ డిప్యూటీ విదేశాంగ మంత్రి వలెరిన్ జోరిన్ అన్నారు

జోరిన్ మాటలను వ్యతిరేకిస్తూ అమెరికా ప్రతినిధివర్గ నాయకుడు విలియం ఫాస్టర్ బహురాజ్య బలగాలమీద సోవియట్ సాగిస్తున్నదాడి "ఉత్తర అట్లాంటిక్ రక్షణ ఏర్పాట్లను భగ్నంచేయడానికే" నన్నారు.

బహురాజ్య బలగాలకు వ్యతిరేకంగా సోవియటు ఆధార శూన్యమయిన "రాజకీయ వాదనలు తెస్తున్న" దన్నారు.

జోరిన్ ఇల్లా అన్నారు:

"బాన్ నాయకులు మూర్ఖులుకారు. తమకు కావలసిందేమిటో వారెరుగుదురు. ఆ విషయం వారికి సుస్పష్టమే. అణ్వస్త్రాలపై పెత్తనంలో తమకూ భాగం కావాలని వారి అభిప్రాయం, ఉత్తర అట్లాంటిక్ బహురాజ్య సైన్యాల తుపాకి గుర్రం నొక్కడం వారికి కావాలి" సమాధానమిస్తూ ఫాస్టరు - బహు రాజ్యబలగ నిర్మాణం తుపాకీ గుర్రాన్ని వత్తే విషయంలో గాక పేలకుండాచేసే మీటను నొక్కిపెట్టడంలో హెచ్చుమంది పాల్గొనేటట్లు చేస్తుంది అన్నారు.

బహురాజ్య బలగంలో చేరేదీ, లేనిదీ బ్రిటన్ ఇంకా నిర్ణయించుకోలేదని బ్రిటిష్ ప్రతినిధివర్గ నాయకుడు సర్ పాల్ మాసొనెన్ అన్నారు.

నేటి సమావేశంలో సోవియట్, అమెరికా ప్రతినిధి నాయకుల ఉపన్యాసాలు సునిశితంగా నడిచాయి. ఆ చర్చలకు 'ప్రచ్ఛన్న యుద్ధం' వాసన వున్నదని పరిశీలకులు వ్యాఖ్యానించారు.

అమెరికాకు నష్టపరిహారం చెల్లింపు

వాషింగ్టన్, జులై 2

రుమేనియా ప్రభుత్వం నష్టపరిహారం ఆఖరువాయిదా 95 లక్షల డాలర్లను అమెరికాకు చెల్లించివేసిందనీ, 1960 లో చేసుకొన్న ఆర్థిక ఒప్పందం దీనితో పరిపూర్తి అయిందనీ అమెరికా ప్రభుత్వం ప్రకటించింది.

యుద్ధ నష్టంగానూ, వాణిజ్య రుణాలకుగానూ రుమేనియాలో జాతీయం చేసిన అమెరికా ఆస్తులకు నష్టపరిహారంగానూ రుమేనియా మొత్తం 2, 45, 26, 370 డాలర్లు అమెరికాకు ఇవ్వాలని ఆ ఒప్పదం నిర్దేశించబడింది

ఇరాన్‌లో ఆయూబ్ ఖాన్

టెహరాన్, జులై 2

కామన్వెల్తు ప్రధానుల సమావేశంలో పాల్గొనేందుకుకై లండన్ వెళ్తూ దారిలో ఇరాన్‌లో ఆగిన పాక్ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, ఇరాన్ రాజుతో నేడు సంభాషణలు ప్రారంభించారు పాక్ విదేశాంగ మంత్రి భుట్టో, ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరామ్ ఈ సంభాషణలు జరుగుతున్నప్పుడు దగ్గరే ఉన్నారు.

సైప్రస్, అరబ్‌దేశాల పరిణామాల దృష్ట్యా పశ్చిమాసియా పరిస్థితులను గురించి, పశ్చిమాసియా సైనిక కూటమి (సెంటో) వ్యవహారాలను గురించీ వీరు చర్చించారని తెలుస్తూ ది

ఇరాన్ రాజు కాశ్మీరు సమస్య పట్ల చాల ఆసక్తి కనబరచారని కూడా అంటున్నారు.

న్యూఢిల్లీ, జులై 3

కేంద్ర వాణిజ్య శాఖామంత్రి శ్రీ మనుభాయిషా నేడు మధ్యాహ్నం న్యూయార్కు నుండి ఇక్కడికి తిరిగి వచ్చారు.

కమ్యూనిస్టుపార్టీ ఐక్యతకై కృషి

సంభాషణలకై ఢిల్లీకి జ్యోతిబాసు, ప్రమోద్‌దాస్ గుప్తాలు రాక

న్యూఢిల్లీ, జులై 3

బెంగాల్‌లో పోటీకమ్యూనిస్టుపార్టీ నాయకులైన శ్రీ జ్యోతిబాసు, శ్రీ ప్రమోద్‌దాస్‌గుప్తా గార్లు నేడు యిక్కడ పార్టీ కేంద్ర కార్యదర్శివర్గంతో పార్టీ ఐక్యతకుగల అవకాశాలను పరిశీలించడానికి సంభాషణలు జరుపబోతున్నారు

పార్టీలోని రెండు వర్గాల మధ్య సామరస్యాన్ని సాధించేందుకు శ్రీ భూపేష్‌గుప్త ప్రయత్నించుతున్నారు

గతవారంలోనే శ్రీ నంబూద్రిపాద్ పార్టీ కేంద్ర కార్యదర్శివర్గంతో సంభాషణలు జరిపి వెళ్ళారు.

మైసూరు సంయుక్త సోషలిస్టు పార్టీ అడహాక్ కమిటీ

బెంగుళూరు, జులై 3

మైసూరు రాష్ట్ర ప్రజా సోషలిస్టుపార్టీ, సోషలిస్టుపార్టీ కార్యవర్గ కమిటీల సంయుక్త సమావేశంలో నూతనంగా ఏర్పాటయిన సంయుక్త సోషలిస్టుపార్టీ అడహాక్ కమిటీని నేటిరాత్రి ప్రకటించారు.

మైసూరు శాసనసభ ప్రతిపక్ష నాయకుడు శ్రీ ఎస్ శివప్ప అధ్యక్షుడుగాను, శ్రీ ఎ ఎస్ శివానందస్వామి ప్రధాన కార్యదర్శిగాను ఎన్నుకోబడ్డారు

13 మందితో ఏర్పాటయిన కమిటీలో శ్రీ ముల్కా గోవిందరెడ్డి (ఎం పి), శ్రీ ఎస్. గోపాలగౌడ ప్రభృతులు ఉన్నారు.

ఐరాస పోలీసు దళంలోకి కామన్వెల్తు సైనికులు

లండన్, జులై 2

ఐరాస "పోలీసు దళం"లో పనిచేసేందుకు కామెన్వెల్తు తరపున ఉమ్మడి దళాన్ని పంపాలన్న విషయమై తాను తక్కిన కామన్వెల్తు దేశాలతో మరికొంత సంప్రతిస్తానని బ్రిటిష్ ప్రధాని హోమ్ నేడు కామన్సు సభలో తెలిపారు. ప్రస్తుతం ఒక కామన్వెల్తు దళం ఉందనీ, మూడు కామన్వెల్తు దేశాల సైనికులు ఇందులో ఉన్నారనీ, అయితే ఇది ఇప్పుడు పూర్తిగా మలేషియా రంగంలో పనిచేస్తున్నదనీ ఆయన తెలిపారు.

డాక్టర్ భార్గవా కొత్త మంత్రి వర్గంలో చేరబోనని వెల్లడి

చండీఘర్, జులై 3

నూతన పంజాబు మంత్రివర్గంలో సభ్యుడిగా తాను చేరబోవడం లేదని తాత్కాలిక ముఖ్యమంత్రి డాక్టర్ గోపీచంద్ భార్గవా నేడిక్కడ పత్రికావిలేకరులకు చెప్పారు.

నూతన మంత్రివర్గం ఏర్పడిన తరువాత తాను తన కాలాన్ని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధికి వినియోగించగలనని ఆయన చెప్పారు.

డాక్టర్ భార్గవా వయస్సు 74 సంవత్సరాలు.

మైసూరులో భూ సంస్కరణలు అమలు

ఈ సంవత్సరాంతానికి పూర్తిచేస్తామని వెల్లడి

బెంగుళూరు, జులై 3

ఈ సంవత్సరం ఆఖరికల్లా రాష్ట్రంలో భూసంస్కరణలను అమలుపరుస్తామని మైసూరు రివెన్యూమంత్రి శ్రీ యమ్. వి కృష్ణప్ప నేడు శాసనసభలో తెలియజేశారు

ఈ లోపునవచ్చే శాసనసభా సమావేశంలో ప్రస్తుత భూసంస్కరణల చట్టానికి కొన్ని సవరణలను ప్రవేశపెట్టగలమని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్‌లో కేడీల సంఖ్య

శాసనసభలో ప్రకటన

హైద్రాబాద్, జులై 3

1963 సంవత్సరం ఆఖరుకు ఆంధ్రప్రదేశ్‌లో నేరం చేయడమే వృత్తిగా గలవారి సంఖ్య 972 అని హోమ్ మంత్రి శ్రీ మీర్ అహమ్మద్ అలీఖాన్ నేడు శాసనసభలో తెలియజేశారు.

ఈ సందర్భంలో నేరస్తుల లెక్కలను తెలిపే ఒక ప్రకటనను చేశారు

అన్ని జిల్లాలలోకంటె విశాఖజిల్లాలో ఈ కేడీలు హెచ్చుమంది వున్నారు. వీరిలో మూడు నాలుగుసార్లు జైలుశిక్షలు అనుభవించిన వారున్నారు.

అవినీతి దర్యాప్తు దళాలు

ప్రభుత్వశాఖల్లో నియామకానికి నిర్ణయం

న్యూఢిల్లీ, జులై 2

ప్రజలతో ఎక్కువగా సంబంధ బాంధవ్యాలున్న ముఖ్యమైన ప్రభుత్వ డిపార్టుమెంట్లలో అవినీతిని కనుగొనడానికి దానిని నిరోధించడానికి ఉన్నతాధికార దళాలను నియమించే పథకానికి కేంద్ర హోంమంత్రిత్వశాఖ తుదిరూప మిచ్చింది.

కేంద్ర పి డబ్ల్యు డి సప్లయి, సాంకేతిక అభివృద్ధి, ఎగుమతి దిగుమతి కంట్రోలర్ కార్యాలయం మున్నగు 'డిపార్టుమెంట్లలో' ఈ దళాలను ఏర్పాటుచేస్తారు.

ఇన్‌కంటాక్సు కస్టమ్సు,ఎక్సైజు మున్నగు డిపార్టుమెంట్లలో కూడా ఈ దళాలను నియామకాన్ని గురించి చర్చలు సాగిస్తున్నారు.

కేంద్ర మంత్రులు శ్రీయుతులు నందా, హాతీ, తదితర మంత్రులు, వారి సీనియర్ అధికార్ల మధ్య అనేక చర్చలు జరిగినతరువాత వాటికి సంబంధించిన ప్రభుత్వశాఖల చొరవతో ఈ దళాల నియామకానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.

ఈ అవినీతి దర్యాప్తు దళాలలో ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారులుంటారు. హోం మంత్రిత్వశాఖ పరిపాలన సంస్కరణల విభాగానికి చెందిన ఒక అధికారి ఒక స్పెషల్ పోలీసుశాఖకు చెందిన అధికారి అనధికార ప్రముఖ లొకరు (బహుశా పార్లమెంటు సభ్యులు) ఈ దళాల్లో ఉంటారు.

అవినీతికి లంచగొండి తనానికి అవకాశాలను కల్పించే విషయంతోసహా, ఆఫీసు ఫైళ్ళ మీద సత్వర చర్యలు తీసుకునే పాలనా వ్యవహారం వరకుకూడా ఈ దళాలు పరిశీలన చేస్తాయి.

ఈ సందర్భంలో అవినీతి వ్యవహారాలేమైనా బయటబడిన వాటివిషయమై స్పెషల్ పోలీసుశాఖ దర్యాప్తు జరిపి అవసరమైన చర్యలు తీసుకుంటుంది.

కేంద్ర పబ్లిక్ వర్క్సు డిపార్టుమెంటులో ఈ దళం అప్పుడే పని ప్రారంభించింది.

ధరలు పెరుగుదలపై జనసంఘం నిర్ణయం

వామపక్షాలతో సహకరించరాదని

న్యూఢిల్లీ, జులై 2

ధరలు పెరుగుదలకు వ్యతిరేకంగా వామపక్ష ప్రతిపక్షాలు జరిపే ఆందోళనలో పాల్గొనరాదని రాష్ట్ర శాఖలన్నిటికి జనసంఘం కేంద్ర కార్యాలయం ఆదేశించినట్లు తెలుస్తూంది.

వామపక్ష పార్టీలు ప్రారంభించే ప్రత్యక్ష ఉద్యమంలోగాని లేదా సమిష్టి కార్యాచరణలో గాని జనసంఘం రాష్ట్రశాఖలపాల్గొనరాదని కేంద్ర కార్యాలయంకోరింది. ధరలలాంటి సమస్యలపై అఖిలభారత ఉద్యమాన్ని తనుసొంతంగానైనా ప్రారంభించటానికి జనసంఘం వ్యతిరేకిస్తుంది.

ఆహార పరిస్థితిపైన, ధరల సమస్యపైన వామపక్ష పార్టీలతో జనసంఘం మౌలికంగా విభేదిస్తుంది.

అయితే, రాష్ట్రస్థాయిలో ప్రత్యేకంగా ఆందోళన జరపవలసిందిగా రాష్ట్రశాఖలను కేంద్రకార్యాలయం కోరింది.

కాంగ్రెసులో పి. యస్. పి. శాసన సభ్యుల చేరిక

న్యూఢిల్లీ జులై 3

ప్రజా సోషలిస్టుపార్టీకి/చెందిన 11 మంది ఉత్తరప్రదేశ్ శాసన సభ్యులను కాంగ్రెసు కేంద్ర పార్లమెంటరీ బోర్డు నేడు కాంగ్రెసులో చేర్చుకుంది.

వారిలో శ్రీ జెండాసింగు, శ్రీ రామాయణ్ రాయ్, శ్రీ రాజా అవదేశ్ ప్రతాప్‌మల్ ప్రభృతులు ఉన్నారు.

శ్రీ శాస్త్రి ఆరోగ్యం సంతృప్తికరంగా ఉందని డాక్టర్ల ప్రకటన

న్యూఢిల్లీ, జులై 3

ప్రధాని శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి ఆరోగ్యాన్ని కోలుకుంటున్నారని, ఆయనను పరీక్షించిన డాక్టర్లు తమ పూర్తి సంతృప్తిని వెలిబుచ్చారని నేడిక్కడ అధికార ప్రతినిధి ఒకరు తెలియజేశారు.

కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కామరాజ్, కేంద్రమంత్రులు శ్రీ స్వరణ్‌సింగు, శ్రీ సుబ్రహ్మణ్యం, శ్రీ నందా, శ్రీ హుమయూన్ కబీరు, శ్రీ మురార్జీదేశాయి, శ్రీ కృష్ణమీనన్, శ్రీ ప్రతాప్‌సింగుకైరాను తదితరులు శ్రీ శాస్త్రితో కొద్దిసేపు సంభాషణలు జరిపారు.

బొంబాయికి చావన్ టి. టి. కేల రాక

బొంబాయి, జులై 3

కేంద్ర ఆర్థికమంత్రి శ్రీ టి టి కృష్ణమాచారి, రక్షణమంత్రి శ్రీ వై. బి చావన్ నేడిక్కడకి ఢిల్లీ నుండి విమానంలో వచ్చారు.

శ్రీ కృష్ణమాచారి మామూలు విమానంలో రాగా, శ్రీ చావన్ భారత వైమానిక దళానికి చెందిన ఒక ప్రత్యేక విమానంలో వచ్చారు.

ఆర్థిక మంత్రితోపాటు దేశ వ్యవహారాల సహాయమంత్రి శ్రీ హాథీ ప్లానింగు మంత్రి శ్రీ బి. ఆర్. భగత్ కూడా వచ్చారు.

జాయింటు పట్టాల విభజనకు బిల్లు

నవంబరు సమావేశంలో ప్రవేశపెడతామని మంత్రి

హైద్రాబాద్, జులై 3

జాయింటు పట్టాల నిర్బంధ విభజనకు వీలుగా నవంబరు శాసనసభ సమావేశంలో ఒక బిల్లును ప్రవేశపెడతామని రెవిన్యూమంత్రి రామచంద్రారెడ్డి శ్రీ ఏ. రాజగోపాలనాయుడు, శ్రీ సి డి నాయుడు (స్వతంత్ర) అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఆ బిల్లును ప్రభుత్వం పరిశీలించుచున్నదని చెప్పారు.

మెరకభూములుగా ప్రభుత్వ లెక్కలలో నమోదయివుండి, మూడు సంవత్సరాలుగా ల్లపుపాగు క్రిందవున్న పొలాల వివరాలను తెలుసుకొనమని ప్రభుత్వం రివిన్యూబోర్డును కోరిందని శ్రీ వెల్లంకి విశ్వేశ్వరరావు (పి డి యఫ్) అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు ఈ వివరాల సేకరణ పూర్తి అయిన తర్వాత అటువంటి భూములను ఆయకట్టులో చేర్చుతామన్నారు. కృష్ణాజిల్లాలోని మెరక ప్రాంతాలన్నింటికీ ఈ పద్ధతి వర్తించు తుందని మంత్రి చెప్పారు.

షేక్‌పేట గ్రామంలోని 1,195 ఎకరాల భూమిని ఎకరం 1కి 200 రూ॥ల ధరకు జూబ్లీహిల్సు కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకియిచ్చిన విషయమై పలువురుసభ్యులు ప్రశ్నలు వేశారు.

ఆ భూమిని ఎకరం 1కి 2 వేల రూపాయల ధరకు ప్రభుత్వం తీసుకున్నదని శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య అన్నారు. అంత తక్కువ ధరకు ఎందుకు ఆ భూమిని యిచ్చారని శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు అడిగారు.

ఢిల్లీలో లావోస్ నాయకుల సభ

అధికార వర్తమానం లేదని విదేశాంగ శాఖ ప్రతినిధి

న్యూఢిల్లీ, జులై 4

లావోస్ సంక్షోభం పరిష్కారం కోసం త్రిపక్ష నాయక సమావేశం ఢిల్లీలో జరుపుకొనే విషయం తమ కింత వరకూ అధికార రీత్యా వర్తమానం లేదని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఒకరు నిన్న యిక్కడ పత్రికల వారికి చెప్పారు

లావోస్ తటస్థపక్ష ప్రధాని సౌవన్నఫౌమా పాథెట్ లావోనాయకులకు యీ ప్రతిపాదన చేసిన విషయంవాస్తవం. భారతప్రభుత్వానికి తెలుపబడి. వారా సమావేశాన్ని ఢిల్లీలో జరుపుకోవాలని అంగీకారానికి వస్తే అందుకు అవసరమైన యేర్పాట్లన్నిటిని చేసిపెట్టడానికి మనప్రభుత్వం సిద్ధంగావుందని ఆయన అన్నారు.

కాశ్మీర్ విలీనీకరణ పూర్తి కాలేదట

షేక్ అబ్దుల్లా ప్రసంగం

శ్రీనగర్ జులై 3

భారతదేశంలో కాశ్మీర్ విలీనీకరణ పూర్తి అయ్యిందనీ, కాశ్మీర్ ప్రజలు దీనిని ఆమోదించారనీ కేంద్ర విద్యాశాఖా మంత్రి శ్రీ ఎం సి చాగ్లా యిటీవల చేసినప్రకటనను షేక్ అబ్దుల్లా నేడు విమర్శించారు.

హజరత్‌బాల్ మసీదు వద్ద శుక్రవారం జరిగే ప్రార్థనా సమావేశంలో మాట్లాడుతూ అబ్దుల్లా, ఆ ప్రకటన అర్థం లేనిదనీ, కాశ్మీర్ విలీనీకరణ ఎప్పుడూ పూర్తి కాలేదనీ, ఆ సమస్య యింత వరకూ పరిష్కారం కాలేదనీ చెప్పారు.

రాష్ట్రప్రజల మనోభీష్టాన్ని తెలుసుకోవటమొక్కటే యీ సమస్యా పరిష్కారానికి మార్గమన్నారు

కాశ్మీర్ సమస్య పరిష్కారానికి ఆ ప్రజలకు స్వయంనిర్ణయహక్కు యివ్వటమొక్కటే మార్గమని యీ సమస్యను చూస్తున్న పెద్దలు గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నా నన్నారు.

అంతర్జాతీయ చిత్రోత్సవానికి అబ్బాస్ చిత్రం

న్యూఢిల్లీ జులై 4

నేటినుండి కార్లోవివారీ (జెకోస్లోవేకియా)లో ప్రారంభమవుతున్న 14 వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో భారతదేశంతరపున కథాచిత్రాల విభాగంలో 'షహర్ ఔర్ సప్నా'అనే చిత్రాన్ని ప్రదర్శించనున్నారు.

సుప్రసిద్ధ హిందీ చిత్ర నిర్మాత శ్రీ ఖాజా అహ్మద్ అబ్బాస్ నిర్మించిన యీ చిత్రం యిటీవలనే మనదేశంలో యీ సంవత్సరపు ఉత్తమ కథా చిత్రంగా ఎన్నికైంది

కార్లోవివారి చలన చిత్రోత్సవానికి సంబంధించిన కొన్ని ప్రత్యేక ఆకర్షణలను గురించిన సమాచారాన్ని ఢిల్లీలో జెక్ రాయబార కార్యాలయం ప్రథమ కార్యదర్శి బొహుస్లావ్‌లాస్కా నిన్న పత్రికలవారికి తెలియజేస్తూ యీ విషయం వెల్లడించారు.

'1964లో సినిమా పరిశ్రమధోరణులు"అనే విషయంపై ఈ సందర్భంలో ఒకగోష్ఠి ఏర్పాటు చేస్తున్నారనీ, అందులో సినిమా రంగానికి చెందిన నిర్మాతలు, దర్శకులూ, కళాకారులూ, పాత్రికేయులు విమర్శకులూ పాల్గొంటారని కూడా లాస్కా తెలియ జేశారు.

సరిహద్దు ఒప్పందంపై చైనా మంగోలియా సంతకాలు

హాంగ్‌కాంగ్, జులై 3

చైనా మంగోలియాల మధ్య సరిహద్దు ఒప్పందంపై ఆ దేశాల ప్రతినిధులు జూన్ 30 వ తేదీన సంతకాలు చేసినట్టు నవచైనా వార్తా సంస్థ తెలియ చేసింది.

"శాంతి, జాతీయస్వాతంత్ర్యం, సోషలిజంకై పోరాటాలు విడదీయరానివి"

టిటో, గోముల్కాల సంయుక్త ప్రకటన

బెల్‌గ్రేడ్, జులై 2

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రస్తుతం ఉత్పన్నమైన చిక్కులను తొలగించేందుకు కృషి చేయడం ప్రతి కమ్యూనిస్టుపార్టీ యొక్క, వర్కర్సుపార్టీయొక్క విధ్యుక్తధర్మమని యుగోస్లావియా అధ్యక్షుడు టిటో పోలెండ్ కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి గోముల్కా నేడొక సంయుక్త ప్రకటనలో తెలిపారని యుగోస్లావ్ వార్తాసంస్థ "టాన్యుగ్" ప్రకటించింది

పోలెండ్‌లో ఏడు రోజులపాటు జరిగిన టిటో పర్యటన ముగిసినసందర్భంలో ఈ ప్రకటన వెలువడింది.

కార్మికవర్గ అంతర్జాతీయభావం, అన్ని పార్టీలకు సరిసమాన హక్కులు, పరస్పర గౌరవం అనే ప్రాతిపదికపై అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో నిజమైన ఐక్యతను సాధించాలని ఈ ప్రకటనలో కోరారు

"శాంతికోసమని, జాతీయ స్వాతంత్ర్యం కోసమూ అంతర్జాతీయ కార్మికోద్యమం సాగించే పోరాటం, సోషలిజంకోసం సాగే పోరాటంతో గట్టిగా ముడిపడి ఉన్నదనీ, ఈ రెంటినీ విడదీయడం సాధ్యంకాద"నీ ఉభయ దేశాల కమ్యూనిస్టుపార్టీలు భావిస్తున్నాయ" ని ఈ ప్రకటన తెలుపుతూంది

శాంతి, ప్రజాస్వామ్యం, సోషలిజం కోసం సాగే పోరాటాలను ఏకీకృతం చేయడం చాల అవసరమని ప్రకటనలో నొక్కి చెప్పారు

సోషలిస్టు దేశాలన్నిటినీ సర్వతోముఖంగా, ఫలవంతంగా అభివృద్ధిపరచడమూ, వాటిమధ్య పరస్పర సహకారమూ, అనుభవాలను పరస్పరం పంచుకోవడం అత్యంత ప్రధానమని కూడా నొక్కి చెప్పారు

పోలెండు అధ్యక్షుడు అలెగ్జాండర్ జవాడుస్కీకూడా ఈ ప్రకటనపై సంతకంచేశారు

"యుద్ధం అర్థంలేనిది అంతర్జాతీయ రంగం నుండి దానిని శాశ్వతంగా తొలగించివేయాలి అని చెప్పి ఈ ప్రకటన శాంతియుత సహజీవనాన్ని ఈ విషయంలో సోవియట్ యూనియనూ తదితర సోషలిస్టు దేశాలూ తీసుకున్న చొరవనూ, ఈ రెండు పార్టీలూ గట్టిగా బలపరిచాయి.

నిరాయుధీకరణ అణ్వస్త్ర రహిత మండలాల ఏర్పాటు ఆవశ్యకతను నొక్కి చెప్పారు.

ఎమ్. ఎ. డిగ్రీ పరీక్షా ఫలితాలు

వాల్తేరు, జులై 3

ఈ క్రింది యం. ఎ. పరీక్ష ఫలితాలను ఆంధ్రవిశ్వవిద్యాలయంవారు ప్రకటించారు

బ్రాంచి V ఇంగ్లీషు లిటరేచర్

ప్రథమ శ్రేణి 645 57 64

ద్వితీయ శ్రేణి 644 46 47 48 50 51 52 53 54 55 56 58 61 62 63 65 66 67 68 72 73 74 76

దిగువ సంఖ్యలు గల వారి ఫలితాలు తరువాత ప్రకటించబడతాయి. : 660 71 75 78

బి. యస్‌సి. (ఆనర్సు) డిగ్రీ పరీక్ష

పార్టు II లెక్కలు (మెయిన్)

ప్రథమ శ్రేణి : 864 మాత్రమే

ద్వితీయశ్రేణి 865 873

తృతీయశ్రేణి : 871 72 74 75

బి ఎస్. సి. డిగ్రీకి అర్హులు: 863 876.

ఈదిగువ నెంబర్లుగల వారి ఫలితాలను తరువాత ప్రకటిస్తారు 866 870.

జంతుశాస్త్రం (మెయిన్)

ప్రథమశ్రేణి 937 43

ద్వితీయశ్రేణి 938 39 40 41 42 46

తృతీయశ్రేణి ఎవరూలేరు.

బి యస్ సి. డిగ్రీకి అర్హులు ఎవరూలేరు

దిగువ నెంబర్లు గలవారి ఫలితాలు తరువాత ప్రకటిస్తారు. 936 44 45 47.

ఎమ్. ఎస్‌సి డిగ్రీ పరీక్ష

మేథమెటికల్ ఫిజిక్సు (ప్రీవియస్)

970

967 నెంబరు కలవారి ఫలితం తరువాత ప్రకటించబడుతుంది.

మేథమాటికల్ ఫిజిక్సు (ఫైనల్)

ప్రథమశ్రేణి 1074 75 76 79 82.

ద్వితీయశ్రేణి : 1080 81.

బ్రాంచి II కెమిస్ట్రీ (ప్రీవియస్)

984 85 89 93 94 95 96 97.

983 986 988 990 992 నెంబర్లు కలవారి ఫలితాలు తరువాత ప్రకటించుతారు

ఇన్ ఆర్గానిక్ కెమిస్ట్రీ (ఫైనల్)

ప్రథమశ్రేణి : 1125 26 27

ద్వితీయశ్రేణి : 1128 మాత్రమే

ప్రీవియస్,ఫైనల్ (అన్నిబ్రాంచీలు)

జర్మన్

968 70 72 74 75 77 79 80 82 85 87 89 94 98 1002 05 06 08 09 10 11 12 13 14 16 17 18 19 20 23 24 25 26 27 28 30 32 34 35 36 37 38 39 40 41 42 43 48 49 50 53 54 55 57 59 60 78 99 1101 02 04 06 07 08 09 10 19 నుండి 24 28 31 32 38 39 40 41 42 47 48 59 61 62 63 64 65 66 67 68 76 77 78 79 80 82 84 89 90 91 94 95 96 97 98 99 200 01 02 04 05 31 35

దిగువ నెంబర్లు కలవారి ఫలితాలు తరువాత ప్రకటించుతారు : 967 973 976 78 83 86 88 90 92 1004 1029 44 45 47 56 58 1183 1232 34

ఆఫ్తాల్‌మోలజీలో డిప్లమో పరీక్ష (పాతనిబంధనలు)

254 304 305 307 308 310

కొత్త నిబంధనలు (పార్టు I)

257 311 12 13 14

సబ్-రిజిస్ట్రార్ల మహాసభ నిర్ణయాలు

హైద్రాబాద్, జులై 3

గత రెండు రోజులుగా ఇక్కడ జరుగుచున్న రాష్ట్ర సబ్ రిజిస్ట్రార్ల మహాసభ ప్రభుత్వానికి కొన్ని సూచనలనిచ్చింది.

2 000 రిజిష్టరు పత్రములకు ఒక కార్యాలయముండే విధంగా ఏర్పాట్లు కావించాలని నిర్ణయించింది.

అర్హులైన సబ్ రిజిస్ట్రార్లను న్యాయాధికారులుగా, బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లుగా నియమించాలని మహాసభ అభ్యర్థించింది

రిజిస్ట్రేషన్ ఇనస్పెక్టరు జనరల్ కార్యాలయంలోని సూపరెంటెండెంట్లను సెక్రటేరియట్‌లోని సూపరెంటెండెంట్లతో సమానంగా చూడాలని మహాసభ తీర్మానించింది.

రివెన్యూ డిపార్టుమెంటు వారికివలెనే సెక్రటేరియట్ ఉద్యోగులలో కొంత శాతాన్ని గ్రామీణప్రాంతంలో పనిచేసే సబ్-రిజిస్ట్రార్లకు కేటాయించాలని మహాసభ మరొక తీర్మానం చేసింది.

మొదటి, రెండవ తరగతి సబ్‌రిజిస్ట్రార్లకు రూ॥ 220 - 10 - 320, 150 - 7½-210 వేతనాలను ప్రభుత్వం ఇప్పుడు ఇస్తున్నది. ఈ వేతనాలను రూ॥ 250-20-450, రూ॥ 250-10-320 లకు పెంచాలని మహాసభ కోరింది.

మొదటి తరగతి సబ్‌రిజిస్ట్రార్ల సంఖ్యను 50% పెంచాలని, స్వగ్రామాల నుండి 100 మైళ్ళలోపు మాత్రమే బదిలీలు చేయాలని మహాసభ తీర్మానించింది.

బొంబాయి రేవులోని ముఠా కార్మికుల వేతనాలు

బొంబాయి, జులై 3

బొంబాయి రేవు నుండి ఆహార ధాన్యాలను మోసే ముఠా కార్మికులకు ప్రోత్సాహమిచ్చే వేతనాల పథకం విషయం చర్చించేందుకుజరిగిన కేంద్రప్రభుత్వ వివిధ మంత్రిత్వ శాఖల ప్రతినిధులు, ఓడరేవు కార్మికుల ప్రతినిధులు తమ తుది నివేదికను ప్రభుత్వ అనుమతికి నేడు నివేదించారు

ఐదు రోజులపాటు జరిగిన యీ సమావేశం నేటితో ముగిసింది

కార్మికులకు ప్రోత్సాహమిచ్చే వేతనాల పథకాన్ని ప్రవేశపెట్టటానికి, కంట్రాక్టుపద్ధతిని రద్దుచేయటానికి నిర్ణయించినట్లు కేంద్రఆహారశాఖామంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం గతవారంలో యిచ్చటకు వచ్చినప్పుడు ప్రకటించారు.

ఈ పథకం వివరాలను ఈ సమావేశంలో చర్చించారు.

హరిజనులకు యిండ్లస్థలాల కేటాయింపు

హైద్రాబాద్, జులై 2

నేడు ఆంధ్ర శాసనసభలో, ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారు జోక్యం చేసుకుంటూ, హరిజన యిండ్లస్థలాల కేటాయింపుల విషయంలోనివాటిగురించి పట్టాలు యిచ్చే విషయంలోనూ, జరుగుతున్న జాప్యం గూర్చి ప్రభుత్వం త్వరలోనే సమీక్ష చేయదలచిందని, ఈ జాప్యం జరగడానికి ఆస్కారం యిచ్చిన ప్రొసీజర్‌ను సులభతరం చేయాలని ఉద్దేశించిందని ప్రకటించారు.

సాంఘిక సంక్షేమ మంత్రిణి శ్రీమతి టి యస్. సదాలక్ష్మి, శ్రీ పి వజ్రవేలుచెట్టి అడిగిన ప్రశ్నకు ఒకదానికి సమాధానం చెబుతూ కుప్పం సబ్ తాలూకాలో ఒక్క గ్రామానికి చెందిన హరిజనులకు ఇండ్ల స్థలాలు కేటాయించబడ్డాయని, అవి వారికి అప్పుడే దఖలు చేయబడ్డాయని చెప్పారు

దానిమీద శ్రీ వజ్రవేలుచెట్టి తాను ఆ నియోజక వర్గం శాసనసభ్యుడనని తనకు తెలిసినంతవరకు ఆ యిండ్ల స్థలాలు నేటికికూడా హరిజనులకు దఖలు చేయబడలేదని అన్నారు. మంత్రిణి తమ ఆఫీసరు రిపోర్టులో అవి దఖలు పడినట్టుగ వుందని మరి శాసన సభ్యునిమాట నమ్మాలో ఆఫీసరుమాట నమ్మాలో అర్థం కావటం లేదని అన్నారు

వజ్రవేలుచెట్టిలేచి, ఈ యిండ్లస్థలాలకోసం అసలు 1958లో అర్జీ పెట్టబడిందని, తరువాత రెండు సంవత్సరాలకు అవి మంజూరు చేయబడి స్వాధీనం చేసుకోడంజరిగి సర్వేమున్నగునవి పూర్తిఅయిందని, సంవత్సరం క్రిందట అవి హరిజనులకు కేటాయింపబడ్డాయని, కాని నేటికికూడ అవి వారికి స్వాధీనం చేయబడలేదని అన్నారు. తానురెండు వారాలక్రిందటే కలెక్టరుతో ఈ విషయం ప్రస్తావిస్తే, ఈ విషయం తనకు తెలియదని అయినాఇదొక్కటీ అలాంటి విషయం కాదని అన్నారని చెప్పారు.

దానిమీద శ్రీ టి. నాగిరెడ్డిలేచి, ఇండ్లస్థలాలు హరిజనులకు స్వాధీనపరచకుండా, వారికి దఖలుపరిచినట్లు రిపోర్టు పంపినమాట విషయమై దర్యాప్తు చేయించి దఖలు చేయక పోయినప్పటికి స్వాధీన పరచినట్టు, తప్పు రిపోర్టు క్రింద ఆఫీసరు పంపించిన రిపోర్టు తప్పు అని తేలితే, ఆ ఆఫీసరుమీద చర్య తీసుకోవాలని కోరారు. ఇలాంటి తప్పుడు రిపోర్టులు అసెంబ్లీని న్యూనత పరచినట్లు అవుతుందని అన్నారు.

స్పీకరు శ్రీ బి.వి. సుబ్బారెడ్డి, ఇది తప్పుడు రిపోర్టు అని రుజువుఅయితే అది సభాహక్కుల క్రిందికి వస్తుందని, 10 వ తేదీ లోపలయితే, ఈ రిపోర్టు విషయమై దర్యాప్తుచేసి సభ్యుడు చెప్పింది నిని తాము హరిజనులకు స్థలాలు స్వాధీనపరచలేదని తేలితే, ఆ రిపోర్టు టేబిల్ మీదవుంది. ఆ ఆఫీసరుమీదతీసుకునే చర్యను వివరించవలసిందని ఆదేశించారు.

జనపనార మిల్లులు

ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 6 జనపనార మిల్లులు వున్నాయని, అవి అన్ని ప్రైవేటు రంగంలో వున్నాయని, వాటిసంఖ్య అధికం చేయాలని ప్రభుత్వం భావించడంలేదనీ అయితే, సహకార రంగంలో జనపనార మిల్లును ఒకదానిని నెలకొల్పడానికి ప్రభుత్వం సుముఖంగా వుందని శ్రీ అప్పలనాయుడు ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో చెప్పారు.

శ్రీకాకుళం జిల్లా జనపనార ఉత్పత్తిదార్ల సంఘం సహకార రంగంలో జనపనార మిల్లు పెట్టడం కొరకు ప్రభుత్వ అనుమతి కోసం, దరఖాస్తు పెట్టిందనీ, దానిని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ సిఫార్సు చేశాడని పరిశ్రమల డైరెక్టర్ కూడా ఆ దరఖాస్తు మీద తమ అభిప్రాయం చెప్పగానే రాష్ట్ర ప్రభుత్వం లైసెన్సు కోసం కేంద్రప్రభుత్వానికి సిఫార్సు చేయడానికి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. దేశంలో మొత్తం 7 45 లక్షల ఎకరాలలో జనపనార ఉత్పత్తి అవుతున్నదని అందులో 1 34 లక్షల ఎకరాలు ఆంధ్రప్రదేశ్‌లో వున్నాయని ఒక ఉపప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్రంలోని జనపనార మిల్లులు తయారుచేసిన వస్తువులు ముఖ్యంగా యితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయని చెప్పారు.

మురికిపేటల నిర్మూలన

మున్సిపల్ వ్యవహారాల మంత్రి శ్రీ ఆలపాటి వెంకట్రామయ్యగారు, శ్రీ యస్. మోహన్‌రావుగారి ప్రశ్నకు సమాధానంగా వరంగల్ పట్టణంలోని, మురికిపేటల నిర్మూలన పథకంగూర్చి శ్రీ భగవాన్‌దాస్‌గారి నుండి ప్రభుత్వానికి 30-11-63 తేదీగల విజ్ఞప్తిఅందినదని, దాని విషయమై వరంగల్ మున్సిపల్ కౌన్సిల్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయని చెప్పారు.

కుష్టు నిర్మూలన కార్యకర్తల సదస్సు

రాజమండ్రిలో ప్రారంభం

రాజమండ్రి జులై 3

భారతదేశంలో కుష్టువ్యాధి నిరోధానికి దాదాపు ఐదారు వందలమంది వైద్యులు కృషి చేస్తున్నప్పటికీ ఈవిషయంలో చాలస్వల్పమైన కృషి మాత్రమే జరిగిందని కేంద్రఆరోగ్యశాఖామంత్రి శ్రీమతి సుశీలా నయ్యర్ నేడిక్కడ ప్రారంభమైన కుష్టు నిర్మూలన కార్యకర్తల మహాసభను ప్రారంభిస్తూ అన్నారు.

ఆంధ్రప్రదేశ్ కుష్టునిర్మూలన కార్యకర్తల ప్రథమ మహాసభ నేటి సాయంత్రం యిక్కడ విక్రమహాల్‌లో ప్రారంభమైంది. ఈ మహాసభ మూడు రోజులపాటు కొనసాగుతుంది

మహాసభప్రారంభంలో ఆహ్వాన సంఘాధ్యక్షుడు డా॥ ఎ బి. నాగేశ్వరరావుసదస్యులకు స్వాగతం చెప్పారు. సర్వోదయ నాయకులు శ్రీ ప్రభాకర్‌జీ కేంద్ర ఆరోగ్య శాఖమంత్రి శ్రీమతి సుశీలా నయ్యర్‌ను సభికులకు పరిచయం చేశారు జీవకారుణ్యసంఘం కార్యదర్శి సందేశాలను చదివి వినిపించారు

ఈ మహాసభకు రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి శ్రీ వై. శివరామప్రసాద్ అధ్యక్షత వహించారు. కేంద్ర ఆరోగ్యశాఖా మంత్రి శ్రీమతి సుశీలా నయ్యర్ ప్రారంభోత్సవం చేశారు. కేంద్ర రక్షణశాఖ ఉపమంత్రి శ్రీ డి. యస్. రాజు కుష్టురోగాన్ని గురించిన వివరాలను ప్రదర్శించే ప్రదర్శన శాఖలకు ప్రారంభోత్సవం చేశారు.

శ్రీమతి సుశీలానయ్యర్ తమ ప్రసంగంలో ఇంకా ఇలా అన్నారు:

"ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి అంకితమైన కార్యకర్తలు అవసరం."

కుష్టు నిర్మూలనకు కృషిచేస్తున్న విదేశీ సంస్థలను అభినందిస్తూ ఆమె ఇలా అన్నారు:

"భారతదేశంలో రోగపీడితులకు సేవచేయడానికి వీరు వేలాది మైళ్ళ దూరంనుండి వచ్చారు. ఈకృషిలో ఈవిదేశీసంస్థలు మనకు ఆదర్శాన్ని నెలకొల్పాయి" కుష్టు నిర్మూలనకు బెల్జియంసంస్థ చేస్తున్నకృషినీ,ఆంధ్రప్రదేశ్‌లో పోగిరివద్ద డేనిష్ సంస్థ, మద్రాసువద్ద స్వీడిష్ సంస్థ కృషిని ఈ సందర్భంలో ఆమె ప్రత్యేకించి ప్రశంసించారు.

ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రావద్ద జపాన్‌సంస్థ కుష్టు నిర్మూలనా కేంద్రాన్ని నిర్మిస్తున్నదని ఆమె చెప్పారు

ఈ విదేశీ సంస్థల కృషికి ఆమె కృతజ్ఞత తెలియ జేశారు.

శ్రీ రామనారాయణ కృతజ్ఞతావందనాలతో నేటి సమావేశం ముగిసింది.

వివాహమహోత్సవం

ఆంధ్ర యూనివర్సిటీ డిప్యూటీ రిజిస్ట్రారు శ్రీ అలూరు శ్రీరామదాస్‌గారి సోదరుడు, చి॥ మురళీ కృష్ణమూర్తి M Pharm కు, కృష్ణాజిల్లా ఉంగుటూరుకాపురస్థులు శ్రీ అట్లూరు అచ్యుతరామయ్యగారి పుత్రిక చి॥ సౌ॥ విజయలక్ష్మి M B B S (4 సంవత్సరం)కు 1-7-1964 మధ్యాహ్నం గం 2-24 లకు వధువు యింటివద్ద వివాహం వైభవంగా జరిగింది

ఏజెంట్లు కావలెను

1965 కేలండర్లు మరియు డైరీల కొరకు ఉచిత ఏజెన్సీ షరతులకై వ్రాయండి.

IMPERIAL CALENDAR Co (P)Ltd,
20 Sova Bazar St **CALCUTTA-5**

మెడికల్ రిజిస్ట్రేషన్

ఆయుర్వేద, యునాని, హోమియోపతి మెడికల్ రిజిస్ట్రేషన్ శిక్షణ తరగతులు, పద్ధతులు, వివరణలు మరియు ఇతర వైద్య సంబంధిత విషయములకై వ్రాయండి: లేక కలువండి

డాక్టరు, తె. *గణేశరావు*,
15-4-71, గౌలిగూడ చమన్, పాత బస్సు డిపోవద్ద, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్.

నారసింహలేహ్యం

బంగారు చేరినది మేహము, విక్కాళ నిస్సత్తువను హరించి వీర్యవృద్ధిని, బలమును, శక్తివృద్ధిని కలిగించును. 20తు. డబ్బీ రు 8-6-0

రోజాపుష్ప లేహ్యము

అజీర్ణం, గర్భవాతం, మలబద్ధకం హరించి చక్కగా విరేచనమును, జీర్ణశక్తిని కలిగించును. 15 తు. డబ్బీ రు. 1-4-0, పోస్టేజి తు. 1-1-0. మా క్యాటలాగు, క్యాలండరు ఉచితం. పి సి.ఏ. అండ్ కో. ఆయుర్వేద వసూళులు పెరిదేపి, నెల్లూరుజిల్లా.

టెండరు నోటీసు

కొల్లిపర పంచాయతీ

గుంటూరుజిల్లా, తెనాలితాలూకా, కొల్లిపర పంచాయతీకి ఈ దిగువ నుదహరించిన వస్తువులు 1964-65 సంవత్సరానికి సప్లయిచేయుటకుగాను సీల్డుటెండర్లు ది. 13-7-64 సాయంత్రం 3 గం॥ వరకు తీసికొన బడును. సదరు సీల్డుటెండర్లు అదేరోజు సా॥ 3 గం॥ 15 నిముషాలకు హాజరైన టెండరుదార్ల సమక్షములో తెరువబడును. ఇతర వివరములు ఆఫీసు పనివేళల కాలములో తెలిసికొన వచ్చును.

1 వేరుశనగపిండి
2 పులపలు
3 తవుడు
4. ఉప్పు
5. మినరలు మిక్చరు
6 పచ్చిగడ్డి
7 ఎండుగడ్డి
8. పత్తిగింజలు

ఇందుకై కట్టవలసిన డిపాజిట్టు రు-100-00

గుంటూరు లోకల్‌లైబ్రరీ అథారిటీ వారిచే ఆమోదింపబడిన లిస్టుదాఖలా లైబ్రరీ పుస్తకములు సప్లయిచేయుటకు సీల్డుకొటేషనులు కోరబడుచున్నవి.

కొల్లిపర,
1-7-64

(సం) జి ఎ కరీం,
ఎగ్జిక్యూటివు ఆఫీసరు.

రేడియో

సోమవారం, జూలై 6

శక 1886 ఆషాఢ 15

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉదయం: 6-30 శుభోదయం, ప్రసార విశేషాలు 6-40 అం వా, 6-45 హై రిలే, 6-55 సూక్తిముక్తావళి 7-00 తె వా 7-15 కదంబం: 7-30 ఎస్ సిహెచ్ సత్యనారాయణ 8-00 అం. వా, 8-15 హై రిలే 8-30 హై. వలె, 9-00 సమాప్తి

మధ్యాహ్నం 12-30 కార్మికులకు: 1 00 ఎస్. సిహెచ్. సత్యనారాయణ, 1-30 లలితసంగీతం, 1-40 హిం. వా: 1-50 తె వా: 2-00 సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాం వా: 6-15 హై రిలే, 6-20 గ్రామస్థులకు, 7-00 తె. వా 7-15 గ్రామస్థులకు, 7-30 హై. రిలే, 8-40 లలితసంగీతం 8-55 ప్రస్తుతాంశం, 9-00 అం. వా: 9-15 ఆంగ్లమున, 9-25 ఏరామసంగీతం 9-30 ఆంగ్లప్రసంగం, 9-45 హై. రిలే, 10-00 క్రీరంజని: 10-30 అం. వా. 10-35 సమాప్తి - జన గణ మన.

హైద్రాబాద్ - ఏ

405.4 మీ (740 కిలోసై)

ఉదయం: 6-30 సుప్రభాతం కార్యక్రమ వివరణ: 6-40 అం. వా 6-45 శంకర వల్లకీ సేవా కీర్తనలు: 6-55 పల్నాటి వీర చరిత్ర, 7-00 తె వా: 7-15 సంకీర్తనం 7-30 ఎమ్. సీతారామానుజాచారి: 8-00 అం. వా, 8-15 బృందగానం: 8-30 ఇయాల్. 9-00 సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 వి. రిలే 1-00 ఇయాల్. 1-30 లలిత సంగీతం 1-40 హిం. వా: 1-50 తె వా 2-00 హై వి వలె, 2-10 ఉ వా: 2-20 హై వి. వలె: 2-30 సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు: 6-05 ప్రాం. వా, 6-15 ప్రస్తుతాంశం, 6-20 సర్గం (కదంబం హిందీ), 7-00 తె. వా, 7-15 శ్యామ్‌మీగిల్: 7-30 హై వి. వలె 8-55 ప్రస్తుతాంశం: 9-00 అం వా: 9 15

ఉ వా, 9-30 శ్యామలాదేవి 10-00 వి. రిలే 10-30 అం, వా: 10-35 సమాప్తి - జన గణ మన

హైద్రాబాద్ - బి

కడప

252.1 మీ (1190 కిలోసై)

విశాఖపట్నం

322 6 మీ (930 కిలోసై)

సాయంత్రం 6-00 నుండి రాత్రి 9-30 వరకు

89.42 మీ (3355 కిలోసై)
(హైదరాబాద్ మాత్రమే)

ఉదయం: 6-30 హై ఎ.వలె: 7-45 సమాప్తి

49.02 మీ (6120 కిలోసై)

8-00 హై. ఎ. వలె: 9-00 సమాప్తి.

42 02 మీ (7140 కిలోసై)

మధ్యాహ్నం: 12-30 హై ఎ. వలె, 2-00 ఎమ్. సీతారామానుజాచారి 2-30 సమాప్తి.

సాయంత్రం: 6-00 హై. ఎ. వలె, 6-20 గ్రామస్థులకు 7-00 తె వా: 7-15 గ్రామస్థులకు, 7-30 ఎస్ సి. సత్యనారాయణ సంగీతకచేరీ, 8-40 పరిచయపత్రం: 8-50 విరామసంగీతం: 8-55 హై ఎ. వలె, 9-15 ఆంగ్లమున, 9-25 విరామసంగీతం, 9-30 హై. ఎ. వలె 10-35 సమాప్తి-జన గణమన.

మద్రాస్ - బి

211 3 మీ (1420 కిలోసై)
60.98 మీ (4920 కిలోసై)

ఉదయం: 6-40 అం. వా: 6-45 మంగళగానం, 7-00 తె. వా: 7-15 వాద్య గోష్ఠి. 7 30 మ. ఎ. వలె: 8-00 అం. వా: 8-15 సమాప్తి

211.3 మీ 1420 కిలోసై
41 90 మీ. 7160 కిలోసై

మధ్యాహ్నం: 12-00 కార్మికులకు: 12-30 సమాప్తి.

1-00 కదంబం: 1-30 అం. వా: 1-40 గీతమంజరి: 1-50 తె. వా. 2-00 సమాప్తి.

211.3 మీ (1420 కిలోసై)
60.98 మీ (4920 కిలోసై)

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం 6-00 అం. వా: 6-05 ప్రాంతీయ తెయిదిగళ్, 6-20 వాతావరణసూచన, స్థానిక ప్రకటనలు, వాణిజ్య వార్తలు (ఆంగ్లం) 6-30 కార్యక్రమ వివరణ (తమిళం) 6-35 సీతా లక్ష్మీనరసింహన్: 7-00 తె. వా: 7-15 సంగీతమాల 7-30 తాళవాద్యకచేరీ: 7-50 సముద్రపాక్షెట్టి 8-00 శ్రోతలు కోరిన పాటలు: 8-55 ప్రస్తుతాంశం: 9-00 అం. వా. 9-15 ఆంగ్లమున, 9-30 చందమామ రావె (రూపకచిత్రం, తెలుగు) రచన: వావిలాల కృష్ణమూర్తి, 9-45 రసమయి: 10-00 భక్తరంజని, 10-35 సమాప్తి - జన గణ మన.

భారత సరిహద్దు గస్తీదళంపై పాక్ కాల్పులు

జమ్మూ, జూలై 4

జమ్మూ-కాశ్మీర్ సరిహద్దులోని కోమెల్ అనే గ్రామం వద్ద పాకిస్తాన్ సైనికులు మొన్న రాత్రి భారత గస్తీదళాలపై తేలికరకం మరతుపాకులతోనూ, రైఫిళ్ళతోనూ కాల్పులు జరిపినట్లు యిక్కడకు వర్తమానం చేరింది.

స్కాండినేవియా దేశాలలో సోవియట్ ప్రధాని శాంతియాత్ర

రాజ్యాధిపతుల మధ్య వ్యక్తిగత సంబంధాలూ, దేశాలమధ్య వర్తక, సాంస్కృతిక సంబంధాలూ, అంతర్జాతీయ ఉద్రిక్తత తగ్గుదలకూ, శాంతికి, శాంతియుత సహజీవనానికి దోహదకరమన్నది సోవియట్ ప్రభుత్వ దృఢవిశ్వాసం. సోవియట్ విదేశాంగ విధానం మూల సూత్రాలలో ఇదొకటి. సోవియట్ ప్రభుత్వపు ఈ విశ్వాసం సార్థకమన్న విషయాన్ని ఇటీవలి పరిణామాలు రుజువు చేస్తున్నాయి.

ఈ విధానాన్ననుసరించే సోవియట్ ప్రధాని కృశ్చేవ్ ప్రస్తుతం స్కాండినేవియా, డెన్మార్క్, నార్వే, స్వీడన్, ఫిన్లాండు దేశాల్లో శాంతి, మైత్రీయాత్రను సాగిస్తున్నారు

ఈ నాలుగు దేశాల్లోనూ రెండు ఫిన్లాండు, నార్వేలు సోవియట్‌తో సమాన పరిహద్దుగల దేశాలు రెండవ ప్రపంచ యుద్ధంలో, ఈరెండు దేశాలనూ నాజీ జర్మన్ సేనల దురాక్రమణ నుండి విముక్తం చేయడంలో సోవియట్‌వీరులు ప్రముఖపాత్ర నిర్వహించారు.

స్వీడన్, డెన్మార్క్ దేశాలు కూడా నిజానికి సోవియట్ పొరుగు దేశాలే.

ఈ నాలుగింటిలో నార్వే, డెన్మార్క్‌దేశాలు అమెరికా సామ్రాజ్యవాదుల పెత్తనం క్రింద ఉన్న అట్లాంటిక్ యుద్ధకూటమి సభ్యదేశాలు. స్వీడన్, ఫిన్లాండు దేశాలు తటస్థ దేశాలు

డెన్మార్క్, నార్వే, స్వీడన్ దేశాలకు సోవియట్ ప్రధాని వెళ్ళడం ఇదే మొదటిసారి

ఈ యాత్ర జరుగగలదన్న వార్త అట్లాంటిక్ కూటమి వర్గాల్లో, ముఖ్యంగా అమెరికా, పశ్చిమ జర్మనీ పాలక వర్గాల్లో ఎక్కడలేని కంగారు కలిగించింది. ఈ యాత్ర జరక్కుండా చేయడానికి వారు తమ శక్తికొలది ప్రయత్నించారు ప్రజల్లో లేనిపోని అనుమానాలను వ్యాపింపజేయడానికి కృషి చేశారు. కృశ్చేవ్ విడిది కోసం మంచిమంచి భవనాలు దొరకనీయకుండా చేయడానికికూడా వారు తమ పలుకుబడిని ఉపయోగించారంటే ఈ యాత్రను భగ్నంచేయాలనే తాపత్రయంతో వారెంతనీచస్థాయికిదిగజారారో స్పష్టమవుతుంది. విడిది కోసం ఆ యా దేశాల ప్రభుత్వాలు తగుఏర్పాట్లు చేసిన తరువాత కూడా వాటిని ప్రేలగొట్టేందుకు కుట్రలు జరిగాయన్న వాతావరణం సృష్టించడానికికూడావీరు తమఏజంట్లద్వారాప్రయత్నించారు

ఈ దేశాలకు కృశ్చేవ్ రావడం పట్ల ఈ సామ్రాజ్యవాదు యుద్ధోన్మత్త వర్గాలు ఇంత కంగారు పడటానికి ప్రబలమైన కారణం లేకపోలేదు

అట్లాంటిక్ కూటమిపట్ల, అది అనుసరిస్తున్న అణ్వస్త్రవిధానాలపట్ల డెన్మార్క్, నార్వే దేశాల్లోనే అనుమానాలు ప్రారంభమయాయి. అనేక సందర్భాల్లో వాటిపట్ల విముఖత కూడా వ్యక్తమయింది. తమ తమ భూభాగాలపై విదేశీ సేనలను-అట్లాంటిక్ కూటమిలోని ఇతర సభ్య దేశాల సేనలను-ఉంచేందుకు ఆ రెండు దేశాల ప్రభుత్వాలు అనుమతి నిరాకరించాయి. అంతే కాదు. అమెరికా ఆధ్వర్యాన ఏర్పరచబడిన అట్లాంటిక్ కూటమి ఉమ్మడి అణ్వాయుధబలం పథకంలో వంతు కలవడానికి కూడా నార్వే డెన్మార్క్ దేశాలు నిరాకరించాయి.

మాస్కోలో జరిగిన అణ్వస్త్ర పరీక్షల పాక్షిక నిషేధపు ఒడంబడికపై ఈ నాలుగు దేశాలు సంతకం చేశాయి.

స్వీడన్ ప్రభుత్వం, స్కాండినేవియాదేశాలు నాలుగూ కలిసి అణ్వస్త్ర రహితక్షేత్రంగా ఏర్పడాలని ఇటీవల ఒక ప్రతిపాదన చేసింది. ఫిన్లాండు అధ్యక్షుడు కెక్కొనెన్, ఉత్తర యూరప్ దేశాలన్నీ కలిసి పరస్పర బాధ్యతల ప్రాతిపదికపై ఒక అణ్వస్త్రరహిత మండలంగా ఏర్పడాలని ఒక ప్రతిపాదన చేశారు. ఈ ప్రతిపాదనలపై ఆదేశాల్లో పరిశీలన జరుగుతూంది.

దీనికితోడు, ఈ నాలుగు దేశాలు సోవియట్‌తో వర్తక, సాంస్కృతిక సంబంధాలను నానాటికి పెంచుకుంటున్నాయి ఫిన్లాండు, సోవియట్ దేశాల మధ్య పరస్పర స్నేహ, సహకార సంధి ఇదివరకే ఏర్పడి ఉంది.

సోవియట్, డెన్మార్క్ దేశాలమధ్య తొలిసారిగా 1963 నవంబరులో వర్తక ఒడంబడిక కుదిరింది. అంతకు క్రితం సంవత్సరంలో రెండు దేశాలమధ్య సాంస్కృతిక ఒప్పందం కుదిరింది.

సోవియట్, స్వీడన్ దేశాలమధ్య వర్తక, సాంస్కృతిక సంబంధాలు చాలా సంవత్సరాలుగా సాగుతున్నాయి.

నార్వే సోవియట్ దేశాలమధ్య కూడా 1963 లో ఒక వర్తక ఒప్పందం కుదిరింది. ఉభయ దేశాలమధ్య 1964,65 సంవత్సరాల్లో మరింత విస్తృతమైన వర్తకం గురించి ఇటీవలనే మరొక ఒప్పందంకూడా కుదిరింది.

వీటన్నిటినిబట్టి స్కాండినేవియా రంగంలో మొత్తంమీద గాలి ఎటు వీస్తుందో అట్లాంటిక్ కూటమి వర్గాలు గ్రహించకపోలేదు అందుకే కృశ్చేవ్ ఆ దేశాల్లో పర్యటిస్తున్నారంటే వారికంత కంగారు.

అట్లాంటిక్ కూటమినట్ల నార్వే, డెన్మార్కు దేశాలకు గల బాధ్యతలను గురించి జ్ఞాపకం చేసి, ఈ పర్యటనను రద్దుచేయించడానికి లేదా కనీసం దానివల్ల 'అవాంఛనీయమైన ఫలితాలు' లేకుండా చేయించడానికి పశ్చిమజర్మనీ పత్రిక జనరల్-ఆంజీగర్ కడసారిగా ఒక ప్రయత్నం చేసింది ఇంతచేసినా లాభం లేకపోయింది.

ఆ దేశాల్లో కృశ్చేవ్ పర్యటన విజయవంతంగా సాగుతూంది. ఎక్కడికి వెళ్ళినా కృశ్చేవ్‌పట్ల, ఆయన నాయకత్వంక్రింద సోవియట్ ప్రభుత్వం అనుసరిస్తున్న శాంతి, శాంతియుతసహజీవనవిధానాలపట్ల, ఆదేశాలప్రజలకు గల గాఢాభిమానం ప్రస్ఫుటంగా వ్యక్తమవుతూంది ఆ యా దేశాల ప్రభుత్వాధిపతులు కూడా ఈ విధానాలపట్ల శ్రద్ధాసక్తులను వ్యక్తంచేయక తప్పడంలేదు అట్లాంటిక్ కూటమి సభ్య దేశమయిన నార్వే ప్రధాని గెర్హార్డ్, కృశ్చేవ్‌ని అభినందిస్తూ "శాంతియుత సహజీవన సూత్రం కృశ్చేవ్ నామధేయం-తోవిడదీయ వీలులేనంతగా ముడిపడి ఉన్నదనీ 'శాంతియుతసహజీవనం యుద్ధాన్ని నివారించేదర్యమాత్రమేకాదు, అంతర్జాతీయసంబంధాలన్నిటికీమూలాధారమని తాము భావిస్తున్నామ"ని అన్నారంటే, ఈ పర్యటన స్కాండినేవియా రంగంలో ఎటువంటి ప్రగాఢమైన ప్రభావం కలిగిస్తున్నదో స్పష్టంకాగలదు.

కృశ్చేవ్ నాయకత్వాన సోవియట్ అనుసరిస్తున్న శాంతి, శాంతియుత సహజీవన విధానాల సార్థకతకు, ఈ పర్యటన మరొక ప్రబల నిదర్శనం కాగలదు.

—తాపీ మోహనరావు

వింబుల్డన్ టెన్నిస్ పోటీల్లో ఎమర్సన్ విజయం

లండన్, జూలై 3

వింబుల్డన్ టెన్నిస్ సింగిల్స్ ఫైనల్ ఛాంపియన్‌షిప్ పోటీలలో ఆస్ట్రేలియా ఆటగాడు ఫ్రెడ్‌స్టోలిని ఓడించి రాయ్ ఎమర్సన్ ఛాంపియన్‌షిప్‌ను పొందారు.

స్కోరు ఈ విధంగా ఉంది: 6-4, 12-10, 4-6, 6-3.

వ్యవసాయ వస్తు ధరలు

విజయవాడ జూలై 4

విజయవాడ రీజనల్ అసిస్టెంట్ మార్కెటింగుడైరెక్టరు నేడు అందజేసిన ఉత్పత్తిదారులనుండి కొనుగోలుచేయు టోకుధరలు (ఒక క్వింటాల్ 100 కిలోగ్రాములు, సేర 220¼ పౌనులు)

ధాన్యం

వంబర్లు:	విజయవాడ	రు	46 66	34 98
,,	కాకినాడ		47 66	34 75
,,	చిత్తూరు		53 33	40 00
అక్కుల్లు:	విజయవాడ		41 33	30 00
,,	తాడేపల్లిగూడెం		41 33	31 50
,,	కాకినాడ		43 33	31 00
,,	అముదాలవలస		44 00	33 00
సన్నకృష్ణకాటుకలు:				
	తాడేపల్లిగూడెం		44 00	33 00
సన్నాలు:	అముదాలవలస		45 33	34 00
మొలకొలుకులు:	నెల్లూరు		47 64	35 30

మిల్లు బియ్యం

వంబర్లు:	విజయవాడ	రు. 81 00
,,	కాకినాడ	77 03
అక్కుల్లు:	విజయవాడ	63 00
,,	తాడేపల్లిగూడెం	63 51
,,	కాకినాడ	69 32
,,	అముదాలవలస	71 51
సన్నకృష్ణ కాటుకలు:		
,,	తాడేపల్లిగూడెం:	68 92
వంబర్లు	చిత్తూరు	85 48
సన్నాలు:	అముదాలవలస	74 71
మొలకొలుకులు:	నెల్లూరు	77 41

వేరుశనగ

కాయలు	విజయవాడ	80 00
,,	నంద్యాల	92 50
,,	ఆదోని	[illegible]
,,	విజయనగరం	88 80
పప్పు	విజయవాడ	125 00
,,	నంద్యాల	125 00
,,	ఆదోని	125 00
,,	విజయనగరం	133 33
నూనె	విజయవాడ	247 50
,,	నంద్యాల	241 50
,,	ఆదోని	236 00
,,	విజయనగరం	251 00

అపరాలు

కందులు:	విజయవాడ	రు. 85 00
,,	గుంటూరు	84 00
,,	అముదాలవలస	75 37
మినుములు:	విజయవాడ	74 00
,,	గుంటూరు	74 00
,,	అముదాలవలస	60 11
పెసలు:	విజయవాడ	90 00
,,	గుంటూరు	88 00
,,	అముదాలవలస	84 34
శనగలు:	విజయవాడ	70 00

జొన్నలు

అనంతపురం:	తెల్లవి	50 00
నంద్యాల:	పచ్చవి	47 00

బెల్లం

అనకాపల్లి:	మొదటిరకం	86 70
,,	మూడవరకం	68 70
చిత్తూరు	మొదటిరకం	77 01
,,	మూడవరకం	88 88

తీడి పత్తి

వేటపాలెం:	అమెరికన్‌రకం	రు. 882 [illegible]
,,	దేశవాళీ	659 00
,,	బద్దలు	591 00
,,	ముక్కలు	590 00

మిర్చి

జి2 ఒకటవ రకం గుంటూరు	190 00
జి రెండు 2వ రకం ,,	185 00
జి2 చర్ల రకం ,,	205 00

నెయ్యి

	పల్నాడు	దేశవాళీ
గుంటూరులో	600 00	610 00

కొబ్బరికాయలు

(వెయ్యింటికి ధరలు)	కొత్తవి:	పాతవి
విజయవాడ:	165 00	215 00
రాజమండ్రి	140 00	190 00
పాలకొల్లు:	165 00	190 00

పసుపు

దుగ్గిరాలలో:	కొమ్ములు	రు. 128 50
,,	కాన్పూరు	148 50
,,	దుంపలు	119 00
కడపలో	కొమ్ములు	124 00
,,	దుంపలు	104 00

కావలెను

1965 సంవత్సరపు మా బొమ్మల కేలండర్లకు ఆర్డర్లు బుక్ చేయుటకు ఆకర్షణీయమైన కమిషన్ పద్ధతిపై ఏజంట్లు కావలెను. పాత బొమ్మలు అమ్మే డీలర్లుకూడా అప్లయి చేయవచ్చును. ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషుతో మాత్రమే.

ELEGANT CALENDARS
Raja Mansions, Sivakasi (S India)

B P.

B.S.C. Quality Shoes

ఉత్పత్తిచేయువారు:
బాటా షూ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్

చూపులందు మంచిది
నడచుటకు మంచిది
మన్నుటలో మంచిది



జూలై 10 విడుదల

అన్నపూర్ణా వారి

డాక్టర్ చక్రవర్తి

నిర్మాత డి.మధుసూదనరావు B.A ✱ దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు

సంగీతం-ఎస్ రాజేశ్వర రావు ✱ నిర్మాణం.శ్రీ సారథీ స్టూడియోస్ (హైదరాబాద్) ✱ నవయుగ విడుదల

సంపాదకవర్గం: కాట్రగడ్డ రాజగోపాలరావు (అధ్యక్షులు) ఏటుకూరు బలరామమూర్తి, తుమ్మల వెంకటరామయ్య. విశాలాంధ్ర విజ్ఞానసమితి తరఫున ఎడిటర్, ప్రింటర్, అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు స్వతంత్ర అర్థ ప్రింటర్స్, విజయవాడ-4.